

www.jagritiweekly.com

సంపుటి : 76 సంచిక : 15 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మాఘ శుద్ధ దశమి

19-25 ఫిబ్రవరి 2024

వెల : ₹20/-


## ఎన్నికల ముందు తెరుచుకుంటున్న టూల్‌కిట్లు

ఒకటి నిజం. లోక్‌సభ ఎన్నికల వేళ కుట్ర పథకాలు వేగంగా కదులుతున్నాయి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


# లక్క ఇల్లు హిందువులదే



హిందువులకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన, మహాభారత కాలం నాటి ప్రదేశం కోసం గత ఐదు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో సున్నీ ముస్లిం వక్ఫ్ బోర్డు చేస్తున్న పోరాటం విఫలమైంది. ఉత్తర ప్రదేశ్‌లోని బర్నావ గ్రామంలో గల 108 భీగాల భూమిపై హక్కులు తమవేనంటూ వక్ఫ్ బోర్డు చేస్తున్న పోరాటానికి భాగ్‌పట్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి శివం ద్వివేది తన తీర్పుతో ముగింపు పలికారు. ఆ భూమి హిందువులకు చెందుతుందని ఫిబ్రవరి 5, 2024న తీర్పు చెపుతూ ఈ సుదీర్ఘ పోరాటానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

వర్నవ్రత్‌గా ఒకనాడు ప్రాచుర్యం పొందిన నేటి బర్నవలోని ఆ భూమి మధ్యలో మహాభారత కాలంనాటి లక్క ఇంటి తాలూకు ఆనవాళ్లు కనిపిస్తాయి. పాండవులను వనవాసానికి పంపిన సమయంలో వారిని అంతం చేసేందుకు, వారు నివాసముంటున్న లక్క గృహాన్ని దుర్యోధనుడు దహనం చేయించినప్పుడు, వారు దాని అడుగున తవ్విన సొరంగం నుంచి తప్పుకున్నారన్నది కథనం. సొరంగం అక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్లనే ఈ ప్రదేశం నేటికీ సనాతన అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు చేపట్టిన తవ్వకాలలో క్రీ.పూ.నాటి గృహనిర్మాణాల ఆనవాళ్లు ఇంటి నిర్మాణానికి మట్టి ఇటుకలు, గోడలు రెల్లుగడ్డి, మట్టి కలిపి ప్లాస్టర్ చేసిన గోడలు హస్తినాపురంలో వచ్చిన వరదలలో కనిపించిన ఆనవాళ్లవంటివి లభించి, ఆ నిర్మాణం ఆ కాలానికి చెందిందనే విషయాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి.





ఆ ప్రదేశంలో ఉన్న దిబ్బ 'షేక్ బదురుద్దీన్ మజార్ (సమాధి)' అని, పక్కనే ఉన్న మందిరం ముస్లింల స్మశానమని పేర్కొంటూ ఈ కేసును సున్నీ వక్ఫ్ బోర్డు తరుపున ముఖీం ఖాన్ అనే వ్యక్తి 1972లో మీరట్ కోర్టులో కేసు దాఖలు చేశాడు. హిందువుల పక్షాన కృష్ణదత్ మహారాజ్ అనే వ్యక్తి, అది మహాభారత కాలంనాటి లక్క గృహమని, అది హిందువుల వారసత్వసంపద అంటూ ముస్లింల వాదనలను వ్యతిరేకిస్తూ కోర్టులో పోరాటం చేశారు. అయోధ్య విషయంలో ఐదు శతాబ్దాలు అయితే, లక్క గృహం విషయంలో ఐదు దశాబ్దాలు మాత్రమే పట్టడం విశేషం.

ఇటువంటి తీర్పులు, విజయాలు వచ్చినప్పుడు హిందువులు సంబరాలు చేసుకోవడమే కాకుండా, తమ వారసత్వ సంపదను కాపాడుకోవలసిన బాధ్యత తమపై ఉందనే విషయాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..





జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.



సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

విడి ప్రతి
రూ.20/-

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ. 624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**సూచనలు :**

- మీ చందాని చెల్లించేటప్పుడు పూర్తి చిరునామాని పిన్‌కోడ్, ఫోన్ నెం.తో సహా వ్రాయాలి.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీ ఫోన్ కి CP-JAGRIT అనే ఐ.డి.తో ఎస్.ఎమ్.ఎస్. వస్తుంది. ఆ వెంటనే పత్రిక అందుతుంది.
- పత్రిక అందకపోయినా, మీ చిరునామాలో తేడాలున్నా మీ చందా నెం. లేదా ఫోన్ నెం. వివరాలతో మా కార్యాలయానికి ఉ॥ 11 గంటల నుండి సా॥ 6 గంటల మధ్య ఫోన్ చేయగలరు.

**Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad
IFSC : UTIB0002157,
PAN : AAATJ3829L

ఇతర వివరాలకు సంప్రదించండి
**సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013**

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040–27561453/9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

రాజా రామమోహనరాయ్, బంకించంద్ర, టాగూర్, సుభాష్‌బోస్ వంటి వారు పుట్టిన గడ్డకు పట్టిన దుర్గతి ఇది. ఇదే ఆధునిక బెంగాల్ దుస్థితి. ఇదంతా ఒక మహిళ ముఖ్యమంత్రిగా అఘోరిస్తున్న రాష్ట్ర వాస్తవిక చిత్రమంటే నమ్మక తప్పదు. అధికార పార్టీలోని గూండాలూ, పోలీసులూ చెట్టాపట్టాలేసుకుని బడుగు బలహీన వర్గాల మహిళలను ఇళ్ల నుంచి ఎత్తుకు పోయి 'తృప్తి పడిన తరువాత' వదిలి పెడుతున్నారు. ఈ కీచకపర్వానికి అధికార పార్టీ కార్యాలయాలే పడగ్గదులు. ఈ అన్యాయమంతా కేవలం హిందూ స్త్రీల మీదనేనన్నది మరొక దిగ్భ్రాంతికర వాస్తవం. తన ఏలుబడిలో ఎంతటి అఘాయిత్యాలు జరిగినా, రక్తం పారినా బీజేపీ మీద విమర్శ చాటున, సెక్యులరిజం రక్షణ నినాదాలతో పదవిని కాపాడుకొస్తున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాక్షసపాలనలో నిజంగా ఇదొక కొత్త అధ్యాయం. ఆమెకు సిగ్గూ, శరం ఉంటే ఈ పాటికి రాజీనామా చేసి ఉండేది. కనీసం ఇంతటి నీచ ప్రవృత్తి ఉన్న పార్టీ నేతలను అరెస్టు చేయించేది. రెండూ జరగలేదు. అసలు నోరు కూడా విప్పలేదు. ఆ ధైర్యం ఆమె చేయలేదు. ఇదీ ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడతానంటూ వీరంగం వేసే కీలక విపక్ష నేత ఘనత. ఈ ఉదంతం మీద మాట్లాడితే బీజేపీకి బలం చేకూర్చడమేనను కుని గట్టిగా నమ్ముతున్నందుకు కాంగ్రెస్ వంటి విపక్షాలు, ఉదారవాదులు ఆ నేరంలో భాగస్వాములైపోయారు.

'సర్వే పేరుతో పార్టీ (తృణమూల్ కాంగ్రెస్) వాళ్లు ఇళ్లకు వస్తారు. వయసులో ఉన్న ఇల్లాళ్ల, అమ్మాయిల ఆచూకీ లాగుతారు. ఆపై వాళ్లని పార్టీ కార్యాలయాలకి తీసుకుపోయి, మోజు తీరే వరకు ఉంచేస్తారు' ఇవి సందేశ్‌ఖాలీ అనే ప్రాంతంలో యథేచ్ఛగా జరిగిన అత్యాచారాల తీరు గురించి ఒక మహిళ వీడియో ద్వారా చెప్పిన మాటలు. ఇదంతా ఘనత వహించిన తృణమూల్ కాంగ్రెస్ ఏలుబడి స్వరూపం. ఉత్తర 24 పరగణాల జిల్లాలో జరిగిన ఈ ఆటవిక దుశ్చర్యకు కారకుడు షేక్ షాజహాన్. అసలే కోతి, ఆపై కల్లు తాగింది అన్నట్టు ఇతడొక మాఫీయా డాన్. ఆపై తృణమూల్ కాంగ్రెస్

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మాఘ శుద్ధ దశమి**




ముఖపత్ర కథనం

## ఎన్నికల ముందు తెరుచుకుంటున్న టూల్‌కిట్లు

త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఈసారి కూడా అధికారంలోకి వచ్చేది తామేనంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో బల్లగుద్ది మరీ చేసిన ప్రకటనతో ప్రతిపక్షాల గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. వాస్తవానికి ఆ సత్యం వారికి తెలిసిన విషయమే. పైగా ప్రధాని అంత ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తున్నారు. అందుకే మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలకు తెరతీశారు. వారికి మోదీ సామర్థ్యం పట్ల గల ద్వేషం దేశం పట్ల ద్వేషంగా మారడం క్షమార్హం కానిది. జాగృతి గతంలో చెప్పినట్టు భారతీయ జనతా పార్టీ విధానాలను భగ్నం చేయడానికీ, భారతదేశ సమగ్రతను చెదరగొట్టడానికి మధ్య వ్యత్యాసాన్ని చాలా విపక్షాలు పూర్తిగా విస్మరించాయి.

**సవరణ:** 12–18 ఫిబ్రవరి సంచికలో (2వ పేజీ) సంగీతకారుడు త్యాగరాజు ఆరాధనోత్సవాలపై ఇచ్చిన వార్తలో 'నగుమోము కనలేని' కీర్తనను 'పంచరత్న'లో ఒకటిగా పొరపాటున పేర్కొన్నాం. ఆయన జన్మస్థలం పేరును తిరువైయార్ అని చదువుకోవాలని మనవి. పొరపాటుకు చింతిస్తున్నాము.


*లోపలి పేజీలలో...*

కథ
**సుమిత్ర**
ఎం. హనుమంత రావు


20లో


26లో

ప్రత్యేక వ్యాసం
**ఈ వనమాతలు 'వర' దేవతలు**

పురస్కారం
**మరో ముగ్గురికి**


30లో

# జాగృతి

## సంపాదకీయం

నాయకుడు. మైనారిటీ, ఆపై జిల్లా పరిషత్ సభ్యుడు. టీఎంసీ నేతలు, పోలీసులు ఎంతగా బరితెగించారో కనికాదాస్ అనే మహిళ మాటలు వింటే అర్థమవుతుంది. తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో 20 నుంచి 30మంది వచ్చి మా ఇంటి తలుపులు బాదారు. చివరికి కిటికీ పెరికి చొరబడ్డారు. తన చేతిలోని ఆడశిశువులను కూడా కిందపడేశారు. తనను తీసుకుపోయారని చెప్పిందామె. వాళ్లు వచ్చి ఒక మహిళను ఎత్తుకుపోతారు. రాత్రంతా పార్టీ కార్యాలయంలో ఉంచి, మళ్లీ ఉదయమే వదులుతారు అని మరొక మహిళ వాపోయింది.

## సందేశ్‌ఖాలి సందేశం

'షాజహాన్, ఇతడి అనుచరగణం బంగ్లా సరిహద్దులలోని సందేశ్‌ఖాలీలో అక్షరాలా భీతావహ పాలనను సాగిస్తున్నారు. ఈ నీచుడి మీద మహిళలు చెప్పిన విషయాలు దారుణంగా ఉన్నాయి. ఒక వ్యక్తి ఒక మహిళకు భర్త అయి ఉండవచ్చు. కానీ అతడికి ఆమె మీద అధికారం ఉండదు. తన భార్యను తీసుకుపోతున్నా ఏమీ అనలేని పరిస్థితి. ఈ ప్రతాపమంతా అక్కడ ఎక్కువగా ఉండే ఎస్‌సీ, ఎస్‌టీ వర్గాల మీదే. వారి ఆత్మగౌరవాన్ని షాజహాన్ మనుషులు నిరంతరం నేల రాస్తున్నారు. బడుగువర్గాల, ఎస్‌టీల భూములను ఆక్రమిస్తున్నారు' అని శాసనసభలో బీజేపీ పక్ష నాయకుడు సువేందు అధికారి ఫిబ్రవరి 11న ఆరోపించారు. ఇప్పుడు గుట్టు రట్టయింది. సందేశ్‌ఖాలీ ప్రాంతంలో చాలాచోట్ల ఉద్రిక్త వాతావరణం ఉంది. కొన్ని చోట్ల 144వ సెక్షన్ విధించారు. స్థానికులు, ప్రధానంగా మహిళలు కర్రలు చేతపట్టి ఆవేశంతో నిరసనలకు దిగుతున్నారు.

ఈ గొడవ అంతా షాజహాన్‌ను అరెస్టు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సభ్యులు వెళ్లడంతో గుప్పుమంది. భూమి కబ్జాలు, మహిళలను చెరపట్టడం వంటివాటితో పాటు రేషన్ అవకతవకల ఆరోపణలు కూడా షాజహాన్ మీద ఉన్నాయి. రేషన్ వ్యవహారంలోనే అతడి అరెస్టుకు ఈడీ జనవరి 5న వెళ్లింది. వందలాది షాజహాన్ గూండాలు అధికారుల మీద దాడికి దిగి, అతడు జారుకునే వీలు కల్పించారు. ఇప్పటికీ అతడి జాడ లేదు. అందివచ్చిన ఈ అవకాశాన్ని తీసుకుని స్థానికులు, ఎక్కువగా మహిళలు షాజహాన్‌కూ, అతడి గూండాలకూ వ్యతిరేకంగా నిరసనలు ఆరంభించారు. అంటే అక్కడ ఈ షాజహాన్ సృష్టించిన భయానక వాతావరణం ఎలా ఉందో ఊహించుకోవచ్చు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ లీనా గంగోపాధ్యాయ అక్కడికి వెళ్లారు. గవర్నర్ సీవీ ఆనందబోస్ వెళ్లడానికి ప్రయత్నిస్తే టీఎంసీ గూండాలు కాన్వాయ్‌ని ఆపేశారు. నిధుల విడుదలలో కేంద్రం చేస్తున్న జాప్యానికి నిరసనగా గవర్నర్ కాన్వాయ్‌ని అడ్డుకున్నట్టు చెప్పడం పరమ వికృతంగా ఉంది. 'తీవ్రంగా కలత పెట్టే' ఈ దురంతం మీద నివేదిక ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది. షాజహాన్ అరాచకమంతా హిందువుల మీదే సాగిందని కొన్ని మీడియా సంస్థలు పేర్కొనడం గమనార్హం. మాటలకు అందని ఇలాంటి అకృత్యం జరిగినా, బాధితులు బడుగువర్గాలే అయినా పోలీసులు నిస్సిగ్గుగా నిందితుల తరపున పనిచేయడం మరీ దిగ్భ్రమ గొలుపుతుంది. ఫలితమే నిరసనలను అణచివేయడానికి విధించిన 144వ సెక్షన్.

ఇదంతా ముస్లింల బుజ్జగింపు ధోరణిలో బయటపడుతున్న మరొక కోణమే. హిందూ సమాజాన్ని ఎదుర్కొనలేమని అర్థమైన ముస్లిం గూండాలూ, మతోన్మాదులూ, నేతలూ ఇప్పుడు హిందూ మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. లవ్ జిహాద్‌కు మించిన అకృత్యమిది. ఇందులో మమత వంటి వారి నీచమైన పాత్ర నిజం. ఎప్పుడూ మధ్యయుగం నాటి మనస్తత్వంతో ఉండే ముస్లిం గూండాలకు ఈ ధోరణి మరింత రుచిస్తుంది. దీనిని హిందూ సమాజం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




38లో

కథ

**ఆఖరి నగరం**

డాక్టర్ చిత్తర్వు మధు
(సైన్స్ ఫిక్షన్)





| | | |
|---|---|---|
| ఆరు గ్యారంటీలతో అధిక భారం (తెలంగాణ) | - | 14 |
| ఎన్నికల కరపత్రంగా మధ్యంతర బడ్జెట్ (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| విఖ్యాత నృత్యవిదుషీమణి రుక్మిణి (మహిళ) | - | 24 |
| యూరప్‌ను హడలెత్తిస్తున్న రైతు ఉద్యమం (అంతర్జాతీయం) | - | 28 |
| వృద్ధ నాయకత్వం దిశగా అగ్రదేశం (అంతర్జాతీయం-1) | - | 35 |
| యోగాతో రోహన్ కు టెన్నిస్ 'మహాయోగం'! (క్రీడ) | - | 43 |
| బాల జాగృతి | - | 46 |
| అక్రమ ఆయుధ రవాణ అరికట్టే 'ఈగిల్' (సినిమా) | - | 50 |

370- ఈ అంకెలు చెవిన పడితే మన విపక్షాలకు మెదడు మొద్దు బారిపోతున్నదా? కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణ రద్దు ఇచ్చిన షాక్ నుంచి విపక్షాలు ఇప్పటికీ కోలుకోలేకపోయాయనే చెప్పాలి. తమ ఎన్‌డీఏ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, 370 స్థానాలు తగ్గకుండా బీజేపీ గెలుచుకుంటుందని మోదీ ఈ పార్లమెంట్‌లో ఇచ్చిన తుది ఉపన్యాసంలో చెప్పడం మళ్లీ మెదడు మొద్దుబారిపోయేటట్టు చేసింది. 370 అధికరణం రద్దు పరిణామాలను గుర్తుకు తెచ్చింది. 2024 ఎన్నికలలో బీజేపీ గెలుపు నల్లేరు మీద నడకేనన్న సంగతి విపక్షాలకు తెలియనిది కాదు. తాము పార్లమెంటుకు మళ్లీ వస్తామని మోదీ అత్యున్నత చట్టసభ సాక్షిగా చెప్పారు. ఇక విపక్షాల ధోరణి ఏమిటి? బీజేపీ విజయం సాధించకుండా రోడ్ల మీద పోరాటం చేస్తామని చెప్పక చెబుతున్నాయి. ఇటీవలి సంఘటనలన్నీ ఇందుకు సంబంధించినవే. ఢిల్లీలో రైతుల పేరిట ఖలిస్తానీలు వీరంగం, హల్ద్వానీ ఉదంతం, ఉత్తరప్రదేశ్‌లో మత గురువు తౌకీర్ ఆందోళనల పిలుపు. ఇవన్నీ బీజేపీ ప్రభావం తగ్గించేందుకే. అయోధ్యలో బాలక్‌రామ్ ప్రతిష్ఠతో పెరిగిన మోదీ గ్రాఫ్ కూడా వీరిని ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

# ఎన్నికల ముందు తెరు

ఢిల్లీలో మళ్లీ 'రైతు' ఆందోళన! ఫిబ్రవరి 13వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభమైనప్పటికీ అంతకు ముందే అక్కడ రైతుల పేరుతో ఖలిస్తానీలు తిష్ట వేశారు. 12వ తేదీ సాయంత్రం ముగ్గురు కేంద్ర మంత్రుల బృందం రైతు సంఘాలతో చర్చించింది. అంతా ఊహించినట్టుగానే చర్చలు విఫలమయ్యాయి. ఇక్కడ విషయం సమస్యకు పరిష్కారం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టను దిగజార్చడం. అందుకే చర్చల ఫలితాలతో నిమిత్తం లేకుండానే చలో ఢిల్లీ అంటూ ఆందోళనకు దిగారు. 2020-21లో ఏ నినాదాలతో ఆందోళనకు దిగారో, మళ్లీ అదే పాచిపాట వినిపిస్తున్నారు. వీరి ఆందోళనలో న్యాయం ఎంతో ప్రజలు ఇప్పటికే గ్రహించారు. రైతులను నడిరోడ్డు మీదే తూర్పార పడుతున్న సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీ అంతటా 144 సెక్షన్ విధించారు. ఆందోళన ఆరంభంలోనే పంజాబ్-హరియాణా శంభు సరిహద్దులలో పోలీసులు ఆందోళనకారుల మీద టియర్ గ్యాస్ ప్రయోగించవలసి వచ్చింది. ఇది ఏ మలుపు తీసుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. ఒకటి నిజం. లోక్‌సభ ఎన్నికల వేళ టూల్‌కిట్లు (కుట్ర పథకాలు) వేగంగా తెరుచుకుంటున్నాయి.

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఈసారి కూడా అధికారంలోకి వచ్చేది తామేనంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో బల్లగుద్ది మరీ చేసిన ప్రకటనతో ప్రతిపక్షాల గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. వాస్తవానికి ఆ సత్యం వారికి తెలిసిన విషయమే. పైగా ప్రధాని అంత ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తున్నారు. అందుకే మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలకు తెరతీశారు. వారికి మోదీ సామర్థ్యం పట్ల గల ద్వేషం దేశం పట్ల ద్వేషంగా మారడం క్షమార్హం కానిది. మేము గతంలో చెప్పినట్టు భారతీయ జనతా పార్టీ విధానాలను భగ్నం చేయడానికీ, భారతదేశ సమగ్రతను చెదరగొట్టడానికి మధ్య వ్యత్యాసాన్ని చాలా విపక్షాలు పూర్తిగా విస్మరించాయి. ఇప్పుడు జరుగుతున్నదీ అదే. మోదీ కులం గురించి మాట్లాడి రాహుల్ గాంధీ బొక్క బోర్లా పడ్డారు. ఇందులో విజ్ఞత ఏమిటో జనం గమనించారు. ఇండీ కూటమి ఘోర వైఫల్యం తెచ్చిన తలవంపుల నుంచి కూడా వారు కోలుకోలేరు. తాను ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా మోదీ పరిణామం చెందడాన్ని ప్రతిపక్షాలు సహించలేక పోతున్నాయి. ఆయనను నిలువరించాలని గత దశాబ్ద కాలంగా వారు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. మళ్లీ అవే పాత పాచికలతో ఎన్నికల వేళ విపక్షాలు, వాటి తైనాతీలు, భారత వ్యతిరేక అంతర్జాతీయ శక్తులు మళ్లీ ప్రయత్నం ప్రారంభించాయి. గతంలో జరిగిన సీఏఏ వ్యతిరేక ఆందోళనలు, రైతాంగ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనలే ఇందుకు సాక్ష్యం. నిజాన్ని కప్పిపెట్టి, అబద్ధాలు ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించి, రెచ్చగొట్టడం ప్రతిపక్షా పార్టీలకు నిత్యకృత్యంగా మారింది. వారు ఈ ఆందోళనలను చేపట్టేందుకు విదేశీ శక్తుల నుంచి కూడా నిధులు వస్తున్న విషయం ఆ ఘటనల విచారణలో తేలిన సంగతి మనందరికీ తెలిసిందే.

తాజాగా దేశంలో చోటు చేసుకుంటున్న ఘటనలను కూడా ఈ దృక్పథంలోనే చూడవలసి ఉంటుంది. హల్ద్వానీలో హింస, తాజాగా పంజాబ్



ఢిల్లీ హరియాణా దారిలో రైతుల ఆందోళన



# చుకుంటున్న టూల్‌కిట్లు

రైతుల ముసుగులో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఖలిస్తానీలు చేస్తున్న డిమాండ్లు, నిరసనలు, దక్షిణాన తమిళనాడులో అధికారంలో ఉన్న డిఎంకె పార్టీ అసెంబ్లీలో జాతీయగీతాన్ని అవమానించి తమ వేర్పాటువాద వైఖరి బయటపెట్టుకోవడం, ఇందుకు తోడుగా కోయంబత్తూరు బాంబు పేలుళ్లకు కారకులైన మైనార్టీ వర్గానికి చెందిన నిందితులను ఓట్ల మీద దృష్టితో జైలునుంచి వదిలిపెట్టడం ఇవన్నీ కూడా ప్రతిపక్షాలు నిస్సిగ్గుగా పాల్పడుతున్న దేశ వ్యతిరేక చర్యలే.

తాజాగా పంజాబ్ రైతులు ఢిల్లీకి బయలుదేరారు. దేశ వ్యతిరేక గురుపత్వంత్ సింగ్ పన్ను వంటి ఖలిస్తానీలు ఇచ్చే నిధులతోనే వీరి కార్యక్రమాలు జరుగుతుంటాయన్నది జగమెరిగిన సత్యం. నాడే, వారు రైతాంగ చట్టాలను ఆమోదించి ఉంటే, వారు నేడు తమ ఉత్పత్తులకు సరైన ధర పలకడం లేదంటూ రోడ్లెక్కవలసి వచ్చేది కాదు. నిజానికి, హరిత విప్లవంతో అత్యంత లబ్ధి పొందిన రాష్ట్రం పంజాబ్, ఇప్పటికీ అత్యధిక పంటలు పండించే రాష్ట్రంలో దళారులను తొలగించి రైతులు నేరుగా లబ్ధి పొందేలా రైతు చట్టాలను రూపొందించడం వారికి నచ్చలేదు. అందుకే, గత నిరసనలు జరిగాయి. ఖలిస్తానీ నాయకులను ప్రభుత్వం వారి హద్దులో ఉంచుతున్న నేపథ్యంలో వారు తమ అక్కసును ఇలా బయిట పెట్టుకుంటున్నారని భావించాల్సి ఉంటుంది.

మెర్సిడీస్ బెంజ్‌కార్లలో బయలుదేరిన ఆ నిరుపేద రైతులు తమకు నెలకు రూ. 10వేల పెన్షను, కనీస మద్దతు ధరపై లిఖితపూర్వకంగా హామీ సహా పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వారు దేశ రాజధానికి బయలుదేరారు. వాస్తవానికి గత నిరసన ప్రదర్శన సమయంలో ప్రభుత్వం వారి డిమాండ్లు కొన్నింటికి ఆమోదించింది. అయితే, ఇంతకాలమూ ఊరుకొని, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని తెలిసి వారు రాజధానికి బయలుదేరడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థంకాని వారు బహుశ ఎవరూ ఉండరు. గతంలో వారు రాజధాని రోడ్లను దిగ్బంధనం చేసి ప్రజలకు, వ్యాపారాలకూ ఎంతో నష్టాన్ని కలిగించిన విషయం తెలిసిందే. దానితో పాటుగా ఆ సమయంలో జరిగిన అత్యాచారాలు, అకృత్యాలు అప్పుడే వెలుగులోకి వచ్చాయి.

## ప్రధాని రణభేరి

17వ లోక్‌సభలో ప్రధాని మోదీ ఆఖరి ఉపన్యాసం చాలా ప్రసిద్ధి చెందింది. మోదీ ఏం మాట్లాడారు?

ఆయన అమ్ముల పొది నిండా వ్యంగ్యాస్త్రాలే. ప్రతి శరమూ ప్రతిపక్షులను పార్టీలని చీల్చి చెండాడే శక్తిగలదే. అసలే సవ్యసాచి! ఇంకేమిటి? అది దేశం మొత్తాన్ని కదిల్చివేసింది. విపక్షం కూసాలు కుదిపేసింది. పార్లమెంటు అనే రణరంగంలో ఆయన ఏ ఒక్క పార్టీనీ వదలకుండా తన శరాలను సాధించారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పై అయితే, బ్రహ్మాస్త్రాన్ని సంధించినట్టే అనిపించింది. ఉత్తర దక్షిణ విభజన కుట్ర, కుల గణన వంటి విషయాలలో ప్రతిపక్షాల విధ్వంసక వైఖరిని తూర్పార పట్టారాయన. తమ ప్రభుత్వం వేయేళ్ల ప్రగతికి పునాదులు వేస్తోందని అన్నారాయన. అందుకు మూలం నెహ్రూ, ఇందిరల వలె కాకుండా ఈ దేశ ప్రజల కష్టించే తత్త్వం మీద తమకు నమ్మకం పెంచుకోవడమేనని ఆయన ఎలుగెత్తి చాటారు.



హల్ద్వానా విధ్వంసం



ఆగ్రహించిన బెంగాల్ మహిళ ; మహిళా ముఖ్యమంత్రికి సందేశ్‌ఖాలీ మహిళల చెప్పుల దండ

బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ ప్రతిపక్షాలకు ప్రధాని మోదీ విశ్వరూపం ప్రదర్శించారు. వారికి స్వస్వరూప జ్ఞానం కలిగించారు. ప్రతిపక్షాల ఉద్దేశాలు ఏమిటో, వారు చేసిన ప్రజా వ్యతిరేక పనులు ఏమిటో వారికి, ప్రజలకూ పార్లమెంటు సాక్షిగా బహిరంగం చేశారు. ఒకరకంగా సార్వత్రిక ఎన్నికలకు శంఖం పూరించారు. కేవలం తమ ప్రభుత్వ విజయాలనే కాక, కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు, అవినీతి, పాలనలో అలసత్వం సహా అన్నివైపులా వారి వైఫల్యాలను పట్టిచూపించడం ద్వారా తమకు ఎదురు లేదనే విషయాన్ని స్పష్టం చేశారు. 17వ లోక్‌సభలో ప్రధాని చివరి ప్రసంగం ఇదే కావడంతో ఆయన ఎటువంటి తటపటాయింపూ లేకుండా 'తాము గెలవడంపై కాక, తనను ఓడించడంపై మాత్రమే దృష్టి పెట్టిన' ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

ప్రతిపక్షాలపై విమర్శను గుప్పిస్తూ, మేం ఆ భవనంలో (పాత పార్లమెంటు) కూర్చున్నప్పుడు, దేశ ప్రధాని గొంతుకను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. నేడు కూడా మీరు (నా మాట) వినేందుకు రాలేదు. కానీ, నా మాటలను అడ్డుకోలేరు. దేశ ప్రజలు నా గొంతును మరింత బలోపేతం చేశారు. నేను కూడా ఈసారి తయారయ్యే వచ్చాను అంటూ హెచ్చరిక చేశారు.

మోదీ చేసిన ప్రసంగంలో ఈసారి కూడా అధికారం తమదేననే ఆత్మవిశ్వాసం ప్రధానంగా ప్రతిధ్వనించింది. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ స్వయంగా కనీసం 370 స్థానాలను, మొత్తంగా ఎన్డీయే 400 పైచిలుకు స్థానాలను సాధిస్తుందని, తన మాటలు వాస్తవ రూపం దాల్చ డానికి ఎక్కువ కాలం పట్టదని, మహా అయితే 100 –125 రోజులంటూ పార్టీ ఎంపీల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. బీజేపీ నేతృత్వంలోని రానున్న ఎన్డీయే ప్రభుత్వం రానున్న వెయ్యేళ్లపాటు దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను తీసుకుంటుందని తమ అజెండాను కూడా సభలోనే స్పష్టం చేశారు.

నిజానికి బీజేపీ ఈ లక్ష్యాన్ని సాధించే దిశలోనే పనిచేస్తోంది. వారు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చడమే కాక, భారతదేశం ఒక నాగరికతా దేశమని, మనం పాశ్చాత్య దేశాలనుంచి కాక మన సనాతన విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా పునర్వైభవాన్ని సాధించ వచ్చనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. స్వాతంత్ర్యం సాధించినప్పటి నుంచీ సెక్యులరిజం బరువును మోస్తున్న దేశంలోని మెజారిటీ ప్రజలకు ఇది సాంత్వన కలిగిస్తోందన్నది నిర్వివాదం. ఎక్కడా, రాజ్యాంగస్ఫూర్తిని ఉల్లంఘించకుండా, నిర్ణయాలు తీసుకుని, ప్రజల మన్ననలు పొందడం ప్రతిపక్షాలను విలవిల్లాడిస్తోంది. అందుకే వారు మోదీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా ఇండి కూటమిని కట్టినా, అంతిమంగా సరైన పునాదిలేని ఆ సంఘటన విచ్ఛిన్నమైపోతున్న తీరును చూస్తున్నాం.

దేశం కూడా మానవ శరీరం వంటిదేనంటూ, దేశం పనితీరును శరీర పని తీరుతో పోల్చారు. శరీరంలోని ఒక్క అంగానికి దెబ్బతగిలినా, అది శరీరాన్నంతా ప్రభావితం చేసినట్టు ఒక్క రాష్ట్రం అభివృద్ధి చెందకపోయినా, ఆ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించలేమన్నారు. దేశమంటే కేవలం భౌగోళిక ప్రదేశం కాదని, ఒక ప్రాంతంలో బాధ ఉంటే దానిని అందరూ పంచుకోవాలన్నారు. ఒక్క అంగం వికలమైనా, మొత్తం శరీరాన్ని అంగవైకల్యం చెందిందిగా ముద్రవేస్తారనే విషయాన్ని గుర్తు చేస్తూ, అలాగే దేశాభివృద్ధి కూడా అని, కనుక మనం దేశాన్ని ముక్కలు ముక్కలుగా కాక ఏకభూభాగంగా చూడాలని ఉద్బోధించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఉత్తర, దక్షిణమంటూ దేశాన్ని విభజిస్తున్న వారిపై మండిపడ్డారు. హిమాలయాలను ఉదాహరణగా తీసుకుంటూ, అక్కడ నుంచి ప్రవహించే నదులను ఇతరులతో పంచుకోనంటే ఏం చేస్తారు? బొగ్గు అధికంగా ఉన్న రాష్ట్రాలు తాము దానిని వేరేవారితో పంచుకోమంటే, దేశం ఎలా పని చేస్తుందన్నారు. ఇది ఎక్కడ ఆగుతుందని ప్రశ్నించారు? ఈశాన్య రాష్ట్రాలు కొవిడ్ సమయంలో ఆక్సిజన్‌ను తాము ఇతర ప్రాంతాలతో పంచుకోమని ఉంటే అప్పుడేం జరిగేదని ఆయన ఆగ్రహంగా అడిగారు. కానీ ఇప్పుడు దేశాన్ని విచ్ఛిన్నం చేసే యత్నం జరుగుతోందని, 'హమారా టాక్స్, హమారా మనీ' అంటూ ఏం భాష మాట్లాడుతున్నారంటూ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం ఇటువంటి కొత్త కథనాలను వ్యాప్తి చేయడం మానుకొని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు.

ప్రత్యేకంగా కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని, ఆ పార్టీ దిక్కు తోచని స్థితిలో ఉందని, ఎన్నో దశాబ్దాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రస్తుతం మరికొన్ని దశాబ్దాలు ప్రతిపక్ష స్థానంలో ఉండేందుకు నిర్ణయించుకున్నట్టుందంటూ చురకలు వేశారు. ప్రజలు మీ కోరికను మన్నించి, అక్కడే ఉంచుతా రంటూ నవ్వుతూనే వాతలు పెట్టారు. అంతేనా, మీరు ఈ దిశగా మరిన్ని విజయాలను సాధించి, పార్లమెంటులో సాధారణ ప్రజలు కూర్చునే గ్యాలరీల్లోకి మీ స్థానాన్ని మార్చుకుంటారంటూ వ్యంగ్యంగా చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ దళితులకు, వెనుకబడిన కులాలవారికీ వ్యతిరేకమంటూ, జవాహర్‌లాల్ నెహ్రూ ఉద్యోగాలలో వారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి



పరారీలో ఉన్న టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్

వ్యతిరేకమని ధ్వజమెత్తారు. ప్రధానిగా ఉన్న నెహ్రూ నాటి ముఖ్యమంత్రులకు ఈ విషయాన్నే పేర్కొంటూ 1961లో రాసిన లేఖను ఆయన సభకు చదివి వినిపించారు. ఓబీసీలకు ఎన్నడూ పూర్తి రిజర్వేషన్లు ఇవ్వని కాంగ్రెస్ సామాజిక సంక్షేమం గురించి నీతులు చెప్పకూడదంటూ మండిపడ్డారు. వారు రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ, నాడు వారికి రిజర్వేషన్లు ఇచ్చి ప్రభుత్వంలోకి తీసుకుని, ఎప్పటికప్పుడు వారికి ప్రమోషన్లు ఇచ్చి ఉంటే, వారు ఇక్కడ ఉండి ఉండేవారని ప్రధాని మోదీ అన్నారు. తమ కుటుంబంలోని వారికి తప్ప సాధారణ వర్గంలోని పేదలకు కానీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌కు గానీ భారతరత్న ఇవ్వడాన్ని కూడా పరిగణించని కాంగ్రెస్ సామాజిక న్యాయం గురించి నీతులు చెప్తోందని విమర్శిస్తూ, తమకే గ్యారెంటీ లేని నాయకులు మోదీ గ్యారెంటీపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రధాని ఈ విషయాన్ని పార్లమెంటు ఇరు సభల్లోనూ లేవనెత్తడం గమనార్హం.

**నెహ్రూ, ఇందిరలపై వ్యంగ్యాస్త్రాలు**

అలాగే, నెహ్రూ, ఇందిరకు భారతీయుల సామర్థ్యాలపై ఉన్న చిన్న చూపును సోదాహరణంగా వివరించి, విమర్శించారు. అమెరికా, చైనా ప్రజలతో పోలిస్తే భారతీయులు బద్ధకస్తులని, తెలివైన వారు కాదన్నది నెహ్రూ అభిప్రాయమన్నారు. ఎర్రకోటపై నుంచి ఉపన్యసిస్తూ, 'భారతీయులకు సాధారణంగా కష్టించి పని చేసే అలవాటు ఉండదు, మనం ఐరోపా లేదా జపాన్ లేదా చైనా లేదా రష్యా లేదా అమెరికా ప్రజలంతగా పనిచేయం' అంటూ నాటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలను చదివి వినిపించారు. ఆయన కుమార్తె, ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఆలోచనలు కూడా భిన్నమైనవి ఏం కాదంటూ, భారతీయులు కష్టాల నుంచి పారిపోతారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.


ఎన్నో దశాబ్దాలు అధికారంలో ఉన్న నెహ్రూ, ఇందిర కాంగ్రెస్ ఆలోచనలకు, సిద్ధాంతాలకు కాలం చెల్లిపోయిందని, దానితో వారు తమ పనిని ఔట్‌సోర్సింగ్ చేసుకుంటున్నారంటూ, ఆ పార్టీ అలా పతనం అయిపోవడం తమకూ బాధాకరంగా ఉందని, అందుకు సానుభూతిని వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈసారి కాంగ్రెస్ నలభై స్థానాలు కూడా దాటదంటూ మమతా బెనర్జీ వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేస్తూ, మీరు మీ 40 స్థానాలను కాపాడుకోవాలని ప్రార్థిస్తానంటూ మోదీ ఆ పార్టీ పరిస్థితిని పట్టి చూపారు.

ప్రారంభం కాలేని స్టార్టప్ యువరాజు అంటూ రాహుల్ గాంధీని ఎత్తి పొడిచారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని స్టార్టప్‌గా ముందుంచినా, అది మాత్రం 'ప్రారంభం కాలేనిది' (నాన్– స్టార్టర్) అని, ఆ స్టార్టప్ కదలదు, ప్రారంభం కాదని పరిహసించారు. ఒకే ఉత్పత్తిని పదే పదే ప్రారంభించే ప్రయత్నంలో కాంగ్రెస్ పార్టీయే మూతపడేలా ఉందంటూ లోక్‌సభలో కూడా ఆయన చురకలు వేశారు.

రాజ్యసభలో సుదీర్ఘంగా ప్రసంగించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను లక్ష్యంగా చేసుకుంటూ, ఆయనకు ఇంత వాక్‌స్వాతంత్రం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యంగా అనిపించిందని, అయితే, ఎప్పుడూ ఇక్కడ ఉండే ఇద్దరు కమెండోలు గైర్హాజరు కావడమే అందుకు కారణమని గుర్తించానని అన్నారు. బహుశ ఖర్గేజీ 'ఐసా మౌకా ఫిర్ కహా మిలేగా' (ఇలాంటి అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుంది) అనే పాట విని ఉంటారంటూ ఆయనను పరిహాసం చేశారు. అంపైర్లు, కమెండోలు లేకపోవడంతో ఆయన సిక్సర్లు, బౌండరీలు కొట్టారంటూ కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పరోక్షంగా పట్టి చూపారు. లోక్‌సభలో తమకు లభించని వినోదాన్ని ఖర్గేజీ ఇక్కడ పంచినందుకు ప్రత్యేకంగా ఆయనకి కృతజ్ఞతలు చెప్తున్నానంటూ ప్రధాని వ్యంగ్యోక్తిని విసిరారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఒక్కొక్కదాన్నే ఆయన ఉభయసభలో ఎత్తిచూపి విమర్శించారు. 'మన దేశంలో ఎంతో భూభాగానికి శత్రువులకు వారు అప్పగించారు, దేశ సైన్యాన్ని ఆధునీకరించడం ఎప్పుడో మానేసిన పార్టీ నేడు మాకు జాతీయ, అంతర్గత భద్రత గురించి ఉపన్యాసాలనిస్తోందంటూ' విరుచుకుపడ్డారు.

ఆర్థికరంగంలో కాంగ్రెస్ సాధించిన ప్రగతిని గురించి కూడా ఆయన రాజ్యసభలో ప్రస్తావించారు. పదేళ్ల పాలనలో భారత ఆర్థిక వ్యవస్థను 12వ స్థానం నుంచి 11వ స్థానానికి కాంగ్రెస్ తెచ్చిందని, తాము



కేవలం పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థను 5వ స్థానానికి తెచ్చామని చెప్తూ, ఆర్థిక విధానాల గురించి మాకు సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ సభకు వస్తోందంటూ ఎత్తిపొడిచారు.

కాంగ్రెస్ పార్టీ వ్యాప్తి చేసిన కథనం ఫలితంగా, భారతీయ సంస్కృతి, విలువలపై విశ్వాసం కలిగిన వారిని ఆత్మ న్యూనతాభావం కలిగిన వారిగా చూడటం మొదలు పెట్టారన్నారు. ఈ కథనం ఎక్కడి నుంచి వచ్చిందో ప్రపంచానికి తెలుసంటూ, 'మేడిన్ ఫారిన్' అన్నది అంతస్తుకు చిహ్నంగా మార్చారంటూ మండిపడ్డారు. ఇటువంటి వ్యక్తులు 'వోకల్ ఫర్ లోకల్', 'ఆత్మనిర్భర్ భారత్' గురించి ఎప్పుడూ మాట్లాడలేదు, మాట్లాడలేరంటూ ఎత్తి పొడిచారు.

ప్రస్తుతం కాంగ్రెస్ 'కాన్సిల్ (రద్దు) సంస్కృతి'ని అనుసరిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. "కాంగ్రెస్ కాన్సిల్ సంస్కృతిలో చిక్కుకుపోయింది, దేశం సాధించిన విజయాలను, ప్రగతిని కాన్సిల్ చేయడమే ధ్యేయంగా పెట్టుకుంది. మేం మేకిన్ ఇండియా అంటాం, కాంగ్రెస్ కాన్సిల్ అంటుంది; మేం ఆత్మనిర్భర్ భారత్ అంటాం, కాంగ్రెస్ కాన్సిల్ అంటుంది, మేం వోకల్ ఫర్ లోకల్ అంటే కాంగ్రెస్ కాన్సిల్ అంటుంది, మేం వందేభారత్ రైలు అంటాం, కొత్త పార్లమెంటు భవనం అంటాం, కాంగ్రెస్ కాన్సిల్ అంటుంది. నాకు ఆశ్చర్యంగా ఉంది. ఎందుకంటే, ఇవి మోదీ విజయాలు కావు, ఇవి దేశపు ప్రగతికి చిహ్నాలు," అంటూ మండిపడ్డారు. దేశం సాధించిన విజయాలను, పురోగతి గురించి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న విమర్శలలోని డొల్లతనాన్ని ప్రధాని బయటపెట్టారు.

గాంధీ కుటుంబం చుట్టూనే వంశపారంపర్య రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్నట్టు ప్రధాని మోదీ ఆరోపణలు చేశారు. వంశపారంపర్య రాజకీయాలు, పాలనలో వైఫల్యాలే కాంగ్రెస్ పార్టీని వదలని గతకాలపు భూతాలంటూ, ప్రతిపక్షంగా తమ పార్టీ, ఇతర పార్టీల దుస్థితికి కాంగ్రెసే కారణమని ధ్వజమెత్తారు. తెలివైన నాయకులని పార్టీ ఎదగ నివ్వలేదని, తనకే కాక ప్రతిపక్షానికి, పార్లమెంటుకు, దేశానికీ కూడా కాంగ్రెస్ చాలా హానిచేసిందని మోదీ ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా కూటమిని కట్టి బెదిరించబోయినా, దానికి రూపకర్తగా ఉన్న నితీష్ కుమార్ బీజేపీ గూటిలో చేరినా, టిఎంసి అధినేత్రి మమత కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గొంతెత్తడం పెద్ద పరిణామమని అన్నారాయన.

### యూపీఏ విధానపరమైన పక్షపాతం

కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం గతంలో చేసిన కంతలన్నింటినీ తాము నింపామంటూ, మూడవ విడత తాను పగ్గాలు చేపట్టినప్పుడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడాన్ని చూస్తారని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మూడు దశాబ్దాలలో దేశ జీడీపి మూడవ అతిపెద్దదిగా అవతరిస్తుందంటూ 2014లో నాటి ఆర్థికమంత్రి పి. చిదంబరం ప్రకటించిన విషయాన్ని పట్టి చూపుతూ, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అనంతరం, తన ప్రభుత్వకాలంలో వివిధ పథకాలు సాధించిన లక్ష్యాలను ఏకరువు పెడుతూ, అదే కాంగ్రెస్ పాలన అయి ఉంటే ఈ సాధనకు ఎంత సమయం పట్టి ఉండేదని ప్రశ్నించారు.



ఇత్తెహాద్-ఎ-మిల్లత్ అధిపతి
తౌకీర్ రజాఖాన్

**తాము దేశాన్ని ప్రేమిస్తున్నాం కనుకనే సంయమనం పాటిస్తున్నామని, తాను ఒక్క పిలుపు ఇస్తే దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమవుతుందంటూ తౌకీర్ ప్రభుత్వాన్ని బెదిరించడం 'హేట్ స్పీచ్' కిందకి రాదని ఎవరైనా అంటే, అది అబద్ధమే అవుతుంది.**

ఒకవైపు తన ప్రభుత్వ విజయాలను ఏకరువు పెట్టడంతో పాటు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు దేశాన్ని భ్రష్టుపట్టించిన వైఖరిని ఉతికి ఆరేసిన తీరుతో ప్రతిపక్షాలన్నీ ఖంగుతిన్నాయి. ప్రధాని మోదీపై ద్వేషం మినహా దేశానికి ఉపయోగపడే సానుకూల వాదన లేని ప్రతిపక్షాలు ఎన్నికలలో సీట్ల సర్దుబాటు విషయంలో ఇసక తక్కెడ పేడ తక్కెడ మాదిరిగా ప్రవర్తిస్తున్నాయి. ఎప్పటిలాగే కాంగ్రెస్ కూడా, 'మీ ఇంటికొస్తే మాకేమి ఇస్తావు, మా ఇంటికొస్తే మాకేమి తెస్తావ్' అన్న చందంగా ప్రవర్తిస్తున్నందున ఘనంగా ప్రారంభించిన ఇండి కూటమి మూడునాళ్ల ముచ్చటవుతోంది.

### బెదిరింపు రాజకీయాలు

వీటికి తోడుగా ఇత్తెహాద్-ఎ-మిల్లత్ అధిపతి తౌకీర్ రజా ఖాన్ వంటి మతనాయకులు ముస్లింలను మరింత రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతోంది. తాము దేశాన్ని ప్రేమిస్తున్నాం కనుకనే సంయమనం పాటిస్తున్నామని, తాను ఒక్క పిలుపు ఇస్తే దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమవుతుందంటూ ఆయన ప్రభుత్వాన్ని బెదిరించడం 'హేట్ స్పీచ్' కిందకి రాదని ఎవరైనా అంటే, అది అబద్ధమే అవుతుంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముస్లింలు కాశీలోని జ్ఞాన్‌వాపీని, మధురలను హిందువులకు వదిలిపెట్టాలంటూ చేసిన ప్రకటనతో మండిపడుతూ, జైల్ భరో కార్యక్రమానికి ఖాన్ పిలుపునివ్వడం, పోలీసులను ఆయనను నిర్బంధంలోకి తీసుకోవడంతో వేలాదిమంది అతడి అనుచరులు బరేలీలో రోడ్లపైకి వచ్చి హడావిడి సృష్టించారు.

మరోవైపు బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో కూడా మైనార్టీలుగా చెప్పుకునే ఈ వర్గం చేస్తున్న దుర్మార్గాలు బయటకురావడం గమనార్హం. గత నెలలో సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ బ్లాక్ స్థాయి నాయకుడు షేక్ షాజహాన్ ఇంటిపై సోదాలు జరిపేందుకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులపై ముస్లింలు జరిపిన దాడి ఎవరి స్మృతిపథం నుంచీ చెరిగిపోలేదు. ఈ హంగామాలో షాజహాన్ షేక్ తప్పించుకొని, సరిహద్దులు దాటి ఉంటాడనే వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్‌తో సరిహద్దులు కలిగిన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోకి అక్రమంగా చొరబాటుదారులు ప్రవేశించి, స్థిరపడుతున్న విషయం తెలిసిందే. రాజకీయ నాయకులు కూడా తమ ఓట్ల ప్రయోజనాల కోసం వారిని చూసీ చూడనట్టుగా వదిలివేయడమే ఇప్పుడు ఉద్రిక్త పరిస్థితులకు కారణమవుతున్నది. సందేశ్‌ఖాలీలో ముస్లింలు హిందూ మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారిపై జరుపుతున్న అత్యాచారాలు వింటే ఎవరి హృదయమైనా ద్రవించకమానదు. గ్రామంలోని అందమైన యువతి, వివాహిత అయినా సరే, వారి కుటుంబసభ్యుల ఎదురుగానే బలవంతంగా ఎత్తుకుపోవడం, తృణమూల్ కార్యాలయంలో యథేచ్ఛగా వారిపై అత్యాచారాలు చేయడం నిత్యకృత్యంగా మారిన విషయాన్ని బాధితులే మీడియా ఎదుటికి వచ్చి చెప్పుకోవడంతో, అక్కడ ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చోవడం వల్ల ఏర్పడినవేనన్నది నిర్వివాదం.

రైతులను అడ్డం పెట్టుకుని అల్లర్లు, ముస్లిం మతోన్మాదులను అడ్డం పెట్టుకుని మతకల్లోలాలు రేపాలని ఎన్నికల ముందు ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నట్టే ఉంది. బీజేపీని అధికారంలో నుంచి దించాలంటే ఇది మార్గం కాదు. అందుకు రాజ్యాంగబద్ధమైన పద్ధతి అవసరం. ఓటు హక్కును ఉపయోగించుకోవాలి. రోడ్ల మీద తేల్చుకుంటామంటే సాధ్యం కాదు. ప్రజలు మోదీ వైపు ఉన్నారు. సర్వేలు ఇవే చెబుతున్నాయి. ఈ వాస్తవాన్ని హుందాగా అంగీకరించడం అవసరం. ★




కోర్టు ఆదేశాలతో
కూలుస్తున్న మదర్సా

## హల్ద్వానీ:

# మైనార్టీ కార్డుతో గూండాగిరీ

**బీజేపీ ఏలుబడిలో మత కల్లోలాలు లేవు. అడపాదడపా వాటి జాడలు కనిపించినా ఉక్కుపాదం మోపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు అలాంటి అల్లర్లకు మరొక ప్రయత్నం జరిగింది. ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీలో అక్రమంగా కట్టిన మసీదును, మదరసాను రాష్ట్ర ప్రభుత్వం తొలిగించే ప్రయత్నం చేసినప్పుడు అక్కడ ముస్లింలు బీభత్సం సృష్టించారు. హిందువులు దేవభూమి అని ఎంతో పవిత్రంగా భావించే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనాకాలంలో అక్రమ చొరబాటుదారులైన రొహింగ్యా ముస్లింలు సహా ఇతర ముస్లింలు ప్రవేశించడమే కాదు, ప్రభుత్వ భూములను కబ్జా చేసుకొని కూర్చున్నారు.**

ఒకటి రెండు దశాబ్దాల కింద ఏక సంఖ్య శాతంలో ఉన్న వారి జనాభా 2024నాటికి 20 శాతానికి చేరినట్టు తెలుస్తోంది. హిందూత్వ బూచిని చూపిస్తూ మైనార్టీ నాయకులు తమ వర్గాన్ని రెచ్చగొడుతున్న తీరు దేశంలో పలుచోట్ల హింసాత్మకంగా మారుతున్నది. యథేచ్ఛగా అక్రమ చొరబాటు దారులకు ఆశ్రయమిస్తూ, తమ సంఖ్యను పెంచుకుంటున్న 'మైనార్టీ'లు ఇటీవల ఉత్తరాఖండ్‌లో పాల్పడిన హింసను చూసి దేశం నివ్వెరపోయింది.



ప్రభుత్వ భూమిపై హల్ద్వానీ జిల్లాలోని బన్‌భూల్ పురాలో అక్రమంగా నిర్మించిన మసీదును, మదరాసాను తొలిగించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నంలో దాదాపు ఐదుగురు వ్యక్తులు మరణించగా, డజను మందికి పైగా వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులని కూడా చూడకుండా రాళ్లు రువ్వడం, పెట్రోలు బాంబులను ఉపయోగించడం, వాహనాలకు నిప్పంటించడం, పోలీసు స్టేషన్‌ను అల్లరిమూకలు చుట్టుముట్టడం ద్వారా పోలీసులు సహా ప్రజలను భయభ్రాంతులను చేసే ప్రయత్నం జరిగాయి. ఇంత నిర్భయంగా చేస్తున్నారంటే, వారి వెనుక ఎంత బలమైన శక్తులుండి ఉంటాయన్న అనుమానం రాక మానదు. ఈ పరిణామాల పట్ల ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ కఠినంగా స్పందిస్తూ, కనిపిస్తే కాల్చివేతకు ఉత్తర్వులు జారీచేయడంతో హిందువులు కాస్త ధైర్యంగా ఊపిరి తీసుకున్నారు. వాస్తవానికి మసీదు కూల్చివేత నిర్ణయం జిల్లా యంత్రాంగం తామంతట తాము తీసుకున్నది కాదు, కోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా, మసీదుకు సంబంధించిన వారికి ముందస్తుగానే నోటీసులు జారీచేసి, మరీ

తీసుకున్నది.

అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్లిన కూల్చివేత బృందం, పోలీసులు, జిల్లా కలెక్టరుపై అల్లరిమూకలు ఒక్కసారిగా పోగై రాళ్లు రువ్వడమన్నది ఏదో క్షణికావేశంలో జరిగిన ఘటన కాదు. ఒక పథకం ప్రకారం రాళ్లను సమకూర్చుకుని పెట్టుకుని, మహిళలను బురఖాలలో తీసుకువచ్చి ప్రభుత్వ అధికారులపై వేయించిన తీరు చూస్తే, గతంలో కశ్మీరులో జరిగిన ఘటనలు గుర్తురాక మానవు. దేశ వ్యతిరేక శక్తుల కార్యకలాపాల పద్ధతి మారలేదన్న విషయం తెలిసిపోతోంది. జిల్లా కలెక్టర్ వందన వివరణ ప్రకారం, పోలీసు స్టేషన్‌లో చిక్కుకుని ఉన్న పోలీసు సిబ్బందిని సజీవంగా దహనం చేసేందుకు స్టేషన్‌ను చుట్టుముట్టిన అల్లరిమూకలు ప్రయత్నించాయి. పోలీసులు, పాలనా సిబ్బందిపై హత్యాయత్నం చేశారని సాక్షాత్తు ముఖ్యమంత్రే పేర్కొన్నారంటే, అక్కడ జరిగిన బీభత్సం ఏ స్థాయిలో ఉండి ఉంటుందో ఊహించవచ్చు. అందుకే రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అల్లరి మూకలపై నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు ప్రకటించారు. దీనితో పాటుగా హల్ద్వానీ జిల్లాలో కర్ఫ్యూ విధించడమే కాక ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, దాదాపు 1,100మంది పోలీసులను ప్రతి రోడ్డు మలుపులోనూ మోహరించారు.

అల్లరిమూకలు రాళ్లు రువ్వడంతో గాయపడిన పోలీసు సిబ్బంది ప్లాస్టర్లు, బ్యాండేజీలు ధరించి విధులకు హాజరుకావడం కూడా అక్కడ ఏ స్థాయిలో అరాచకం జరిగిందో చెప్పకనే చెప్తుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సాయంత్రం 4.30కు ప్రారంభమైన కూల్చివేత 5.30కు పూర్తి అయింది. వెంటనే రాళ్లు రువ్వడంతో ప్రారంభమైన గొడవలు పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టడం, వాహనాలను దహనం చేయడం వరకు వెళ్లింది. ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటాయని ఊహించని పోలీసులు తక్కువ సంఖ్యలోనే అక్కడకు వెళ్లడంతో వారిని నియంత్రించడంలో విఫలమయ్యారు. అదనపు బలగాలు వచ్చేవరకూ అంటే దాదాపు నాలుగు గంటలపాటు అల్లరి మూకలు యథేచ్ఛగా వీరవిహారం చేయడంతో, స్థానిక హిందువులు భయంతో వణికిపోయారు. మసీదు కూల్చివేత పూర్తి కావడం ఏమిటి, వీధులలో రాళ్ల వర్షం కురిసిందని, అవి కూడా రైలుపట్టాలవద్ద లభించే కంకర రాళ్ల వంటివని మరొక ప్రత్యక్ష సాక్షి చెప్పడం, వింటే అల్లరిమూకలు ఎంత ప్రణాళికాబద్ధంగా ఈ హింసకు పాల్పడ్డాయో అర్థం అవుతుంది.

హిందువులు అత్యంత పవిత్రంగా భావించే ‘దేవభూమి’ ఉత్తరాఖండ్‌లో ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా మెజారిటీ హిందువులను భయభ్రాంతులను చేయాలని, తాము అణచివేతకు గురవుతున్నామని



బాధితుల గోడు వింటున్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ధామి

చెప్పుకునే మైనార్టీలు కుట్రపన్నిన విషయం ఈ ఉదంతం ద్వారా స్పష్టమైపోయింది. అందుకే, ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్ ఆధారంగా నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ధామీ ప్రకటించారు. దానితో పాటుగా, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను ధ్వంసం చేసిన వారి చేత, ప్రభుత్వ సిబ్బందిని గాయపరిచిన వారిచేత నష్టపరిహారం కట్టించి తీరుతామని అన్నారు. కూల్చివేసిన మసీదు, మదరసా రెండూ కూడా ప్రభుత్వ భూమిపై ఉండటమే కాదు, ఎక్కడా రెవిన్యూ రికార్డులలో వాటి ప్రస్తావన లేదని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులపై అక్రమ నిర్మాణాలను తాము గత 15–20 రోజులుగా కూల్చివేస్తున్నామని, తద్వారా రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తున్నామని ఆమె తెలిపారు.

మదరసాకు సంబంధించిన యాజమాన్య పత్రాలను మూడురోజులలోపు తమకు సమర్పించాలని లేదా దానిని కబ్జాగా భావించి కూల్చివేస్తామని జనవరి 30నే నోటీసులు జారీ చేసినట్టు పాలనా యంత్రాంగం చెప్తోంది. ఫిబ్రవరి 3వ తేదీన పలువురు స్థానికులు నగర నిగమ్ కార్యాలయానికి చర్చల కోసం వచ్చి, కోర్టు నిర్ణయానికి కట్టుబడి ఉంటామంటూ, హైకోర్టులో అప్పీలు చేసుకునేందుకు సమయం ఇవ్వాలని కోరారని, అయితే వారికి తగినంత సమయానికి మించే ఇచ్చినందుకు వారు కోరినట్టు మరింత సమయాన్ని ఇవ్వలేదని కలెక్టరు వివరించారు. మరురోజు కూల్చివేస్తామనగా, రాత్రి భద్రతా దళాలు ఫ్లాగ్ మార్చి నిర్వహించాయి. స్థానికులు హైకోర్టు నుంచి తక్షణ స్టే కోరినప్పటికీ, అందుకు కోర్టు నిరాకరించిందని, దానితో కూల్చివేతకు సిద్ధంగా ఉన్న తమ సిబ్బంది దానిని చేపట్టాయని కలెక్టరు తెలిపారు. చట్టపరంగానే కూల్చివేత జరిగిందని, మదరసా అనే కట్టడంలో ఎవరూ ఉండటం లేదని ఖరారు చేసుకున్న తర్వాతే ఏకాభిప్రాయంతోనే దాన్ని కూల్చివేశామని వివరణ ఇచ్చారు.

ఇంత ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినప్పటికీ, అక్కడ ముస్లిం నాయకులు మాత్రం తమకేదో అన్యాయం జరిగినట్టుగా మాట్లాడడం, తాము మైనార్టీలం కనుకనే తమపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఎప్పటిలానే విక్టిమ్ (బాధిత) కార్డును వాడుకుంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి ధామీ, అక్రమంగా కట్టిన కట్టడాన్ని కూల్చివేసిన స్థలంలో పోలీసుస్టేషన్‌ను నిర్మిస్తామంటూ, ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఘటన జరిగిన ఇరవై నాలుగు గంటల్లో మొత్తం ఐదువేలమంది గుర్తు తెలియని వ్యక్తులపై కేసును నమోదు చేసి ముప్పైమంది నిందితులను సిసిటివి ఫుటేజ్ ఆధారంగా పోలీసులు అరెస్టు చేశారు. బుర్ఖా ధరించి వచ్చి రాళ్లు రువ్విన మహిళలను గుర్తించడమే పోలీసులకు కొద్ది ఇబ్బందిగా మారింది. అరెస్టు చేసిన వారిలో సమాజ్‌వాదీ పార్టీ ఉత్తరాఖండ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి అబ్దుల్ మతీన్ సిద్దికీ సోదరుడు జావేద్ మతీన్ కూడా ఉండటం గమనార్హం. కౌన్సిలర్లు మెహబూబ్ ఆలమ్, జీషాన్ పర్వేజ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. దోషుల నుంచి స్థానికంగా తయారు చేసిన ఆయుధాలను, ముడి బాంబుల వంటివాటినీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే, నాలుగు అదనపు పారామిలటరీ దళ యూనిట్లను మోహరించి, పరిస్థితిని అదుపులో ఉంచుతున్నారు.

కాగా, ప్రధాన నిందితుడు అబ్దుల్ మాలిక్ ఈ హింసాత్మక ఘటన వెనుక ఉన్నాడని పోలీసులు చెపుతున్నారు. అతడిని ఢిల్లీలో అరెస్టు చేశారని కొన్ని పత్రికలలో వార్తలు కూడా వచ్చాయి. కాగా, అతడిని ఇంకా అరెస్టు చేయడంలేదని నైనితాల్ పోలీసులు చెబుతున్నారు. ఏమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలపై ఉక్కుపాదం మోపడం హర్షణీయం. ★

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను అమెరికా ప్రభుత్వం సెనేట్‌కు నామినేట్ చేసింది. అంటే ఆ దేశ అత్యున్నత చట్టసభ కాంగ్రెస్‌లో ఎగువ సభ. ఆయన ఐదేళ్లో లేదంటే ఆరేళ్లో ఆ సభలో ఉన్నారు. చాలా శ్రద్ధగా కూడా సమావేశాలకు హాజరయ్యేవారు. కానీ అన్ని సంవత్సరాల తన పదవీ కాలంలో ఆయన ఒక్కటంటే ఒక్కటే మాట మాట్లాడారు. ఆ మాట ఏమిటనుకున్నారు! 'ప్లీజ్ ఓపెన్ ది డోర్!' ఈ సంఘటన గురించి చాలా వింతగా చెప్పుకుంటారు. నిజానికి ఇలా దేశానికి, కొన్ని రంగాలకి పేరు తెచ్చిన విఖ్యాతులను పెద్దల సభకు పంపించడం ప్రపంచమంతటా ఉండొచ్చు. కాబట్టి బహుశా ఇలాంటి మితభాషులు అన్ని దేశాలలోను ఉంటారనే అనుకోవాలి.

ఎందుకు ఉండరు! మన దేశమే ఇందుకు మంచి ఉదాహరణ.




# లోక్‌సభలో 'మితభాషులు'


చంద్రప్ప


సిన్హా


సన్నీ

ప్రముఖ సినీనటుడు సన్నీ డియోల్ గురుదాస్‌పూర్ (పంజాబ్) నుంచి బీజేపీ సభ్యునిగా లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరొక ప్రముఖ సినీ నటుడు శత్రుఘన్ సిన్హా తృణమూల్ కాంగ్రెస్ సభ్యునిగా పశ్చిమ బెంగాల్ నుంచి 2022 ఏప్రిల్‌లో జరిగిన ఉప ఎన్నిక ద్వారా లోక్‌సభలో ప్రవేశించారు. సన్నీ డియోల్ తారీఖ్ పే తారీఖ్ అన్న డైలాగ్‌తో ఆయన అభిమానులకు ఎంతో చేరువ అయ్యారు. అది ఆయనకు ఎంతో కీర్తిప్రతిష్టలు తెచ్చి పెట్టింది. ఇక శత్రుఘన్ సిన్హా అయితే ప్రతినాయక పాత్రలలో సుదీర్ఘమైన సంభాషణలు చెప్పిన అనుభవం ఉన్నవారు. తన గంభీరమైన గొంతుతో ఆయన ఎన్నో కీలకమైన పాత్రలలో నటించారు. మెప్పించారు. కానీ ఈ ఇద్దరు 17వ లోక్‌సభలో ఒక్క అంశం గురించి కూడా పెదవి విప్పలేదు. అసన్‌సోల్ (పశ్చిమ బెంగాల్) నుంచి సిన్హా ఎన్నికయ్యారు. పార్టీ వారు సభలో లేచి నిరసన తెలియచేస్తే నలుగురితో నారాయణ అన్న చందంగా తాను కూడా లేచి గొంతు కలపడం తప్పితే విడిగా ఆయన వచో లాఘవాన్ని వినే అదృష్టం సభకు దక్కలేదు. అలాగే ఆయన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఎలాంటి ప్రశ్నలు వేయలేదు.


అతుల్

మరొక ఇద్దరు ఎంపీలు గురించి కూడా చెప్పుకోవాలి. ఒకరు రమేశ్ చంద్రప్ప. కర్ణాటకలోని బిజాపూర్ నియోజక వర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మరొకరు బీఎస్‌పీ ఎంపీ అతుల్ రాయ్. ఇందులో చంద్రప్ప అనారోగ్యం కారణంగా ఏనాడూ ఏ చర్చలోను పాల్గొనలేదు. ప్రశ్నలు వేయలేదు. ఇక బీఎస్‌పీ ఎంపీ గారయితే చర్చలలో పాల్గొనడం లేదా ప్రశ్నలు సంధించడం వంటి వాటికి మరీ సుదూరంగా ఉండిపోయారు. లేదు లేదు, ఉండిపోవలసి వచ్చిందంటే సబబు. ఎందుకంటే ఆయన జైలు పక్షి. మొన్న ఆగస్టు వరకు జైలులోనే ఉండిపోయారు. ఇక మిగిలిన కాలంలో మాత్రం ఈ ప్రశ్నలు చర్చలు ఎందుకని మిన్నకుండిపోయారు కాబోలు. ఈ విధంగా చూస్తే 17వ లోక్‌సభలో మొత్తం తొమ్మండుగురు ఎంపీలు మాటల ద్వారా తమ శక్తిని కాస్త కూడా వృధా చేసుకోలేదు. సభకు ఒక అలంకారంగానే మిగిలారన్నమాట.

నిజానికి ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నవారు గతంలోను ఉన్నారు. ప్రధానంగా వివిధ రంగాల నుంచి వచ్చిన నిపుణులదే ఇందులో పై చేయి. లతా మంగేష్కర్, సచిన్ టెండూల్కర్ కూడా మౌనవ్రతం పాటించినవారే.

– జాగృతి డెస్క్

**తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కూడా మొదలెట్టింది. తొలుత మహిళా సెంటిమెంట్‌ను ఒడిసి పట్టుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణం మొదలుపెట్టింది. ఈ పథకం ఇప్పుడు రాష్ట్రమంతటా అమలవుతోంది. దీంతో పాటు.. మిగతా హామీల అమలుపై దృష్టి పెట్టినట్లు ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.**



# ఆరు గ్యారం




శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు కీలక పాత్ర పోషించాయి. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిపై తొలి సంతకం చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అన్నట్లుగానే.. ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. వీటి ముసాయిదాపై తొలి సంతకం చేశారు. అనంతరం క్యాబినెట్ సమావేశం ఆరు గ్యారెంటీలకు ఆమోదం తెలిపింది. వీటి అమలులో భాగంగా ఇప్పటికే ప్రజాపాలన పేరుతో గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వార్డుల స్థాయిలో నిర్వహించిన ఈ సభల్లో లక్షల మంది ఆయా పథకాల కోసం దరఖాస్తులు సమర్పించారు. వాటి క్రోడీకరణే ఇబ్బందిగా మారింది. అంటే.. ఆ స్థాయిలో ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చి చేరాయి. అయితే, ఈ హామీలన్నీ ఎప్పుడు అమలు అవుతాయో! అందుకు సరిపడా నిధులు ఎలా? అన్న సందిగ్ధం ఇప్పుడు వెంటాడుతోంది. మొన్నటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తర్వాత.. నిధుల కేటాయింపులు చూస్తే.. ప్రకటనలకు, అమలుకు మధ్య పరిస్థితి తేట తెల్లమవుతోంది. దీంతో, ఆరు గ్యారంటీల అమలు కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులపై అటు అధికారిక వర్గాల్లో, ఇటు రాష్ట్ర ప్రజానీకంలో కూడా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. తాము కేటాయించిన నిధులతో ఆరు గ్యారంటీలు అమలవుతాయని సర్కారు చెబుతోంటే.. మరికొన్ని నిధులు అవసరమని అధికార వర్గాలు లెక్కలు కడుతున్నాయి. మరోవైపు.. ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను యథాతథంగా అమలు చేయాలంటే.. ఇప్పుడు బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు సుమారు మూడు రెట్లు ఎక్కువగా నిధులు అవసరమనే చర్చ జరుగుతోంది.

ఈ హామీలను సంపూర్ణంగా అమలు చేయాలంటే ఏటా రూ. 1.36 లక్షల కోట్లు పైనే కావాల్సి ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రూ. 53 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ లెక్కలన్నీ చూస్తుంటే హామీల అమలు వ్యవహారం అయోమయంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ 'గ్యారంటీ'లను పూర్తిస్థాయిలో కాకుండా, కొందరికే పరిమితం చేసినా ఏటా రూ. 80 వేల కోట్లకు పైనే అవసరమని అధికార వర్గాలు అంటున్నాయి. అయితే, అధికారికంగా ఎవరూ దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు.

పైకి 'ఆరు గ్యారంటీ'(మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, యువ వికాసం)లుగా కనిపిస్తున్నా వాటి పరిధిలో మొత్తం 13 సంక్షేమ పథకాలు ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే భారీ మొత్తంలో నిధులు అవసరం అవుతాయని ఆర్థిక రంగ నిపుణులు లెక్కగడుతున్నారు. అన్నదాతలకు సంబంధించిన 'రైతు భరోసా'ను పరిశీలిస్తే... గత బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని దాదాపు 1.52 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు 69 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. రైతుబంధు పథకం పేరుతో ఏటా ఎకరానికి రూ. 10 వేల చొప్పున చెల్లించింది. తాము అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎకరాకు మరో రూ. ఐదు వేలు పెంచి...రూ. 15 వేలు చొప్పున అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇందుకు ఏటా సుమారు రూ. 22 వేల 800 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. 'రైతు భరోసా' గ్యారెంటీని మరింత లోతుగా విశ్లేషిస్తే.. రాష్ట్రంలో భూమి లేని కౌలు రైతులు 6.5 లక్షల మంది ఉన్నట్టు ఓ అంచనా. వారికి ఏటా రూ. 15 వేల చొప్పున అందించేందుకు రూ. 975 కోట్లు అవసరం అవుతాయి. అలాగే, రైతుకూలీలకు ఏటా రూ. 12 వేలు చొప్పున ఇస్తామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. రాష్ట్రంలో 52లక్షలకు పైగానే ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో దాదాపు 32 లక్షల మేర అమలులో ఉన్నాయి. ఆ కార్డుదారులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తే ఏటా రూ. 6 వేల 240 కోట్లు అవసరం అవుతాయి. యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులకే పరిమితం చేసినా.. ఏటా రూ. 3వేల 840 కోట్లు అవసరం అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇక, రైతులకు సంబంధించిన ఇతర హామీలను చూస్తే.. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఈ లెక్కన, రాష్ట్రంలో కొనుగోలు చేస్తున్న కోటి 30లక్షల టన్నుల ధాన్యానికి రూ. 6వేల 500 కోట్ల రూపాయలు అవసరం అవుతాయి.



# టీలతో అధిక భారం


సుజాత గోపగోని, 6302164068

ఇక, 'గృహజ్యోతి'కి సంబంధించి... ప్రస్తుతం రాష్ట్రంలో 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న గృహ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 95.23 లక్షలని టీఎస్ ట్రాన్స్‌కో లెక్కలు చెబుతున్నాయి. ఆ కుటుంబాలు ఏటా దాదాపు 9వేల 022 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. ఒక్కో యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం సగటున 7 రూపాయలుగా లెక్కించినా, ఈ హామీ అమలు కోసం ఏటా సుమారు రూ. 6వేల 315 కోట్లను ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది.

' ఇందిరమ్మ ఇళ్ల విషయానికి వస్తే.... రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలకు 20 లక్షల ఇళ్లు కట్టిస్తామన్న హామీ ప్రకారం, ఏటా నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి ,ఒక్కో ఇంటికి రూ.5 లక్షల మేరకు లెక్కగడితే.. 20లక్షల ఇళ్లకు మొత్తంగా రూ.లక్ష కోట్లు అవసరం అవుతాయి. అంటే.. రానున్న ఐదేళ్ల కాలానికి ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అయితే, సర్కారు తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఏడు వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. అంటే.. అంచనా మేరకు మరో రూ.13 వేలకోట్లు కేటాయించాల్సి ఉంటుంది.

మరో గ్యారంటీ 'చేయూత హామీ'ని పరిశీలిస్తే.. రాష్ట్రంలో ప్రస్తుతం 43.68 లక్షల మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ప్రతినెల దివ్యాంగులకు రూ.4 వేలు, ఇతర లబ్ధిదారులకు రూ. 2 వేలు అందజేస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్ రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు, ఇతర పింఛన్లను రూ.2 వేల నుంచి రూ. 4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన చూస్తే ఏటా 5.5 లక్షల మంది దివ్యాంగుల పింఛన్లకు రూ. 3వేల 960 కోట్లు, సుమారు 38 లక్షల ఇతర పింఛన్ల కోసం రూ.18వేల 240 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు యువ ఓటర్లపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. నిరుద్యోగులకు సంబంధించి పోరాటాలు చేసింది. ముఖ్యంగా ఉద్యోగ నియామకాలపై ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే ఆరు గ్యారెంటీల్లో 'యువ వికాసం' పేరుతో యువకులను ఆకట్టుకునే హామీలు ఇచ్చింది. అయితే, ఈ పథకంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. విద్యార్థుల ఫీజులు, కోచింగ్ చెల్లింపుల కోసం రూ. 5 లక్షల విలువైన విద్యా భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఏటా దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇంటర్మీడియట్ వంటి కోర్సులు పూర్తి చేసుకుంటున్నారు. వీరికి విద్యా భరోసా కోసం బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని ఆర్థిక సహాయం ఇస్తారా? లేదంటే ప్రభుత్వం నేరుగా వాళ్లకు ఈ ఆర్థిక సహాయం మొత్తం అందజేస్తుందా? ఫీజుల రూపంలో చెల్లిస్తుందా? అనే అంశాలపై స్పష్టత ఇంకా రాలేదు. అయితే, ఈ నిధులను ఎలా సర్దుబాటు చేస్తారనే విషయంపైనా, అప్పులు తీసుకుని ఇస్తే వడ్డీ ఎవరు భరిస్తారన్న విషయంపైనా స్పష్టత లేదని, దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉందంటున్నారు నిరుద్యోగులు



బట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి

ఆరుగ్యారెంటీల్లో ప్రధానంగా చెప్పుకోదగిన 'మహాలక్ష్మి గ్యారెంటీ' కింద ప్రధానంగా మూడు హామీలు ఇచ్చింది కాంగ్రెస్. వీటిలో ఒకటి అమలు చేసి.. ప్రజల నుంచి సానుకూల స్పందనను చవిచూసింది. 'మహాలక్ష్మి' కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందచేస్తామని, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీలు ఇచ్చింది. ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు కోటీ 65లక్షల మంది ఉన్నారు. ఇందులో సుమారు 26 లక్షల మంది ఇప్పటికే వితంతు, ఒంటరి, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు. వారిని మినహాయించినా మిగతా కోటీ 39లక్షల మంది మహిళలకు ప్రతినెలా రూ. 2వేల 500 లెక్కన చూస్తే.. ఏటా రూ. 41వేల 700 కోట్లు కావాల్సి ఉంటుంది.

ఇక, గ్యాస్ సిలిండర్ హామీని చూస్తే.. రాష్ట్రంలో మొత్తం 70లక్షల మంది మహిళల పేరిట వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్ రూ.500 హామీ అమలుకు ఏడాదికి పన్నెండు సిలిండర్లు ఇస్తే.. ఏటా రూ.4,200 కోట్లను గ్యాస్ కంపెనీలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఆరు సిలిండర్లకే పరిమితం చేస్తే రూ.2, 100 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇక.. ఇప్పటికే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతోంది. దీనికోసం ప్రతి నెలా రూ. 300 కోట్లు సర్కారుపై భారం పడుతోంది. ఈ లెక్కన చూస్తే.. ఏటా ఆర్టీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3 వేల 600 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్





# ఎన్నికల కరపత్రంగా

**ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మధ్యంతర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్, మరుసటి రోజు ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేసిన ప్రసంగాలు వైసీపీ ఎన్నికల కరపత్రాన్ని చదివి విన్పించి నట్లుందని రాజకీయ పార్టీలు, రాజ్యాంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలో చేసిన అభివృద్ధిపై వారు చెప్పినవన్నీ అసత్యాలేనని అంటున్నారు.**

ఇది మధ్యంతర బడ్జెట్. ఏ ప్రభుత్వమైనా ఏప్రిల్ నుంచి జూన్ మాసం వరకు రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, జీతాల చెల్లింపు వంటి పద్దులను చూపిస్తుంది. కానీ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గత నాలుగున్నరేళ్లలో చేసినవి, చేయనివి కలిపి రాష్ట్రాన్ని ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలబెట్టామని ఆర్థికమంత్రి గొప్పలు చెప్పుకున్నారు. అయితే అవన్నీ తప్పుడు లెక్కలేనని, గణాంకాలేవీ నమ్మదగ్గవిగా లేవని విపక్షాల వాదన. ఒకవైపు రాష్ట్రంలోని అవినీతిపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుంటే ఆర్థికమంత్రి సభలో 'సుపరిపాలన ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, సంక్షేమ ఆంధ్ర, భూభద్ర ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర' అని 'సప్తాంధ్రల'ను చెప్పుకోవడాన్ని చూసి విపక్షాలే కాదు ప్రజలు కూడా నవ్వుకుంటున్నారు.

2-3శాతం కంటే ఎక్కువ ఉండకూడని ద్రవ్యోల్బణం నేడు రాష్ట్రంలో 8.5 శాతంగా ఉంది. రాష్ట్రం దాదాపు రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోతే దానిని రూ. ఏడెనిమిది లక్షలకు కుదించడానికి ప్రయత్నం చేశారు. జగన్మోహన్‌రెడ్డి సర్కారు చేస్తున్న మితిమీరిన రుణాలపై కేంద్రప్రభుత్వం ఎన్నోసార్లు హెచ్చరికలు జారీచేసినా, లక్ష్యపెట్టకుండా అప్పులు చేయడం ఆనవాయితీగా మార్చేశారు. రెవెన్యూ లోటును రూ.24,758.22 కోట్లుగా, ద్రవ్యలోటును రూ.55,817.50 కోట్లుగా చూపించారు. గడిచిన నాలుగేళ్లలో రెవెన్యూలోటు 224%, ద్రవ్యలోటు 128% పెరిగిందని కాగ్ నివేదిక బట్టబయలు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం లోటును కప్పిపుచ్చిందంటున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఒరిగేదేమీ లేకపోవచ్చు. కానీ రాష్ట్ర ఆర్థికవ్యవస్థకు తీవ్రముప్పు. అంచనాకు, వాస్తవ వ్యయానికి ఎంతో తేడా కన్పిస్తోంది. ఒక్క నాల్గవ త్రైమాసికంలోనే 63% మాత్రం వ్యయం నమోదైంది. రూ.4000 కోట్ల సెక్యూరిటీ బాండ్లను ఆర్బీఐకి కుదవబెట్టి ఉద్యోగులకు జీతాలిచ్చిన చరిత్ర వైసీపీ సర్కారుది. జనానికి పనికల్పిస్తేనే ఆదాయం వస్తుంది. కానీ ఇక్కడ ప్రజల తలసరి ఆదాయం శూన్యం. ఖాతాల్లోకి బదిలీ అయిన సొమ్మునూ తలసరి ఆదాయంగా చూపించారు. నైపుణ్యాభివృద్ధి లేనప్పుడు మానవ వనరుల అభివృద్ధికి అవకాశం ఉండదు.



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
**ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ**

రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి ప్రస్తావించలేదు. డీబీటీ పేర్లతో బటన్ నొక్కుడు కార్యక్రమాలు, అనవసర ప్రచారాలు, నిధులు దుర్వినియోగం, ఉత్పత్తికి దోహదపడని అనవసర వ్యయాలు ఉన్నాయి. వెనుకబడిన 7 జిల్లాలను ఏ రకంగా అభివృద్ధి చేస్తారో చెప్పలేదు. విశాఖపట్నం రైల్వేజోన్‌కు స్థలం ఇవ్వలేదు. రామాయపట్నం పోర్టు, కడప ఉక్కు కర్మాగారం వంటి అంశాలను ప్రస్తావించలేదు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత లేదు. ఈ ప్రాజెక్టుకు రూ.55వేల కోట్లు ఖర్చు చేస్తుందని అంచనా వేస్తే, ఇందులో రూ.33వేల కోట్లు పోలవరం నిర్వాసితుల కోసం కేటాయించాలి. పునరావాసం పూర్తికాకుండా, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ఈ ప్రాజెక్టు పూర్తి కాదనేది అందరికీ తెలిసిన విషయమే. కాని పోలవరం విషయంలో ప్రభుత్వం తీవ్ర అలసత్వం చూపిస్తోంది. పులిచింతల నిర్వాసితులకు పరిహారం కంటితుడుపు చర్యగానే మిగిలిపోయింది.

రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు ఎలాగూ లేవు. కనీసం కీలక ప్రాజెక్టులకు ఒకరాయి పేర్చలేదు. ఒకవైపు రైతులు తుపానులు, వర్షాభావ పరిస్థితుల్లో చిక్కుకుని లక్షల ఎకరాల్లో పంటలు కోల్పోయినా, ప్రభుత్వం ఆదుకోకపోగా 'అన్నపూర్ణ ఆంధ్ర'గా చెప్పుకోవడం సరికాదనే వ్యాఖ్యలు ఉన్నాయి. రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయంమీదనే ఆధారపడినట్లు చెబుతున్న ప్రభుత్వం రైతులను ఉద్ధరణకు తీసుకున్న చర్యలు ఏమిటో చెప్పలేదు. కేంద్రం ఇచ్చే నిధులకు కొంత చేర్చి మొత్తం తామే ఇస్తున్నట్లు చెప్పుకోవడం చూస్తున్నాం. పంటల బీమా క్లైయిమ్‌ల్లో జాప్యంపై రైతులకు ఇంతవరకు సమాధానం చెప్పలేదు. రైతు కూలీలను ఆదుకునేందుకు ఒక్క పథకమూ లేదు. రాష్ట్రంలో గ్రామీణ నిరుద్యోగం విపరీతంగా పెరగడానికి ఇదే ప్రధాన కారణం. పైగా, విద్యుత్ మీటర్లు పెట్టి రైతులను దెబ్బతీస్తున్నారు. కరెంటు కోతలేమైనా తగ్గాయా అంటే అదీలేదు. నీటి వాటాలు గానీ, విద్యుత్ బకాయిలు గానీ... ఏవీ తేలలేదు. అవన్నీ అపరిష్కృత సమస్యలే. కొత్తగా చేసిన భూహక్కు పరిరక్షణ చట్టం, రక్షణ కల్పించడం మాట అటుంచి తన భూహక్కులను కోల్పోయే ప్రమాదంలో రైతులను పడేసింది. రెవెన్యూ అధికారులే న్యాయ మూర్తులుగా మారిపోయిన పరిస్థితి ఏర్పడింది.

వికేంద్రీకరణ పేరుతో అస్తవ్యస్థం చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీకి ముద్రవేశారు. మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని నాశనం చేశారు. మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్న విషయాన్నీ ప్రభుత్వం మరచిపోయింది. ఈ ప్రసంగాలలో కీలకమైన రాజధాని అంశమే ప్రస్తావనకు నోచుకోలేదు. స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. జిల్లా, మండల, సర్పంచుల నిధులను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

డీబీటీ అందిస్తున్నామనే పేరుతో ఎస్సీ,ఎస్టీ,



# మధ్యంతర బడ్జెట్

సబ్‌ప్లాన్ అమలు చేయడం లేదు. 56 బీసీ కార్పొరేషన్‌ల ద్వారా ఖర్చు చేయడానికి నిధులు ఎంత కేటాయించారో చెప్పలేదు. రాష్ట్రంలో ప్రధాన రహదారుల పరిస్థితి ఎంతో అధ్వానంగా ఉంది.

నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అధికారంలోకి వస్తే 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామన్న జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని నిరసనవ వ్యక్తమవుతోంది. వలంటీర్ల నియామకం తప్ప కొత్తగా ఉపాధి కల్పించలేదు. రాష్ట్రంలో 8,366 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గత సెప్టెంబర్ 22వ తేదీన శాసనమండలిలో ప్రకటిం చారు. కానీ 6,100 ఖాళీల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారు. అందుకు కారణం చెప్పవలసి ఉందని, మిగిలిన పోస్టులూ భర్తీ చేయాలని డిమాండ్‌లువ వస్తున్నాయి. ఐటీకి ప్రోత్సాహం లేక బీటెక్ పాసైన వారంతా ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారు. తలసరి ఆదాయంలో రాష్ట్ర స్థానం 17కాగా, రాష్ట్రంలో పట్టభద్రుల నిరుద్యోగిత 24శాతంగా నమోదైంది.

ఉద్యోగులకు 11వ వేతన సంఘం సిఫార్సులు అమలు చేశామని చెప్పారు. కానీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పోరాటాలు చేసేవారిపై రాష్ట్రప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ఇది ఏ స్వేచ్ఛ, ఎలాంటి సమానత్వం. అంగన్‌వాడీ, ఆశలు, పారిశుద్ధ కార్మికులు ఆందోళన చేస్తుంటే ఎస్మా ప్రయోగించారు. రాష్ట్ర పిఆర్‌సిల చరిత్రలో అత్యంత అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా 11వ పిఆర్‌సి అమలు జరిగింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సమస్యలపై గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఎప్పటికి అమలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.


రాష్ట్రంలో విద్యావ్యవస్థను నిస్తేజం చేశారని విద్యారంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. మాతృభాష తెలుగును దూరం చేసేందుకు శతవిధాల ప్రయత్నాలు చేశారు. ఉపాధ్యాయులు లేకుండానే ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్‌ఈ, ఐటీ, టోఫెల్‌లలో బోధిస్తామని చెప్పి బోల్తా పడింది. 3 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తే విద్యారంగంలో నాణ్యత ఎంతుందో అవగతమవు తుందంటున్నారు. రాష్ట్రంలో అక్షరాస్యతలోనూ వెనుకబడినా, డ్రాపౌట్లు తగ్గాయని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో పీజీ కోర్సుల్లో చేరిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయలేదు. ఈ అంశంపై కళాశాలలు న్యాయస్థానంలో గెలిచినా, వారికి బిల్లులు చెల్లించడంలో బేరాలాడుతున్నారని విమర్శలొచ్చాయి. 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అయితే వాటిలో ఐదింటికే ప్రవేశాలు మొదలయ్యాయి. తక్కినవి కేంద్రం అనుమతుల్లేక ఆగిపోయాయి.

సుపరిపాలన అర్థాన్నే మార్చి పడేశారు. సాధారణ పాలనలోనే ప్రభుత్వం విఫలమైంది. వైసీపీ నాయకులు చేసిన భూకబ్జాలకు కొదవేలేదనేది రోజూ వచ్చే ఆరోపణల్లో వెల్లడౌతోంది. సహజవనరులను ఇష్టానుసారం దోచుకుంటున్నారు. ఇసుక, కొండలు, గుట్టలు లూటీ చేస్తున్నారు. ఈ పరిస్థితిలో 'సంపన్న ఆంధ్ర' అని చెప్పుకోవడం అర్థరహితం. లేని పెట్టుబడులను, రాని కంపెనీలను వచ్చినట్లు చెప్పుకున్నారు. నిజానికి కొత్త కంపెనీ ఒక్కటి కూడా రాకపోగా, గతంలో వచ్చినవి సైతం వైసీపీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి. ప్రభుత్వ వేధింపులు భరించలేకనే ఎందరో పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ వెళ్లిపోయారు. సంపద సృష్టి జీరో. 'మహిళా మహరాణుల ఆంధ్ర' అని మంత్రి చెప్పడం అసహజంగా ఉంది. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా మహిళల పట్ల క్రైమ్ రేటు పెరిగింది. మిస్సింగ్ కేసుల్లో మనదే అగ్రస్థానం.

వైసీపీ వచ్చే ఎన్నికల్లో గెలుపునకు నవరత్నాలపైనే ఆధారపడింది. అందుకే బడ్జెట్ ప్రసంగంలో నవరత్నాల గురించి పదేపదే చెప్పడానికి నానాతంటాలు పడ్డారు. గ్రామాల్లో, పట్టణాల్లో నవరత్నాల లబ్ధిదారుల ఎంపికలోనూ, వారి తొలగింపులో గత రెండేళ్లలో రాజకీయాలు చొరబడ్డాయి. ఇవన్నీ గ్రామ సచివాలయాలు వేదికగా జరిగాయన్నది వాస్తవం. లబ్ధిదారుల సంఖ్యలోనూ, లబ్ధిలోనూ కోతలు విధించిన విషయాన్ని విస్మ రించారు. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య అంతరాన్ని ఇన్నేళ్లకూ గుర్తించలేక పోవడం బాధాకరం. విద్యాదీవెన, అమ్మ ఒడి పథకాల్లో ఎన్నిసార్లు మీటలు నొక్కినా, తల్లుల ఖాతాల్లో కోతలే కన్పించాయి. ఏదేమైనప్పటికీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చూపాల్సిన బడ్జెట్ కేవలం వైసీపీ ఎన్నికల కరపత్రంగా, క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఉందని నిపుణులు విమర్శిస్తున్నారు. ★



వికేంద్రీకరణ పేరుతో అస్తవ్యవస్థం చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీకి ముద్రవేశారు. మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని నాశనం చేశారు. మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్న విషయాన్నీ ప్రభుత్వం మరచిపోయింది. ఈ ప్రసంగాలలో కీలకమైన రాజధాని అంశమే ప్రస్తావనకు నోచుకోలేదు. స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. జిల్లా, మండల, సర్పంచుల నిధులను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.




# 12 రామాయణం నాటి మంత్రి వ్యవస్థ

కాని సత్యనిష్ఠుడైన రామచంద్రుడు రాజ్య సభలో తన మంత్రిసమితి ప్రముఖుడు వశిష్ఠుని ఈ సమస్యపై నిర్ణయం చేయమని అడిగాడు. వశిష్ఠుడు రామచంద్రుని భావనకు, ప్రజాభిప్రాయానికీ, లక్ష్మణుని గొప్పతనానికీ విలువ ఇవ్వలేదు. అవి న్యాయానికి, సత్యానికీ విరుద్ధంగా ఉన్నాయి. వీటి అన్నిటికన్న అయోధ్య రాజ్య సింహాసనం ప్రతిష్ఠ అధికమైనది. ఆ ప్రతిష్ఠకోసం ఎంతటి బలిదానం అవసరమైనా చేయవలసిందే నని ఆయన నిశ్చయించాడు. తెల్లటి బట్టమీద పడిన చిన్న మరక అయినా ఎలా కొట్టవచ్చినట్లు కనపడుతుందో, అదేవిధంగా శీలంపై అతిశ్రేష్ఠ మైన పరిణామాలను ఉత్పన్నం చేసే మహా సింహాసనం సూక్ష్మతమ పతనం కూడ దాచి ఉండబడజాలదు. దాని న్యాయంలో ఏ కొద్ది తేడా వచ్చినా సింహాసనం ప్రతిష్ఠకు కళంకం ఏర్పడుతుందని ఆయన భావించారు. వ్యక్తి సదా నశ్వరుడే. మృత్యుముఖంలో వ్యక్తి బలిదానం కావడం విధి విధానం అయినప్పుడు ఆ బలిదానం ఒక మహాతత్వం సిద్ధికోసం ఎందుకు జరుగకూడదు? ఇలా ఆలోచించి వీతరాగుడైన ఆ మహాపురుషుడు రాజ్యసభలో తన నిర్ణయాన్ని ఇలా వినిపించాడు :

**దుష్టమేతమ్ మహాబాహో**
**క్షయంతే రోమహర్షణమ్,**
**లక్ష్మణేన వియోగస్య**
**తవ రామ మహా యనః**
**త్య జైనం బలవాన్ కోలో**
**మా ప్రతిజ్ఞం వృథా కృథాః ।**
**ప్రతిజ్ఞాంహి నష్టాయాం**
**ధర్మోహి విలయం ప్రజేన॥**
**నతో ధర్మ వినష్టేతు**
**త్రైలోక్యం సచారుచరమ్ ।**
**సదేవర్షిగణమ్ సర్వమ్**
**వినాశయతు న సంశయః ॥**
**సత్వం పురుష శార్దూలం**
**త్రైలోక్య స్యాపి పాలనాత్ ।**
**లక్ష్మణేన వినా చాద్య**
**జగత్ స్వస్థం కురూపవోహ ॥**

ఓ మహాబాహూ, ఆదర్శ రాజ ధర్మాన్ని పాలించడం కోసం సంసారిక జీవనంలో జరిగే వినాశనం విషయం మాకు తెలుసు, లక్ష్మణుని వినాశనం దుఃఖ పరంపరకు చరమసీమ అవుతుంది. కాని ఒక మహాతత్వాన్ని పాలించడం కోసం నీవు ఈ మహాదుఃఖాన్ని సహించవలసి ఉంది. కాలం ఎంతో బలవత్తరమైనది. ఇలా వినాశనం చేయాలనే భావం ఆ శక్తి మనస్సులో జనించినపుడు మానవ ప్రయత్నం వల్ల దానిని ఆపలేము. నీవంటి మహాపురుషుడు ఉత్పన్నం చేసిన తత్వనిష్ఠ పరిణామం వ్యక్తిగత వినాశనం అనే భయంవల్ల, దుఃఖంవల్ల అణుమాత్రం కూడా పతనం చెంద కూడదు. వినాశనం ఎంతటి భయానక మైన దయినా, దుఃఖం ఎంతటి తీవ్రమైనదయినా, నీ ప్రతిజ్ఞ మిథ్య కాకూడదు. న్యాయం విషయంలో నీ హృదయం కంపించకూడదు. ఒక వ్యక్తి , ఎంత గొప్పవాడయినా, ఆ గొప్పతనము వల్ల నీ ప్రతిజ్ఞ పూర్తికాకపోతే రాజ్యధర్మం సర్వనాశన మవుతుంది. సింహాసనం ప్రతిష్ఠ మట్టిలో కలసిపోతుంది. నీ వంటి మహాపురుషుల ద్వారానే ధర్మానికి వినాశనం జరిగితే, దానిలో ముల్లోకముల వినాశనం ఇమిడివుంది. కనుక విశ్వం ముందు ఒక మహా ఆదర్శాన్ని నిర్మించడం కోసం నీకు అత్యంత ప్రియుడయిన లక్ష్మణుని కూడ నీవు పరిత్యాగం చేయవలసి ఉంటుందని నా అభిప్రాయం.

వశిష్ఠుని ఈ నిర్ణయం ప్రకారం లక్ష్మణుని బలిదానం జరిగింది. ఆతర్వాత కొద్దిరోజులకే శ్రీరామచంద్రుడు కూడ సరయూ ప్రవేశం చేశాడు. అతడు తన కళ్ళతో ఈ వినాశం జరుగుతూ ఉండడం చూశాడు. కాని దానిల్లనే రామరాజ్యం అద్వితీయమైన ఆదర్శం విశ్వం ఎదుట నిర్మాణమయింది. ఈ ఆదర్శం వల్లనే భారతవర్ష విశ్వగురువుగా ఉన్నది.

**– శ్రీ బాలశాస్త్రి హరదాస్**

**జాగృతి 31.08.1964 సంచిక నుంచి**

ఆధ్యాత్మికం

సప్త చిరంజీవులు

# కర్తవ్యనిష్ఠకు మారుపేరు హనుమ



జీవనపారాయణంగా ప్రసిద్ధమైన శ్రీమద్రామాయణంలోని హనుమ భూమిక తరతరాలకు స్ఫూర్తి మంత్రం. జ్ఞానదృష్టిలో ఉపాస్య దేవతా స్వరూపుడు. విద్వాంసులలో అగ్రేసరుడు. సనకాది యోగీంద్రులకు సైతం ఉపాసనతత్వం ఉపదేశించిన ఉత్తమ దేశికుడు. మహాప్రాణ సంపన్నుడు. సముద్ర లంఘన వేళ ఆయన మహా ప్రాణశక్తిని వాల్మీకి మౌని అడుగడుగున ప్రస్ఫుటం చేశారు.

ఆయన నడత, కార్యదీక్షా దక్షతలు,యుక్తాయుక్త విచక్షణాది గుణాలను అనేక విధాలుగా ఆవిష్కరించారు. హనుమ రుద్రావతారమూర్తి అని శివపురాణం చెబుతోంది. త్రిపురాసుర సంహార సమయంలో శ్రీహరి తనకు అందించిన సహకారానికి కృతజ్ఞతగా శివుడే హనుమగా ఆవిర్భవించాడని 'వానరగీత' పేర్కొంది. స్వామి కార్యనిర్వహణలో అగ్రగామి. దాస్యభక్తికి, స్వామి భక్తి పరాయణతకు ప్రథమోదాహరణ. ఆరాధ్యదైవాన్ని హృదయం కవాటంలో నిలుపు కున్న భక్తాగ్రేసరుడు. శ్రీరామ చంద్ర గాఢ పరిష్వంగ అనుగ్రహపాత్రుడు.

నవమ బ్రహ్మ పదవి కంటే 'రామబంటు/దూత' అని వ్యవహరించడాన్ని ఇష్టపడే పరమ భాగవతోత్త ముడు. 'యత్రయత్ర రఘునాథ కీర్తనమ్/తత్రతత్ర కృతమస్తకాంజలిమ్'–రామనామం వినిపించిన చోటల్లా వినయాంజలితో నిలుచుండి పోతారట. 'జై శ్రీరామ్' అనే పిలుపుతో తన తేజశ్శక్తిని ప్రసరించి కార్యోన్ముఖులవుతారట. అందుకే 'శ్రీరాముడి వంటి ప్రభువు/యజమాని ఆంజనేయుడు వంటి సేవకుడు

# గుప్త సామ్రాజ్యంలో వేదభాష్య రచన

12




**వెంకటమాధవులు**

ఇతడు ఋక్ సంహితకంతటికిని భాష్యము రచించెను. ప్రథమాధ్యాయంత వాక్యముల వలన సుందరీ వెంకటాచార్యులు పుత్రుడనియు, సోదరుని పేరు సంకర్షణుడనియు, వెంకట గోవిందులను పుత్రులిద్దరు కలవాడనియు చోళ (ఆంధ్ర) దేశీయుడనియు తెలియుచున్నది. ఇతని కాలము 1050– 1150 ప్రాంతమని పండితుల భావన. ఇతడు "వర్జయన్ శబ్దవిస్తారం శబ్దైఃకతి పయైరితి" అని వ్రాసి దానిని పాటించినాడు. ఋక్ మంత్రములకు కేవలము పర్యాయ పదములను మాత్రమే వ్రాసి మంత్రార్థము సులభముగ స్పష్టముగ అర్థమగునట్లు చేసినాడు.

వ్యాకరణ వివరణమే లేదు. స్కందస్వామి భాష్యము మిక్కిలి సూక్ష్మముగనుండును. పదార్థ నిర్ణయమున బ్రాహ్మణ గ్రంథముల ప్రమాణమును చూపును.

వ్యాకరణ నిరుక్తాదులవలన వేదార్థ మత్యల్పముగనే అవగతమగుననియు, బ్రాహ్మణ గ్రంథానుశీలన వలననే సంపూర్ణ జ్ఞానము, నిశ్చితార్థాన బోధయు కలుగునని వీరి మతము.

**ధానుష్కయజ్వ**

ఇతడు మూడు వేదములకు భాష్యము రచించినట్లు "సుదర్శన మీమాంస" వ ల న తెలియుచున్నది.

"త్రివేదీ భాష్యకార్థః" త్రయీ నిష్ఠ వృద్ధః" అని పలుమార్లు ప్రస్తుతింప బడినాడు. ప్రస్తుత మీతని భాష్యమేదియు లభించుటలేదు.

**ఆనందతీర్థులు**

ద్వైతభావమును బోధించు "మాధ్వ వైష్ణవ సంప్రదాయ ప్రవర్తకులగు వీరిని మధ్వాచార్యులనియు వ్యవహరింతురు. వీరు ఋగ్వేద ప్రథమ మండల మందలి నలుబది సూక్తులకు మాత్రమే భాష్యము రచించిరి. వీరి భాష్యము ఛందోబద్ధము. శ్రీ జయతీర్థులన్నట్లు ఈ మధ్వభాష్యమున ఆదిదైవిక ఆది భౌతికార్థ వివరణమేగాక ఆధ్యాత్మికార్థ ప్రతి పాదనయు కలదు. ఈ విధముగ మాధ్వ భాష్యము ప్రత్యేక వైలక్షణ్యముతో సలరారుచున్నది. జయతీర్థులు ఈ భాష్యమునకు టీక వ్రాసిరి ఈ టీకపై శ్రీ నరసింహ తీర్థులు వివరణమును వ్రాసిరి. శ్రీ నారాయణ తీర్థులు "భావరత్న ప్రకాశిక" అను వివరణ గ్రంథమును వ్రాసిరి. ఈ వివరణలచే మాధ్వభాష్య హృదయము సువ్యక్తమగుచున్నది.

**ఆత్మానంద**

ఆత్మానందులు ఋగ్వేదమునందలి "అస్య వామీయ" సూక్తమునకు భాష్యము చేసిరి. తన భాష్యము చివర "అదియజ్ఞ విషయం ష్కన్దాది భాష్యం, నిరుక్తమదిదైవత విషయం, ఇదంతు భాష్యం అధ్యాత్మ విషయమితి" అని వ్రాసిరి. ఈ భాష్యమున ప్రతి మంత్రార్థము పరమాత్మతత్వము నుద్దేశించి వివరించుట విశిష్టత.

**శ్రీ సాయణాచార్యులు**

పదునాల్గవ శతాబ్దమున మహమ్మదీయ మత ప్రవాహము దక్షిణాపథమును ముంచివేయకుండ చెలియలికట్టయై నిలచి వేదమతోద్ధరణకు బద్ధకంకణులైన విజయనగర సామ్రాజ్యాధిపతులగు హరిహర బుక్క రాయల ఆస్థానమున పండిత, అమాత్య. సేనాపతి పదవుల నలంకరించిన శ్రీ సాయణాచార్యులు అగ్రజులైన మాధవాచార్యుల ప్రోత్సాహమున వేదభాష్యమును "మాధవీయమును" రచించెను.

ఇతఃపూర్వము వేదమునకెన్ని భాషములున్నను వైదిక ధర్మానుబోధనకు, సునిశ్చితవేదార్థావగతికిని ఈనాటికిని భారతీయులకు గల ఏకైక సాధనము సాయణాచార్యకృత భాష్యమొకటియే. వేదదుర్గమ దుర్గమున ప్రవేశించుటకు మనిశాల సింహద్వారమిది మాత్రమే.

సాయణేతర భాష్యకారులు ఏ ఒక్క వేదము నకో లేక వేద భాగమునకో భాష్యము వ్రాసిరి. శ్రీ సాయణులు నాలుగు వేదములకును భాష్యము రచించిరి. వీరికాలము వరకు వేద భాష్యపదము కేవల సంహితభాగ మాత్రద్యోతకమై యుండెడిది. వీరు వేదభాష్యపదము సంహితామాత్రమునే కాక బ్రాహ్మణగ్రంథ సముదాయ వ్యాఖ్యలను సైతము బోధించునట్లొనర్చిరి.

–యలమంద్రి సుబ్రహ్మణ్యశాస్త్రి

'జాగృతి' 03.01.1966 సంచిక నుంచి

---

లేరన్న'ది పెద్దల మాట. హనుమ బంటుగా లభించడం తన అదృష్టంగా రామచంద్రుడే కొని యాడాడని తులసీదాసు కీర్తించారు. కిష్కింధలో ఋష్యమూక పర్వతం వద్ద మారువేషంతో కనిపించిన అంజనీ సుతుని చూచిన రాముడు, సోదరుడు లక్ష్మణుడితో 'తమ్ముడూ! ఇతడు నవవ్యాకరణాలనూ చదివిన జ్ఞానసంపన్నుడు. సాక్షాత్తూ సరస్వతీ స్వరూపుడు' అని హనుమలోని విశిష్ట లక్షణాలను వివరించాడు. హనుమ తొలిసారిగా తనతో చేసిన సంభాషణను ప్రస్తావిస్తూ, 'హనుమ ఎంతసేపు మాట్లాడినా ఆయన వాక్కులలో అపభాషితం లేదు' (బహు వ్యావహారతా నేన/న కించి దపభాషితమ్) అని ప్రశంసించాడు.

సర్వవిద్యా పారంగతుడైనా ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే నిగర్వి కేసరిసుతుడు. పట్టుదలకు, కార్య సాధనకు మారుపేరు. స్వామి (యజమాని) కార్యం కోసం శక్తియుక్తులు ధారపోయాలని, అప్పగించిన కార్యాన్ని చిత్తశుద్ధి, అంకిత భావంతో నెరవేర్చా లన్నది ఆయన విధానం. అహం దరిచేరనీయక సంకల్ప బలం, మనోనిశ్చయం కలిగి నిరంతరం శ్రమించా లన్నది హనుమ సందేశం. జీవితంలో ఎదగాలను కునేవారు ఆయన నడతను ఆదర్శంగా తీసుకోవా లని రామకృష్ణ పరమహంస, వివేకానంద లాంటి జిజ్ఞాసువులు హితవు పలికారు.'దీక్ష, మనో నిగ్రహం, ధైర్యం, వినయం, త్యాగం, ఆత్మవిశ్వాసం, అంకిత భావం, మనోబలం, బుద్ధికుశలత, కార్య సాఫల్యానికి ప్రధాన లక్షణాలు. ఇవి సంపూర్ణంగా గల హను మను యువత ఆదర్శంగా తీసుకొని జీవితాలను తీర్చిదిద్దుకోవాలి' అన్నారు స్వామి వివేకానంద.

– రామచంద్ర రామానుజ

---

## వివేకానంద సూక్తిశతి



If you have faith in all the three hundred and thirty millions of your mythological Gods... and still you have no faith in yourselves, there is no salvation for you. Have faith in yourselves, and stand upon that faith and be strong; that is what we need.

సకల దేవతలను సతతమ్ము నమ్మినా
మిమ్ము మీరు మొదట నమ్మలేను
మీదు నమ్మకమ్ము మీకు ముక్తినొసగు
వినుడి స్వామి సద్వివేకవాణి!!



బండిరాజుల శంకర్

కథ

శ్రీరాముడు వనవాసానికి వెళ్లడంతో అయోధ్య నగర కళాకాంతులూ, వైభవం కూడా ఆయనతోనే వెళ్లిపోయాయేమో అన్నట్టు ఊరంతా ఒక్కసారి స్తబ్దంగా, నీరసంగా అయిపోయింది. పౌరులకే కాదు పశుపక్ష్యాదులకు కూడా చేష్టలుడిగాయి. ఆగని శోకం అందరి ఆకలి దప్పులను అపహరించింది. ఆకులు కదలవు. పక్షులు పాడవు. ఉత్సాహం అంతా ఎటో ఎగిరిపోయింది. ఉల్లాసం అంతా ఎక్కడో ఇంకిపోయింది. ఉన్నదంతా నిస్సంతోషం, నిస్పృహ?

దశరథుడి అంతఃపుర భవనాలన్నీ బావురుమంటున్నాయి. తన భవనం ముందున్న ఉద్యానవనంలో సుమిత్రాదేవి ఒంటరిగా కూర్చొని శూన్యంలోకి చూస్తున్నది. ఆ చూపులో ఏ భావమూ లేదు. దూరంగా కనిపిస్తున్న ఆకాశపు నీలి తెరమీద చిన్న రాణి ఊహలు మాత్రం ఒకే వరసలో మూడు చిత్రాలను పదే పదే చూస్తున్నాయి.

ఒక దృశ్యంలో, అయిదారు రోజులుగా తెరపిలేని నరకయాతన పడుతున్న తన భర్త. రోదించి, రోదించి ఇప్పుడు రోదించేందుకు కూడా శక్తి కోల్పోయి ఉన్నాడు. శత్రుదుర్నిరీక్షుడుగా వెలిగిన మహారాజు ఇప్పుడు శల్యావశిష్టుడై వట్టినేలమీద ఉన్మాదిలా పొర్లుతున్నాడు. శోకించే ఓపిక వస్తే, గువ్వ కుత్తుకతో 'రామా! రామా!' అంటూ వలవల విలపిస్తాడు.ఆ



కొంచెం శక్తీ పోగానే స్పృహ కోల్పోతాడు. అలా స్పృహ లేనప్పుడే ఆయనకు కొంత ఊరట. స్పృహ రాగానే మళ్లీ శోకం.

రెండో దృశ్యంలో ఆమెకు తన ముద్దుల తనయుడు లక్ష్మణుడు కనిపిస్తున్నాడు. ఆదిశేషుడిలాంటి ప్రజ్ఞాశాలి, తనకు ప్రాణంలో ప్రాణం అయిన కుమారుడు, అన్నీ వదిలేసి, అన్నా వదినల వెంట అరణ్యానికి వెళ్లిపోతూ, తన వంకకు తిరిగి చేతులు జోడించి,'అమ్మా, వెళ్లి వస్తాను. ఆశీర్వదించు' అంటున్న ముఖముద్ర ఆమె అంత రాంతరాలను మెలిపెడుతున్నది.

మూడో దృశ్యం ఆమెకు మరింత బాధాకరం. అన్ని సౌకుమార్యాలూ పుణికి పుచ్చుకొన్న అపురూప సుందరి ఊర్మిళ అమాయకపు ముఖం. అరణ్యవాస కాలమంతా అన్నకు తోడుండి అన్ని విధాల సేవ చేయాలన్న భర్త నిర్ణయాన్ని ఊర్మిళ నిస్వార్థంగా,

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

# సుమిత్ర

## ఎం. హనుమంత రావు



మనస్ఫూర్తిగా ఆమోదించి, తనకు తానే పద్నాలుగు సంవత్సరాల ఏకాంతవాస శిక్ష విధించుకొన్నది. ఎలాంటి సాధ్వికి ఎలాంటి విధివిలాసం ఎదురయింది!

అలా నిశ్చేతనంగా కూర్చొని ఉండగా ఎంత సమయం గడిచిందో సుమిత్రకు ధ్యాస లేదు. ఆ మూడే దృశ్యాలు మళ్లీమళ్లీ మనోనేత్రం ముందుకు వచ్చి ఆమె హృదయాన్ని తొలిచి వేస్తున్నాయి.

వనజ వచ్చి తన ఎదుట అంజలి ఘటించి నిలబడి ఉన్నదన్న విషయం గ్రహించడానికి సుమిత్రకు రెండు గడియలపైనే పట్టింది. గ్రహించగానే, నివ్వెరపోయి,'వనజా! నువ్వా! అకస్మాత్తుగా ఇలా వచ్చావు? ఏదయినా విశేషమా? అక్కగారికి కుశలమేగా?' అన్నది.

వనజ, మహారాణి కౌసల్యాదేవికి ఆంతరంగిక పరిచారిక. కౌసల్య కొత్త పెళ్లికూతురుగా అయోధ్య వచ్చినప్పుడు, ఆమెతో వచ్చిన అరణంలో భాగంగా వనజ వచ్చింది. ఇప్పుడు బాగా వృద్ధురాలు. అంతఃపురంలో అందరికీ ఆమె తలలో నాలుక. కౌసల్యతోనూ, సుమిత్రతోనూ ఆమెకు చాలా చనువు.

'భట్టారికకు అభివాదాలు! మహారాణి ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. సుమంత్రుల రథం శ్రీరాముడిని తీసుకొని చూపుమేర దాటినప్పటి నుంచి మహారాణి కంటికీ మింటికీ ఏకధారగా కన్నీరు కారుస్తూనే ఉన్నారు. పగలు లేదు, రాత్రిలేదు. ఆహారం లేదు, నిద్ర లేదు. ఇంతటి దుఃఖం అటు మహారాజు గారినీ ఇటు పట్టమహిషినీ ఇలా దహించి వేస్తుంటే, అంతఃపుర పరిజనానికి దిక్కు తోచడంలేదు. ఆ దుఃఖభారాన్నుంచి కొంత కాలమైనా, కొంతయినా ఉపశమనం లేకపోతే చాలా ప్రమాదం అని మా అందరికీ స్పష్టంగా తెలుస్తున్నది. కానీ మహారాణికి ఏమి చెప్పి దుఃఖం శాంతింపజేయాలో, ఎలా మళ్లీ మన లోకంలోకి తేవాలో బోధపడడం లేదు. కొడుకు దూరమైన నాటి నుంచి మహారాణి మాటలే మానేశారు. శోకమే ఆమె భాష. కన్నీళ్లే ఆమె మాట. కాలం గడిచిన కొద్దీ శమించాల్సిన దుఃఖం తగ్గుముఖం చూపటం లేదు సరికదా, మరింత పెరిగి పోతున్నది. ఈ స్థితిలో ఆమెను ఓదార్చగల స్థాయీ, చనువూ, చాకచక్యం ఉన్న వాళ్లు నాకు ఎవరూ కనబడక, ఏదయినా ఉపాయం చెప్తారని మీ దగ్గరికి వచ్చాను' అంది వనజ. కౌసల్యా సుమిత్రల మధ్య ఉన్న గాఢమైన

మైత్రీ, పరస్పర ప్రేమాదరాలూ అంతఃపురంలో అందరూ ఎరిగినవే.

చటుక్కున లేచి నిలబడింది సుమిత్ర. ఆమె పదహారణాలా రాజపుత్రిక. ఎప్పుడూ నిశ్చలంగా, ప్రశాంతంగా, ప్రసన్నంగా కనిపిస్తుంది. ముఖకవళికలు చూసి ఆమె భావనలు పసిగట్టడం వనజ లాంటి చనవరికీ, అనుభవజ్ఞురాలికి కూడా సాధ్యం కాదు.

'పద, వనజా! ఇప్పుడే అక్కగారి మందిరానికి వెళదాం' అంది సుమిత్ర. అతి నిరాడంబరంగా, ఆటోపాలేవీ లేకుండా, సమీపంలోనే ఉన్న కౌసల్యా మందిరానికి కాలి నడకన వెళ్లారు సుమిత్రా దేవీ, వనజా.

పట్టమహిషి అయిన తరువాత చాలా కాలం కౌసల్య జీవితం కష్టాలమయంగా సాగింది. భర్తకు తనపట్ల గాఢమైన అనురాగం కాదుగదా, సామాన్యమైన సుముఖత కూడా లేదు. చాలా కాలం పాటు సింహాసనానికి వారసుడు పుట్టకపోవడం ఆమె అపరాధమయినట్టు మహారాజు ప్రవర్తించే వాడు. సుమిత్ర విషయమూ దాదాపు అంతే. రాజ్యపాలన విషయంలో చూపిన ధర్మబద్ధతనూ, నిష్పాక్షికతను భార్యల విషయంలో దశరథుడు చూపలేదు. ఆయన కైక చేతిలో కీలుబొమ్మ. సవతులతో సామరస్యంగా మెలగడం కైక స్వభావం కాదు.

అదృష్టవశాన, యజ్ఞఫలంగా సంతానం కలిగింది. వాస్తవానికి ఆ తరువాత కూడా భర్తకు తనయుడి మీద మోహమే తప్ప, మహారాణి మీద మమత పెరగలేదు. అయినా శ్రీరామజననంతో కౌసల్య కష్టాలు చాలా వరకు గట్టెక్కాయి. రామచంద్రుడు అన్ని రకాల దైన్యాంధకారాలనూ తొలగించగల రాకాచంద్రుడు. సాక్షాత్తూ ఆయననే బిడ్డగా పొందిన తరవాత కౌసల్య జీవితం బాగా కుదుటబడింది.

కరుణాపయోనిధి తల్లికయినా కడగళ్లే లేకుండా కాలం గడిచి పోతుంటే, క్రూరవిధికి కళ్లుకుట్టక మానవు కాబోలు. వారం క్రితం అంతఃపురంలో జరిగిన విచిత్ర ఘటనల వల్ల అయోధ్యరాముడి యౌవరాజ్య పట్టాభిషేకం అనూహ్యంగా ఆగిపోయింది. అదేకాదు, దాంతోపాటు కౌసల్యకు పిడుగుపాటు లాంటి మరో దెబ్బ తగిలింది. రామ వనవాస సమాచారం. రాముడి ఆకర్షణ గొప్పది. ఆయనను అసలెప్పుడూ చూడని వాళ్లను గూడా ఆయన గుణగణాలు అమితంగా ఆకర్షిస్తాయి. ఆయనతో కొంతకాలం గడిపిన వారికి, ఆయన లేని జీవితం నిస్సారం, నిరర్థకం అనిపిస్తుంది. ఆయనను బిడ్డగా పొందే భాగ్యం కలిగిన ఆయన తల్లిదండ్రుల మాట చెప్పాలా?సకలసద్గుణాభిరాముడైన కుమారుడి వియోగం దావాగ్నిలా తల్లితండ్రుల ఎదదలను దహించేస్తున్నది.

కౌసల్య దుఃఖాన్ని ఉపశమింపజేసేందుకు వనజ యోచించిన ఉపాయం కొంతలో కొంత పారింది. సుమిత్రను దూరం నుంచి చూస్తూనే కౌసల్య ఆత్మీయంగా లేచి వచ్చింది. చెల్లెలు అక్కను ఆప్యాయంగా అక్కున చేర్చుకొంది. అక్కచెల్లెళ్లు కొన్ని నిమిషాలపాటు బావురుమని ఏడ్చిన తరవాత దుఃఖం ఉధృతికొంత తగ్గింది.

ఆ తరవాత మౌనం రాజ్యం చేసింది. అక్క చేతిని తన చేతిలో తీసుకొని సుమిత్ర దూరంగా చూస్తూ కూర్చొంది. కౌసల్య ఆమె ముఖంలోకి చూస్తూ ఉంది. శోకదేవతలా ఉన్న అక్కతో పోలిస్తే సుమిత్ర నిర్వికారంగా ఉంది. అలా చాలా సేపు గడిచిన తరవాత, 'చెల్లీ, వనజ నన్ను ఊరడించేందుకు నిన్ను పిలవడం చాలా అనాలోచితమైన పని అనుకొంటాను!' అన్నది కౌసల్య.

'ఎందుకని?'

'ఎందుకేమిటమ్మా, నాకన్నా నువ్వు ఏ విధంగా తక్కువ దుఃఖంలో ఉన్నావు కనక? తన తప్పుకు కుమిలిపోతూ,కదలేని మనోవ్యథలో ఉన్న భర్త గురించిన చింత మన ఇద్దరికీ సమానమే. నా బహిఃప్రాణమైన నా బిడ్డ అడవి పాలయ్యాడు. నీ బహిఃప్రాణమైన నీ బిడ్డ కూడా అలాగే అదే అడవికి వెళ్లాడు. కనీసం నా కుమారుడు తండ్రి ఆజ్ఞ అన్న కారణంగా అడవికి వెళ్లాడు. అన్నకు తన సేవ అవసరమని నీ కుమారుడు స్వచ్ఛందంగా అడవికి వెళ్లాడు. నా కుమారుడికి తన భార్య తోడుగా వెళ్లింది. నీ కోడలు తన భర్త నిర్ణయానికి కట్టుబడి, తను ఒంటరిగా ఆయన కోసం సుదీర్ఘ నిరీక్షణలో కాలం గడుపుతున్నది. అన్నీ అనుభవించాల్సిన వయసులో కొడుకూ కోడలు, ఒకరికొకరు దూరమై, తపస్వుల్లా కాలం దొర్లించడం నీ కెంత చిత్తక్షోభ కలిగిస్తుందో నేను ఊహించ గలను. నీ పరిస్థితి మరొకరికి ఓదార్పు చెప్పగల స్థితా? నిజానికి నేనే నీకు సాంత్వన చెప్పాలి. కానీ ఇప్పుడు నేనూ అలాంటి మనఃస్థితిలో లేనమ్మా!'


'అక్కా! నీవల్ల నాకు సాంత్వన ఇప్పటికే లభించింది. నీ వేదన తలచుకోగానే, నాకు మనసు కరిగిపోయింది. నీ బాధ పంచుకోవాలనే ఆరాటంలో నా బాధ కొంత తగ్గి, నేను భరించగల స్థాయికి వచ్చింది. నా బాధను నువ్వు గుర్తించి స్పందిస్తున్నా వంటే, నీ బాధ కూడా నువ్వు భరించగల స్థాయికి వచ్చినట్టే. ఇందుకే కదా కష్టాలను ఆత్మీయులతో కలబోసుకొంటే, మనోవ్యథ కొంత ఉపశమిస్తుంది అంటారు. ఇతరుల వేదన పట్ల మనలో కలిగే సంవేదన, మన మనోవేదనకు మంచి మందు.'

'ఈ దుఃఖాన్ని నేను ఇప్పటికీ మోయలేకుండానే ఉన్నాను,సుమిత్రా !'

'అక్కా, నేనది అర్థం చేసుకోగలను. కొంచెం హెచ్చు తగ్గులుగా మనిద్దరమూ అతితీవ్రమైన దుఃఖంలోనే ఉన్నాం. ఆ సత్యాన్ని నిరాకరిస్తే అది ఆత్మ వంచనే తప్ప పరిష్కారం కాదు.'

'విధి పగబట్టి విధించిన శిక్ష ఇది. దీనికి పరిష్కారం ఎక్కడుంటుంది?'

'బయటెక్కడా ఉండదు. ఉంటే మన చేతిలోనే ఉంటుంది. అక్కా, నేను నీకేదో చెప్పగలిగినంత దాన్ని కాను. సందర్భం వచ్చింది కనక ఎప్పుడో నువ్వు నేర్పిన మాటలే నీకు గుర్తు చేయాలి. అనుకోని పెనుదుఃఖం అకస్మాత్తుగా ఎదురై బాధించినప్పుడు, ఆ బాధలోనే మునిగి ఉండిపోతే, ఇక ఆ దుఃఖం దూరమయ్యేదెలా?ఎలాగోలా ధైర్యం కూడగట్టుకొని, ఆ దుఃఖాన్ని పోగొట్టుకొనే మార్గమో, కనీసం కొంత తగ్గించే మార్గమో మనమే అన్వేషించుకోక తప్పదు. 'దుఃఖవశమైపోయిన మనసును స్థైర్యంతో, వివేచనతో కొంతవరకైనా మళ్ళీ స్వవశం



చేసుకోకపోతే ఇక మనిషిపుటుకకు, అందునా రాచ పుట్టుకకు అర్థమేలేనట్టు!' అని నువ్వు నాకు ఎన్నోసార్లు చెప్పావు'

'నిజమే! అయితే, దైవం ఇంతగా ప్రతికూలించినప్పుడు, ఏ వివేచన అక్కరకు వస్తుంది, తల్లీ?

'అదీ నువ్వే చెప్పావు. మన వివేచనే!. ప్రాణులు దేహాలు ధరించి ఈ భూమిమీద జన్మ ఎత్తేది, వాళ్ల ప్రారబ్ధ కర్మను సుఖదుఃఖాల రూపంలో అనుభవించేందుకే. కర్మఫలాలు నిశ్శేషంగా అనుభవించేసిన వాళ్లకు ఆ పైన జన్మ రాహిత్యమేతప్ప జన్మ ఉండదుకదా! కనక జన్మ ఎత్తామంటేనే, అనుభవించాల్సిన సుఖదుఃఖాలేవో అనుభవించేసి, కర్మల అప్పు తీర్చేసుకోవ డానికి. అలాంటప్పుడు జీవితంలో వాస్తవంగా ఆ అనుభవాలు ఎదురయినప్పుడు దుఃఖించడం అసమంజసం, నిష్ప్రయోజనం.'

'కావచ్చు, సుమిత్రా! అయినా కూడా ఆ అనుభవాలు కొన్ని మనల్ని భరించలేనంత దుఃఖంలో ముంచెత్తినప్పుడు, వాటిని తట్టుకోవడం ఈ మెట్ట వేదాంతాలు చెప్పినంత తేలిక కాదు.'

'అవును. కానీ ఆ దుఃఖం తగ్గించుకొనేందుకు ఏదయినా చెయ్యాలికదా? రోగగ్రస్తుడికి తన వ్యాధి తత్త్వమూ, కారణమూ, అవధీ, పరిష్కారమూ తెలిస్తే, వ్యాధి వెంటనే నయమవకపోయినా, కొంత ఉపశాంతి. దుఃఖగ్రస్తులకూ అంతే!ఈ దుఃఖం మన పూర్వకర్మల వల్ల కలుగుతున్న పీడ. ఆ పీడ విరగడ కావాలంటే, దాన్ని అనుభవించడమొక్కటే మార్గం. మరో మార్గమే లేదు. దాన్ని అనుభవించేదాకా అది నీ వెనకే ఉండి భయపెడుతూ ఉంటుంది. కనక కష్టం అనుభవించేటప్పుడు,'దీంతో నా దుష్ట కర్మఫలాల పీడ వదిలి పోతున్నది' అన్న సకారాత్మక అవగాహన ఉంటే, ఆ కష్టాలు ఒకింత తక్కువ బాధిస్తాయి. అంతేకాదు, తక్కువ బాధించినా ఎక్కువ బాధించినా కష్టసుఖాలు కలకాలం ఉండవు కదా?వస్తుంటాయి, పోతుంటాయి. ఇది అనివార్యమని మన కులగురువులు మనకు చాలా సార్లు చెప్పిన మాటే'

'చెప్పారు, కానీ,తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు ఈ సత్యాలు స్ఫురించవు. అలాంటప్పుడు వాటిని గుర్తు చేసేందుకు నీలాంటి ఆప్తులు లభిస్తే, అదొక ఊరట'అన్నది పట్టమహిషి. ఆమె ఆలోచనలో పడింది. తరవాత, 'కానీ, ఇప్పటివరకూ పోగుచేసుకొన్న కర్మ ఫలాలు ఎలాగో స్థైర్యంతో పళ్లబిగువున ఇపుడు అనుభవిస్తే, ముందు కాలం మాత్రం తిన్నగా సాగుతుందని ఎలా అనుకోగలం? ఇప్పుడు జన్మఎత్తి ఉన్నాం కదా,ఈ జన్మలో మళ్లీ ఏవేవో కొత్త కర్మలు చేయకుండా ఉండడం సాధ్యం కాదు. చేస్తే మళ్లీ కొత్త కర్మఫలాలు పోగుపడుతూనే ఉంటాయి కదా?'

**'అక్కా! నీవల్ల నాకు సాంత్వన ఇప్పటికే లభించింది. నీ వేదన తలచుకోగానే, నాకు మనసు కరిగిపోయింది. నీ బాధ పంచుకోవాలనే ఆరాటంలో నా బాధ కొంత తగ్గి, నేను భరించగల స్థాయికి వచ్చింది. నా బాధను నువ్వు గుర్తించి స్పందిస్తున్నా వంటే, నీ బాధ కూడా నువ్వు భరించగల స్థాయికి వచ్చినట్టే. ఇందుకే కదా కష్టాలను ఆత్మీయులతో కలబోసుకొంటే, మనోవ్యథ కొంత ఉపశమిస్తుంది అంటారు.ఇతరుల వేదన పట్ల మనలో కలిగే సంవేదన, మన మనోవేదనకు మంచి మందు.'**



'అందుకేగదాపాత అప్పు తీరిపోయిందిలే అని ఏమరచి, దూకుడుగా మళ్లీ కొత్తకర్మల అప్పులు చేయకు అని ధర్మజ్ఞులు చెప్పేది. పాత అప్పు తీర్చడంలో పడుతున్న ఈ యాతనలన్నీ, 'ఇకముందన్నా సత్ఫలాలనిచ్చే పుణ్యకర్మలు చేయి, పాపకర్మలు వద్దు!' అని జీవితం నేర్పే పాఠాలుగా స్వీకరించమంటారు వసిష్ఠ మహర్షి. అంతకంటే గూడా ఉత్తమ మార్గం మరొకటి ఆయనే చెప్పారు– చేసే కర్మలన్నీ నిష్కామంగా, నిస్సంగంగా, ఫలం భగవదర్పితం చేసి చేస్తే, ఆ కర్మ ఫలాలు మనకు అంటవు. ముందుకాలంలో మనల్ని వేధించవు, అని. ఆయన మార్గ దర్శనం వల్ల కదా మనలాంటి వాళ్లం ఈ జన్మలో చేతనయినంత వరకు పుణ్యకర్మలే చేస్తూ పాప కర్మలకు దూరంగా ఉండే జాగరూకత చూపుతున్నాం.

'బాగా చెప్పావు. సుమిత్రా,నువ్వు నాకు నిజంగా సు–మిత్రవు... .'

'నీకు తెలియనిది నేనేం చెప్పానక్కా?'

'లేదా?అయితే నాకు తెలియనిది ఒకటి ఇప్పుడడుగుతాను చెప్పు. మొన్న సుమంత్రుడి రథమెక్కేటప్పుడు లక్ష్మణుడికి, 'రామం దశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజామ్'రాముడినే దశరథుడిగా, సీతనే నన్నుగా భావించు, సుఖంగా వెళ్లిరా' అని అంత నిశ్చింతగా ఎలా చెప్పగలిగావు? అరణ్యవాసంలో కుమారుడి యోగక్షేమాల గురించి నాకున్నట్టు నీకు భయమే లేదా?'

'అక్కడ 'దశరథ' అనడంలో నా ఉద్దేశ్యం, 'దశ'– పక్షి, 'రథ'–వాహనంగా కలవాడు..అని. శ్రీరాముడు గరుడవాహనుడైన శ్రీహరి అని గ్రహించమన్నాను. సీతను, 'మా'– లక్ష్మీదేవి, అని గ్రహించమన్నాను. వాళ్ల రక్షణలో నీ యోగక్షేమాలకు ఏ లోటూ ఉండదు గనక, అడవికయినా సుఖంగా వెళ్లిరమ్మని నా ఆశీర్వాదం. అంతే'

కౌసల్య కళ్లలో నీళ్లు నిండాయి. 'చెల్లీ,నా రాముడు అవతార పురుషుడంటావా?'

'అక్కా, తల్లివి గనక నీకు బిడ్డగానే కనిపించినా, శ్రీరాముడు నూటికి నూరు పాళ్లు అవతారపురుషుడు. తాటక వధ, సుబాహువధ, శివ ధనుర్భంగం, పరశురామ గర్వభంగం, అన్నిటినీ మించి లోకాతీతమైన అతని సద్గుణసంపత్తి– ఇవన్నీ అందుకు నిదర్శనాలు. అలాగే మన సీత. ఆమె అయోనిజ. ఆమె శ్రీహరికి అనపగామినిగా వెంట ఉండే శ్రీదేవి అని నా ధారణ. లోకాలన్నిటి యోగక్షేమాలను వహించే ఆ లోకాతీతుల శరణులో ఉన్న నా బిడ్డ యోగక్షేమాల గురించి నాకు ఎలాంటి చింతా లేదు'

'నువ్వు జ్ఞానివి. అర్థవంతంగా మాట్లాడతావు. నీ మాటలు నా దుఃఖ భారాన్ని తగ్గించి మనసును తేలికపరచాయి.'

'అయితే రాజభవనంలో మనలాగే పుత్రవియోగ బాధతో విలవిలలాడుతున్న మహారాజు దగ్గరికి వెళ్లి ఆయనకు ఊరట కలిగించే ప్రయత్నం చేద్దాం.'

'ఫలితం ఉంటుందా? ఆయన దుఃఖాన్ని తగ్గించడం సాధ్యమేనా?'

'ఏమో,భర్త దుఃఖాన్ని తొలగించేందుకు యథాశక్తి ప్రయత్నించడం భార్య కర్తవ్యం. అది చేద్దాం. ఆయన దుఃఖాన్ని తగ్గించేందుకు చేసే ప్రయత్నం, మన దుఃఖం మీది నుంచి దృష్టిని మళ్లించడమైతే తప్పనిసరి!అయినా ఫలచింత మనకెందుకు, దాని వల్లే కదా కర్మబంధాలూ, దుఖాలూ?' అంది సుమిత్ర.

మహారాజ మందిరానికి వెళ్లే ఏర్పాట్లు చేయాలని కౌసల్యా భట్టారికకు ఇచ్చిన ఆదేశం వనజకు కూడా సాంత్వనను కలిగించింది. పట్టమహిషి ఇక మనసు కుదుటపరచుకొని మనుషులలో పడుతున్నట్టే. ★



వాల్మీకి రామాయణం, గీతగోవిందం, కుమార సంభవం..ఇంకా మరెన్నో కావ్యాలకు నృత్యరూపకాలు అక్కడ ప్రదర్శితమవుతుంటాయి. ఇప్పటికీ నృత్యంతో పాటు సంగీత సాహిత్యాలకు పెద్దపీట.
ఆ స్థలం: కళాక్షేత్రం. అది తమిళనాడు రాజధాని చెన్నైలో. స్థాపించి ఇప్పటికి ఎనిమిదిన్నర దశాబ్దాల పైమాటే. సంస్థాపకురాలు రుక్మిణీదేవి.ఆమె స్థాపించిన సంస్థ ఒకప్పుడు – ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్. అనంతరకాలంలో కళాక్షేత్రంగా అవతరించింది. 'సేవ నిరుపమానం' అని సాక్షాత్తూ రవీంద్రనాథ ఠాగూర్ కితాబిచ్చారు. భరతనాట్యంతో

# విఖ్యాత నృత్య విదు

రుక్మిణీదేవి మొదట సంగీత ప్రేమికురాలు. ఎప్పుడూ పాటలు పాడుతుండే వారు. ఒక కార్యక్రమంలో ఆమె గాత్రాన్ని విన్న తండ్రి 'బాగా పాడుతున్నావ్. సంగీతం నేర్చుకో, ఇంకా బాగుంటుంది' అని సూచన చేశారు. అలా ఆమె సంగీత అనురక్తికి కారకుడు తండ్రి. కొంతకాలం గడిచింది. రుక్మిణికి పెళ్లయింది.దంపతులు పలు దేశాల్లో పర్యటించారు. ఒకచోట నర్తకరీతి రుక్మిణీదేవిని ఎంతగానో ఆకట్టుకుంది. మరోసారి వేరొక వేదికపై నృత్యప్రదర్శనకు ఆమె ముగ్ధురాలయ్యారు. ఆ కళాప్రక్రియని అభ్యసించారు.

తొలి ప్రదర్శన ఇచ్చినప్పుడు, ఆమెకి 30 ఏళ్లు. నాటి నుంచే జైత్రయాత్ర మొదలైంది. చాలాకాలం సాగింది. కళాక్షేత్ర స్థాపన 1936లో. నాటికి ఆమె వయసు 32.

నృత్యం – భరతనాట్యం, సంగీతం– గంధర్వవేదం. దరిమిలా, దాదాపు వంద ఎకరాల్లో సరికొత్త నిర్మాణం. అదే క్షేత్రాన్ని వారసత్వ సంపదగా గుర్తించింది కేంద్రం.

నర్తనకు మూలం, ఆకర్షకం ... అలంకారం. అంతటి అలంకృతికి నిదర్శనమైన దుస్తులు క్షేత్రం నుంచి రూపొందాయి. అభినయానికి సరికొత్త సొగసులను సంతరించి పెట్టాయి.

'అభినయ దర్పణం' గురించి ఇక్కడ ప్రస్తావించి తీరాలి. నందికేశ్వర విరచిత కావ్యం అది.



రుక్మిణీ అరండేల్

'కళ్యాణాచల వాసాయ కరుణారస సింధవే
నమోస్తు నందికేశాయ నాట్యశాస్త్రార్థదాయినే'– అని ఉవాచ. నర్తన పరంగా ప్రధాన కావ్యం అభినయ దర్పణమే. ఇందులో వందలాది సంస్కృత శ్లోకాలున్నాయి.

యతో హస్తః తతో దృష్టి
యతో దృష్టిః తతో మనః
యతో మనః తతో భావః
యతో భావః తతో రసః

(నృత్య హస్తం ఎక్కడుంటుందో అక్కడే చూపు. ఇది ఉన్నచోటనే మనసు కేంద్రీకృతం. ఆ మది ఉన్న దగ్గర భావం నెలకొంటుంది. ఆ భావ కారణంగానే రసానుభూతి).దీన్ని ఆచరించి చూపేలా కళాక్షేత్రం వ్యవస్థీకృతమైంది. ఎందరెందరికో కళానిపుణత పంచిపెట్టింది. భారతీయతే వెల్లివిరిసేలా చేసింది.

భరతనాట్య ఆధ్యాత్మిక దృక్పథం రుక్మిణీదేవి ఆచరణలో ప్రతిఫలించింది. భరతముని నాట్య శాస్త్రమైనా, నందికేశ అభినయ దర్పణమైనా భరతనాట్య కళకి మూలాధారాలు.

రుక్మిణీ కళాక్షేత్రం మొదటి గురువులు మీనాక్షీ సుందరం పిళ్లయ్, చొక్క లింగం పిళ్లయ్. వారి నిర్దేశకత్వం ఎందరినో రూపుదిద్దింది. యామినీ కృష్ణమూర్తి, సంయుక్త పాణిగ్రహి... ఇంకా మరెందరో. వృత్తి విద్యలు, దేశవాళీ పరిశ్రమలనీ ఉత్సాహపరచిందీ 'క్షేత్రం'. విద్య వ్యవస్థకి నూతనతను

# షీమణి 'రుక్మిణి'

పాటు కర్ణాటక సంగీత ప్రక్రియకి కీలకస్థానం కలిగించి, ప్రోత్సహించారు ఆమె.

మధురైకి చెందిన రుక్మిణీదేవి నాట్యకళా సేవలు ఆరున్నర దశాబ్దాలుగా కొనసాగాయి. భర్త అరండేల్ విదేశీయుడైనా, భారతీయతను ఎంతగానో గౌరవించిన వ్యక్తి. ఆ ఉత్సాహమే నర్తకమణిని మరింత తీర్చిదిద్దింది. మనదైన నాట్యరీతిలోని దైవిక తత్వాన్ని దేశవిదేశాల్లో చాటిన ఆమెను 'పద్మభూషణ్'తో గౌరవించింది కేంద్రప్రభుత్వం. 'దేశికోత్తమ'గా పురస్కార ప్రదానం చేసింది శాంతినికేతన్ విశ్వవిద్యాలయం. రుక్మిణీదేవి తల్లి శేషమ్మ, తండ్రి నీలకంఠశాస్త్రి.

విశ్వకవి, నృత్య కళాకారి ఉభయుల ఉదయ అస్తమయాలు ఫిబ్రవరిలోనే! 29న ఆమె జయంతి.

నిలిచింది. కళాక్షేత్ర వ్యవస్థాపకురాలి మాటల్లోనే చెప్పాలంటే..

1. చదువు అనేది జీవన భృతికి కాదు.
   జీవితాన్ని తెలుసుకుని మసలడానికి.
2. డిగ్రీల కొలతలు జ్ఞాన సంపాదనకు గుర్తులు కావు
   అవి మనలోని సహశక్తిని పెంచడానికి.
3. నృత్యం అనేది భావ రూపాంతరీకరణ
   దృశ్యవర్ణన, సమాజ చిత్రం అందులో భాగాలు.
4. మనసు, మాట, శరీరం.
   ఈ మూడింటి సమ్మిళతమే నర్తన. ఇదొక కళ, శాస్త్రం.
5. మంగళప్రదం, శుభకరం, హితదాయకం నాట్యం.
   పుష్టినీ తుష్టినీ పెంచి పోషించేది ఇదే.
6. రామాయణ, భారతం, భాగవతం
   ఈ మూడింటిలోనూ నృత్య సంగీత ప్రస్తావనలు అనేకం.
7. నాట్యశాస్త్రం నాట్యవేదం.. ఈ రెండూ స్థూలంగా ఒక్కటే.
8. రసం, భావం, అభినయం, వృత్తి ప్రవృత్తి
   గానం, స్వరం, రంగం – ఇవన్నీ నృత్య అంశాలే.

ముఖ, హస్త, పాద కదలికలున్న నాట్య శాస్త్రానికి విస్తార ప్రాచుర్యం కలిగింది కళాక్షేత్రమే. బోధన, అభ్యాసం, ప్రదర్శనలు అక్కడ




జోడించింది.

**భాషాభారతి, నృత్య హారతి – రుక్మిణీదేవి**

'నమోనమో నటరాజా! జయజయ
నమో జగతిత్రయ నాట్యసమాజ!
రక్తి ముక్తి అనురక్తి నీవే
గళం నీవే సంగీతం నీవే
రాగ తాళలయ రసార్ద్ర మూర్తీ
నిత్య సత్య సాహిత్య స్ఫూర్తీ!' అనేలా వెల్లివిరిసింది ఆవరణమంతా. అక్కడే సుందర నందనాలు, తామర కొలనులు, శాస్త్రీయ రీతి కట్టడాలు.

1. సంగీత సిద్ధాంత చర్చలు
2. సంగీతకారుల జీవన చరిత్రల అధ్యయనాలు
3. దృశ్యకళల పరిశోధనలు

వీటికి తోడు నిత్య అభ్యసనాల విస్తృతీకరణ. మొత్తం సాంస్కృతిక వైభవ శోభ. గురుకులం/ నివాస అభ్యాస కేంద్రంగా పరిఢవిల్లింది క్షేత్రమంతా. విభిన్న అభిరుచులు, శాస్త్రీయ ప్రదర్శనలకు కేంద్రస్థలిగా భాసించింది.

బోధనా శాస్త్రం ప్రత్యేకించి రూపుదిద్దుకుంది. కథా, కథనాలకు నృత్యరీతి జోడింపు సొబగులద్దింది.

తెలుగులో భాగవత మేళాలు
సంస్కృతంలో గీతగోవిందం
బెంగాలీలో నర్తన రూపాలు
తమిళనాట విశేష రీతులు

వీటన్నింటినీ సమీకరించిన విధానం కళాక్షేత్రను సుసంపన్నం చేసింది. సూక్ష్మచిత్రణకు కాణాచిగా మూర్తీభవించాయి. సంప్ర దాయ కళాత్మకతలు అన్నివిధాలా అక్కడ వెల్లివిరిశాయి. అధునాతన సంస్కరణలూ ఆ కోవలోనే.

భాష, సంస్కారం, నాగరికతలను కలగలిపిన విధానమే భరతనాట్యం. ఆ ప్రక్రియను వ్యవస్థీకృతం చేసిన, చేస్తున్న వారందరూ ఆదర్శప్రాయులే.

భారతీయతకు పట్టంకట్టి, నర్తనాభిషేకం చేస్తున్న సంస్థలే జాతికి కాంతిరేఖలు. వాటిని విస్తృత పరచడం అందరి బాధ్యత. మన సంస్కృతీ సంప్రదాయ రీతులను పదిలపరచుకోవడమే ప్రతి ఒక్కరి విధి. అంతకుమించిన పరమ ధర్మం మరేదీ లేదు, ఉండదు. యద్భావం తద్భవతి! ★




**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

దేశంలో కుంభమేళా తరువాత నిర్వహించేది తెలంగాణలోని మేడారం సమక్క సారలమ్మ జాతర. ప్రజాశ్రేయస్సు కోసం కాకతీయులతో జరిగిన సమరంలో ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన తల్లీకూతుళ్ల స్మారక ఉత్సవాన్ని 'గిరిజన కుంభమేళా'గా అభివర్ణిస్తారు. సుమారు ఎనిమిది దశాబ్దాలకు పైబడి రెండేళ్లకు ఒకసారి (ఈ నెల 21 నుంచి) నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవంలో గిరిజనేతరులు కూడా విశేష సంఖ్యలో పాల్గొంటారు. ఆ సమయంలో మేడారం భక్తజన సంద్రమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (1996) దీనిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించింది. జాతీయ ఉత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి.



# ఈ వనమాతలు 'వర'

తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలో ప్రకృతి అందాలతో నాగరిక ప్రపంచానికి దూరంగా ఉండే ఈ కుగ్రామం ఈ ఉత్సవ సమయంలో కాలు కదపలేనంతగా భక్తజనంతో కిక్కిరిసి పోతుంది. యుద్ధంలో వీర మరణం పొందిన తల్లీకూతుళ్లు సమ్మక్క, సారలమ్మ విగ్రహాలు లేని దేవతలుగా పూజలు అందుకుంటున్నారు. మాఘ పూర్ణిమకు నాలుగు రోజుల ముందు ఈ జాతర ప్రారంభమవుతుంది.

సమ్మక్క జననానికి సంబంధించి కొద్దిపాటి మార్పులతో కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆమె భూమిలో ఒకపెట్టెలో లభ్యమైనట్లు ఒక కథ ప్రచారంలో ఉండగా, 12 శతాబ్దంలో కోయదొరలకు అడవిలో పెద్దపులుల కాపలా మధ్య దేదీప్యమానంగా వెలిగిపోతున్న పసిపాప దొరికినట్లు మరో కథనం. కొండదేవత చిన్నారిగా అవతరించిందని, ఆమెను దైవప్రసాదంగా భావించిన పొలవాసకు చెందిన గిరిజన దొర మేడరాజు దంపతులు సమ్మక్క అనే పేరుతో గారాబంగా పెంచారు. తన మేనల్లుడు, మేడారం పాలకుడు పగిడిద్దరాజుతె పెళ్లి చేశారు. సమ్మక్కపగిడిద్ద దంపతులకు సారలమ్మ, నాగులమ్మ అనే కూతుళ్లు, జంపన్న అనే కుమారుడు.



### భరిణగా సమ్మక్క

కాకతీయ ప్రతాపరుద్రుడు రాజ్యవిస్తరణ జైత్రయాత్ర చేపట్టగా ఆయన ధాటికి తట్టుకోలేని మేడరాజు, ఆయన పరివారం మేడారంలో అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. అదే సమయంలో అనావృష్టి కారణంగా పగిడిద్దరాజు (కాకతీయుల సామంతరాజు) కప్పం కట్టలేకపోగా, స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకోవడం, మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం ప్రతాపరుద్రునిలో ఆగ్రహాన్ని రగిల్చింది. తన ప్రధానమంత్రి యుగంధురుడి (నాగయ్యగన్నుడు) సారథ్యంలో మేడారంపైకి సైనిక పటాలం పంపాడు. ఆ యుద్ధంలో కాకతీయులకు అపారంగా నష్టం వాటిల్లడంతో పాటు మేడారం మొత్తం నేలమట్టమైంది. సమ్మక్క తన సంతానంతో పాటు అల్లుడు కొండాయి ప్రభువు గోవిందరాజు వేరువేరు ప్రాంతాల నుంచి శత్రుసైన్యాన్ని ఎదుర్కొన్నారు. అయినా ఆ సేనలను నిలువరించ లేకపోయారు. ఓటమి పరాభవాన్ని తట్టుకోలేని జంపన్న సమీపంలోని సంపెంగ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నాటి సంపెంగ వాగే నేటి జంపన్న వాగు. (జంపన్న ఆత్మహత్య చేసుకోలేదని, తన గాయాల రక్తాన్ని వాగులో శుభ్రం చేసుకోవడం వల్ల దానికి జంపన్న వాగు అని పేరు వచ్చిందని కొందరు అంటారు).

అయినవారు అసువులు బాయడంతో సమ్మక్క అపర కాళిలా విజృంభించి కాకతీయ సేనలకు ముచ్చెమటలు పట్టించారు. భీతిల్లిన కాకతీయ సేనలోని ఒకడు ఆమెను బల్లెంతో దొంగదెబ్బ తీశాడు. రక్తసిక్తమైన దేహంతో ఆమె మేడారానికి ఈశాన్యదిశగా చిలకలగుట్టవైపు గుహలోకి వెళ్లి అదృశ్యమైంది. ఆమెను వెదుకుతూ వెళ్లిన అనుచరులకు నాగవృక్షం సమీపంలోని పుట్ట వద్ద పసుపు-కుంకుమలతో భరిణెగా కనిపించింది. దానినే సమ్మక్కకు ప్రతిరూపంగా భావించారు. నాటి నుంచి ఆ భరిణె సమ్మక్కగా పూజలు అందుకుంటోంది.

### ప్రతాపరుద్రుడి పశ్చాత్తాపం

సమ్మక్క, ఆమె కుటుంబంపై అశేష జన



# దేవతలు

వాహినికి గల ఆరాధనను, భక్తి భావనను గ్రహించిన ప్రతాపరుద్ర చక్రవర్తి తన అపరాధానికి పశ్చాత్తాపం చెందాడు. పరిణామాలకు క్షమాపణ చెప్పి, మేడారంను కోయదొరల స్వతంత్ర రాజ్యంగా ప్రకటిస్తాడు. సమ్మక్క-సారలమ్మ పేరుతో రెండు సంవత్సరాలకు ఒకసారి జాతరను వైభవంగా జరుపుకునేలా, సమ్మక్క పేరిట ప్రతి సంవత్సరం మాఘ పౌర్ణమి నాడు ముత్తయిదువుల పండుగా జరిగేలా కట్టడి చేశాడు. అందుకు అవసరమైన నిధులు కేటాయించి, తాను కూడా భక్తుడయ్యాడని చారిత్రక కథనం. మేడారానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన గిరిజనుడి ఆధ్వర్యంలో మొదటి జాతర జరిగినట్లు తెలుస్తోంది.

**గద్దెలే ఆలయాలు...**

మేడారంలో రెండు చెట్ల చుట్టూ 'గద్దెలు' తప్ప ఎలాంటి ఆలయం ఉండదు. ఆ గద్దెలను సమ్మక్క, సారలమ్మ దేవతలుగా భావిస్తారు. వాటిని 'పెద దేగి', 'తునికి' అని వ్యవహరిస్తారు. ఇంకో మూలగా మరో చిన్న గద్దెపై గుర్రపు తల ఆకారంలో ఉన్న 'లక్ష్మీ దేవర' ప్రతిమను ఏర్పాటు చేస్తారు. జాతర సమయంలో కోయ పూజారులు సమ్మక్క అమ్మవారిని తీసుకువస్తున్నట్లు గుర్తుగా సమీపంలోని గుట్ట నుంచి కుంకుమ భరిణి, వెదురు ముక్కలు తెస్తారు. జాతర మొదటి రోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి గ్రామం నుంచి గోవిందరాజును గద్దెలపైకి తెస్తారు. రెండవ రోజు చిలకలగుట్ట నుంచి భరిణె రూపంలో ఉండే సమ్మక్కను తీసుకు వచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. సమ్మక్క చేరిక సమయంలో కోడి పుంజులను గాలిలోకి ఎగురవేసి ఆరగింపు చేస్తారు. పోలీస్ ఉన్నతాధికారి గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతారు. మూడో నాడు భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మొక్కుబడిగా సమర్పించే బెల్లాన్ని 'బంగారం' అంటారు. అనుకున్న కోరికలు తీరితే నిలువెత్తుల 'బంగారం' సమర్పించుకుంటామని మొక్కుకుంటారు. నాలుగవ రోజు యథాస్థానికి అమ్మవార్లను (వనప్రవేశం) తరలిస్తారు.

**'వర'దేవతలు**

ఈ వనమాతలను భక్తులు 'వర'దేవతలుగా భావిస్తారు. కోర్కెలు తీర్చే దైవాలని,వారి ఆశీర్వాద బలంతో సంతాన ప్రాప్తి, దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం. గద్దెలకు ప్రదక్షిణలు చేసి సంతానవతులైన వారు మరుసటి జాతరకు వచ్చి గద్దెల వద్ద తొట్టె (ఊయల)కట్టి మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవార్లు గద్దెలపైకి వస్తున్న సమయంలో మొక్కితే సంతానయోగం ఉంటుందని కూడా భావిస్తారు. గద్దెమీది బెల్లం స్వీకరిస్తే దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయని, అక్కడి కుంకుమ పొందితే సంతానప్రాప్తి కలుగు తుందని భక్తుల నమ్మకం. సమ్మక్కను తీసుకువస్తున్న వారికి అడ్డంగా పడుకొని, పూజారులు తమ మీదుగా నడచివెళితే జన్మతరించినట్లుగా భావిస్తారు. పిల్లలకు ఆ దేవతల పేర్లు పెట్టుకుంటారు. ఆడశిశువులకు సమ్మక్క-సారలమ్మ అని, మగశిశువులకు జంపన్న అని పేరు పెట్టుకోవడం తరుచుగా కనిపిస్తుంది.

**'బంగారం'ముడుపు**

భక్తులు బంగారంగా పిలుచుకునే బెల్లాన్ని ముడుపుగా చెల్లిస్తారు. అనుకున్నవి నెరవేరినవారు బెల్లంను తులాభారంగా సమర్పించుకుంటారు. అలా నైవేద్యంగా పెట్టిన బెల్లాన్ని భక్తులందరికి పంచుతారు. బియ్యం, కొబ్బరికాయలు, పసుపు-కుంకుమలు, వస్త్రాలు,బోనాలు తదితరాలనూ సమర్పించు కుంటారు. కోడెలను కానుకగా సమర్పించడం ఈ



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

జాతరలో మరో ప్రత్యేకత. ఈ జాతరలో శివశక్తులు (పూనకాలు) ప్రధాన ఆకర్షణగా నిలిచి ఉత్కంఠ కలిగిస్తాయి. కొత్తచీర, రెండు రవికలు ధరించి, చేతుల నిండా గాజులు, బొట్టు (మగవారు కూడా), ఒడి బియ్యంతో, తల వెంట్రుకలు విరబూసుకుని శివాలూగుతూ పలికే మాటలను సాక్షాత్తు ఆ అమ్మల పలుకులుగానే విశ్వసిస్తారు.

మద్య మాంసాలు లేకపోతే సమ్మక్క, సారలమ్మలు మెచ్చరని భక్తుల విశ్వాసం. అందుకే జాతర సమయంలో వాటిని ఆస్వాదించడాన్ని గిరిజనులు పవిత్ర కార్యంగా భావిస్తారు. మద్యంపానం, మాంసభక్షణలకు మొక్కుబడులు చెల్లించేంత ప్రాధాన్యం ఉందని వారి వాదన.

**జాతరలో మరికొన్ని విశేషాలు**

– జంపన్నవాగులో స్నానమాడితే పునీతులమవుతారని భక్తులు భావిస్తారు. భక్తులు అక్కడ స్నానం చేశాకే వన దేవతలను దర్శించుకోవడం ఆనవాయితీ వస్తోంది.


– స్నానానంతరం కొందరు తలనీలాలు అర్పిస్తారు.

– గద్దె సమీపంలోని జువ్వి చెట్టుకు విశేష మహిమలు ఉన్నట్లు పరిగణించి, సమ్మక్కతో సమానంగా పూజిస్తారు.

– ఒక్కొక్క ఆదివాసి తెగకు ఒక్కో జంతువు లేదా పక్షి సంకేతంగా ఉంటాయి. వాటిని తమ వంశ మూలకర్తగా భావిస్తారు. సమ్మక్కకు నాగసర్పం, సారక్కకు పెద్దపులి, పగిడిద్దరాజుకు తాబేలు సంకేతాలు. పూనకం వచ్చిన వారు పులి మాదిరిగా గాండ్రిస్తారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**





రైతుల ఆందోళనలతో యూరప్ అట్టుడుకుతోంది. ట్రాక్టర్లతో రహదారులను నిర్బంధించటం, పోర్టులో కార్యకలాపాలను అడ్డుకోవటం దగ్గర నుంచి యూరోపియన్ పార్లమెంటు పైన కోడిగుడ్లతో దాడి చేయటం వరకూ ఈ నిరసనల పర్వం కొనసాగింది. యూరోపియన్ యూనియన్ జీడీపీలో కేవలం 1.4శాతం వ్యవసాయం ద్వారా లభిస్తోంది. కానీ రైతులు సంఘటితంగా చేపట్టిన ఆందోళనలవల్ల జాతీయ ప్రభుత్వాలు, యూరోపియన్ యూనియన్ కూడా ఒత్తిడికి గురై కొన్ని నిబంధనల సడలింపునకు సిద్ధం కావటం చెప్పుకోదగ్గ అంశం.

# యూరప్‌ను హడలెత్తిస్తున్న రైతు

**యూ**రప్‌లో ప్రధానంగా ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, రుమేనియా, పోలెండ్, గ్రీస్, జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్‌లలో రైతుల నిరసనలు మిన్నుముట్టాయి. ప్రభుత్వం అవలంబిస్తున్న పన్ను విధానాలు, ఇతర అనుచిత నిర్ణయాల కారణంగా తమ వృత్తి ద్వారా తాము జీవనోపాధి సాగించలేక పోతున్నామని రైతులు గళమెత్తారు.

యూరప్‌లో రైతుల నిస్పృహకు కారణాలేమిటి? ఒక్కో దేశానికి ఒక్కో సమస్య అయినా, ప్రధానంగా ఆర్థిక, నియంత్రణ, హరిత విధానాలపైన పోరాటానికి రైతులు సంఘటితమై పోరుబాటలోకి దిగారు. ఉక్రెయిన్ పైన రష్యా యుద్ధ నేపథ్యంలో, ఇంధనం, ఎరువులు, రవాణా ధరలు విపరీతంగా పెరిగాయని, దానితో పాటు పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఆహార ధరలు తగ్గించటం సమస్యగా మారిందని రైతులు చెబుతున్నారు.

యూరోస్టాట్ డేటా ప్రకారం, వ్యవసాయ ఉత్పత్తుల నుంచి రైతులు పొందే ధర 2022లో గరిష్ఠ స్థాయికి చేరింది. అక్కడ నుంచి క్రమంగా తగ్గుతూ, 2022 మూడో త్రైమాసికం వచ్చే నాటికి, 2023లో అదే సమయానికి సగటున 9 శాతం పడిపోయింది.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

ఫ్రాన్స్‌లో ప్రభుత్వం డీజిల్ ఇంధనంపై ఇస్తున్న పన్ను మినహాయింపును తొలగించాలని నిర్ణయించింది. దానితోపాటు ఇంధన విధానంలో కొత్తగా ప్రవేశపెడుతున్న అంశాలు కూడా అన్నదాతల ఆగ్రహానికి కారణమయ్యాయి. అంతేకాక, చవకబారు విదేశీ ఉత్పత్తులను అనుమతించటంవల్ల తమకు అనుచిత మైన పోటీ ఏర్పడుతోందని చెబుతున్నారు. "మామీద అపారమైన నియంత్రణలు ఉంటున్నాయి. రకరకాల నిబంధనల చట్రంలో మమ్మల్ని బిగిస్తున్నారు. వాటికి లోబడే మేం ఉత్పత్తులు చేయాలి. బయట నుంచి యూరోప్‌లోకి ప్రవేశించే వాటికి ఎలాంటి నిబంధనలతో పనిలేదు. వాటితో మేం పోటీ పడాలి. ఇదెక్కడి న్యాయం?" అని రైతులు నిలదీస్తున్నారు. రైతులు, ముఖ్యంగా తూర్పు యూరప్‌కి చెందినవాళ్లు, ఉక్రెయిన్ నుంచి దేశంలోకి వస్తున్న చవకబారు వ్యవసాయ ఉత్పత్తులు – ప్రధానంగా ధాన్యం, పంచదార, మాంసం గురించి తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఉక్రెయిన్ పైన రష్యా దాడి నేపథ్యంలో, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఉక్రెయిన్ దిగుమతుల పైన కోటాలను, డ్యూటీలను ఎత్తివేసింది. మరోవైపు పర్యావరణ మార్పులు పరిస్థితులను తీవ్రంగా మార్చివేస్తున్నాయి. విపరీతమైన వాతావరణ పరిస్థితులు, కరువులు, కార్చిచ్చులు వంటి ఘటనలు వ్యవసాయో త్పత్తులపైన ప్రభావం చూపుతున్నాయి.

ఇంకో వైపు, ఈయూ పర్యావరణ లక్ష్యాలపైన బ్రసెల్స్‌లో నిర్వహించిన ఆందోళనలో రైతులు విరుచుకుపడ్డారు. 'యూరోపియన్ గ్రీన్ డీల్' అనేది రైతుల పైన విపరీతమైన ఒత్తిడిని పెంచుతోందని ఇంగ్లండ్‌లోని లాన్‌చెస్టర్ యూనివర్సిటీ లో ఆర్థిక శాస్త్రంలో సీనియర్ లెక్చరర్ రెనాడ్ ఫౌకార్ట్ చెబుతున్నారు. ఈ ఒప్పందం ప్రకారం, కార్బన్ పై పన్ను, పురుగుమందుల వాడకంపైన నిషేధం, నైట్రోజన్ విడుదలపైన నియంత్రణ, నీరు, సాగుభూమి వినియోగంలో పరిమితులు వంటి నిబంధనలను రైతులు పాటించవలసి ఉంటుంది.

గ్రీన్ డీల్‌కి సంబంధించిన నియంత్రణలను వీలయినంత కాలం వాయిదా వేయాలని రైతులు యోచిస్తున్నారు. "కర్బన పన్ను, పురుగుమందుల వినియోగానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఒక్కో యూరోపియన్ దేశానికి ఒక్కో సమస్య" అని ఆయన వివరించారు. ట్రాక్టర్లకు వినియోగించే డీజిల్‌పైన పన్ను చెల్లించవలసిన రావటం జర్మనీ రైతులకు సమస్యగా మారింది. నెదర్లాండ్స్‌లో ప్రధాన సమస్య నైట్రోజన్‌పై పన్ను. దీనివల్ల పందులు, చికెన్ పారిశ్రామిక ఉత్పత్తులపైన ప్రభావం పడుతోంది.

**ఆందోళనల తీరు, కారణాలు**

- పోలెండ్‌లో పరిణామాలు ఆసక్తికరం. ఉక్రెయిన్‌కు సైనిక సహకారం అందించ చటంలో పోలెండ్ ముందుంది. అదే సమయంలో ఉక్రెయిన్ నుంచి గోధుమలు పోలెండ్‌లోకి



# ఉద్యమం

ప్రవేశించకుండా పోలిష్ రైతులు సరిహద్దులలో ఆటంకాలు సృష్టి స్తున్నారు. పోలిష్ జెండాలతో కూడిన ట్రాక్టర్లను తెచ్చి రైతులు పోలెండ్‌లో 256 చోట్ల రహదారులను నిర్బంధించారు. దీనితో ప్రత్యామ్నాయ మార్గాలను కనుగొనటానికి పోలీసులకు తలప్రాణం తోకకొచ్చింది. ఉక్రెయిన్ నగరం లివివ్‌కి దక్షిణాన ఉన్న మెడికా సరిహద్దులో రాకపోకలు నిలిచిపోయాయి. పోజ్నాన్ లో ఆందోళనకారులు బ్యారెల్‌తో చెత్త తీసుకొచ్చి రోడ్డుపైన పారబోశారు. తర్వాత నిప్పంటించారు. బాణసంచా కాల్పులతో ఆ ప్రాంతం అంతా దద్దరిల్లింది. ఇందులో దాదాపు ఆరువేలమంది రైతులు పాలుపంచుకోవటం విశేషం. కొన్ని ప్రాంతాల్లో టైర్లకు నిప్పంటించి తమ నిరసన ప్రకటించారు.

- యూరోపియన్ యూనియన్ గుండెకాయగా చెప్పుకునే బ్రస్సెల్స్‌లో ఉక్రెయిన్ సమస్యపైన భారీ సమావేశం ఏర్పాటయినవేళ.. రైతులంతా పార్లమెంటు భవనం వెలుపల గుమికూడారు. పార్లమెంటుపైకి కోడిగుడ్లు విసరటం, కొమ్ము బూరలను ఊదటం తదితర చర్యలతో తమ నిరసనను ప్రకటించారు.
- బెల్జియం రైతులు నెదర్లాండ్స్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని జాండ్ ఫ్లీట్, మీర్, పోస్టల్ తదితర ప్రదేశాల్లో నిరసనలు చేశారు. ఫ్రాన్స్‌లో రైతులు పారిస్‌లోకి ప్రవేశించే ప్రధాన మార్గాలలో రాకపోకలను అడ్డుకున్నారు. దానితో పాటు లయాన్, టౌలోజ్‌ల్లోనూ ఆందోళనలు చేశారు. డజన్లకొద్దీ రైతులు టెంట్లు నిర్మించుకుని నిప్పు వెలిగించి చలికాచుకుంటూ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ హబ్ గా చెప్పుకునే దక్షిణ పారిస్ రుంగిస్ మార్కెట్లో రాకపోకలకు అడ్డుకున్నందుకు 91మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు నిరసనకారులు పోలీసులకు చాక్లెట్లు పంచారు.
- గ్రీస్‌లో రెండో అతి పెద్ద నగరమైన తెస్సాలోనికి ట్రాక్టర్లు ప్రవేశించి ప్రధాన మార్గాల్లో రాకపోకలను అడ్డుకున్నాయి.
- స్పానిష్ సరిహద్దుల్లో పెద్దగా నిలిచిపోయిన ట్రక్కుల చిత్రాలు పోర్చుగల్ నుంచి విడుదలయ్యాయి. స్పెయిన్‌లో వరుసగా నాలుగు రోజుల పాటు రైతుల ఆందోళనలు కొనసాగాయి. వంద వరకూ ట్రాక్టర్లను రోడ్డుపైన నిలిపి బిల్బావ్ వంటి పెద్ద నగరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు.
- గత నెలలో జర్మనీలో వేలాదిమంది రైతులు వణికించే చలిలో ఆందోళనలు చేపట్టి జర్మనీని స్తంభింపచేశారు. ఛాన్సలర్ ఒలాఫ్ స్కుల్జ్ ప్రభుత్వానికి ముచ్చెమ టలు పట్టించారు. తూర్పు నుంచి పశ్చిమం వరకూ హాంబర్గ్, కలోన్, బ్రెమన్, న్యూరెంబర్గ్, మ్యూనిక్‌లలో రహదారి నిర్బంధాలు చేపట్టారు. ఒక్కో చోట రెండు వేల కంటే ఎక్కువ ట్రాక్టర్లు పాల్గొన్నాయి.
- హంగేరిలో వందలాదిమంది రైతుల తమ ట్రాక్టర్లతో ఉక్రెయిన్ ప్రధాన సరిహద్దులో ఆందోళన చేపట్టారు. చవకబారు ఉక్రెయిన్ ఉత్పత్తులు హంగేరి మార్కెట్లోకి ప్రవేశించటం పైన, అలాగే యూరప్‌లోని ఇతర ప్రాంతాల ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావంగానూ తాము ఆందోళన చేస్తున్నట్టు ఇక్కడి రైతులు పేర్కొన్నారు. గత సెప్టెంబరులో రైతులు సాగుచేసిన గోధుమకు సగటున హెక్టా రుకు 300 యూరోల నష్టం సంభవించింది. 100 నుంచి 400 హెక్టార్లున్న రైతులు దారుణంగా నష్టపోయారు" అని హంగేరి వ్యవసాయ నిపుణుడు పేర్కొన్నారు.

### ఏం సాధించారు?

ఈయూ స్థాయిలో రైతులకు ప్రభుత్వం నుంచి కొంత మేరకు ఉపశమనం లభించింది. సాగు భూమిలో కొంత జీవవైవిధ్యానికి, నేల ఆరోగ్యానికి విడిచి పెట్టాలనే నిబంధనలను వాయిదా వేయటానికి బ్రస్సెల్స్ అంగీకరించింది. అలాగే ఈయూ రైతులకు కొన్ని మినహాయింపులనిచ్చింది. కొంత భూమి తప్పనిసరిగా పక్కన ఉంచాలన్న నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. దానితో పాటు అదనపు చెల్లింపులకు కూడా హామీ ఇచ్చారు.అలాగే ఉక్రెయిన్ ఉత్పత్తులపైన దిగుమతి సుంకాలను ఎత్తివేసే గడువును జూన్ 2025 వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించింది.

ప్రభుత్వస్థాయిలో బెర్లిన్ కూడా తన ప్రణాళికల విషయంలో కొంత వెనక్కి తగ్గింది. గత నెలలో డీజిల్ సబ్సిడీలపై విధించిన కోతను ఎత్తి వేసింది. వ్యవసాయ పనులకు వినియోగించే వాహనాలకు పన్ను మినహాయిస్తామని, డీజిల్ ట్యాక్స్ లో కోతలు మరో మూడేళ్లు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. దీని నుంచి పూర్తిగా వెనక్కి తగ్గాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రీస్.. వ్యవసాయ డీజిల్‌పైన ఏడాది పాటు ప్రత్యేక పన్ను రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. తీవ్రమైన వరదల కారణంగా రైతులు పంటను, పశువులను కోల్పోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

రైతుల ఆందోళనల నేపథ్యంలో ఫ్రాన్స్ వరస చర్యలకు సిద్ధమైంది. 'ఫుడ్ సావర్నిటీ' కి పూచీగా ఉంటానని కొత్త అధ్యక్షుడు గేబ్రియాల్ అట్టల్ ప్రమాణం చేశారు. దానితోపాటు రైతులకు అనుచితమైన పోటీ ఎదురుకాకుండా దిగుమతి అయ్యే ఆహార ఉత్పత్తులపైన ప్రత్యేక దృష్టిపెడతామని అన్నారు. పశువులు పెంపకంలో ఉన్న రైతుల ప్రోత్సాహానికి ఈ ఏడాది 150 మిలియన్ యూరోలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సామాజిక మద్దతుకు అది ప్రతి ఏడాదీ కొనసాగు తుందని చెప్పారు.

### ఉద్యమం చల్లారినట్టేనా?

ప్రభుత్వాలు దిగివచ్చి కొన్ని ఉపశమన చర్యలు చేపట్టినా అవి మరింత కొనసాగాలని రైతులు కోరుతున్నారు. రైతుల ఆందోళన ప్రభావం జూన్‌లో నిర్వహించే యూరోపియన్ పార్లమెంటు అధ్యక్ష ఎన్నిక పైన పడే అవకాశం కనిపిస్తోంది.

2050 నాటికి కర్బన్ ఉద్గారాలను తొలగించి నెట్ జీరో లక్ష్యాన్ని సాధిం చాలని యూరోపియన్ యూనియన్ ఉవ్విళ్లూరుతోంది. ఈ విషయంలో ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డేర్ లయన్ గట్టి పట్టుదలతో ఉన్నారు. 2015తో పోలిస్తే 90శాతం లక్ష్యాలను 2040 నాటికే సాధించాలనేది ఆశయం. ఇందుకు ఈయూ రైతులను పురుగు మందుల వినియోగానికి దూరంగా పెట్టటం, ఇతర హరిత నిబంధనలు అమలు చేయటం తప్పనిసరి. కానీ హరిత నిబంధనలను అమలు చేయటానికి తన సొంత పార్టీ నుంచే వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు దీని నుంచి ప్రయోజనం పొందాలని ఇతర పార్టీలు యోచిస్తున్నాయి. ఏది ఏమైనా యూరప్‌లో రైతుల ఆందోళన చారిత్రా త్మకం. ఒక్క భారతదేశంలోనే కాదు. అభివృద్ధి చెందిన దేశాలుగా ప్రపంచం కొనియాడే యూరప్ లోనూ రైతులకు సమస్యలు తప్పటం లేదు. అది విచిత్రం అనిపించకమానదు. ★

## ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు

పాములపర్తి వెంకటనరసింహారావు స్వాతంత్ర్య సమరయోధులు. రచయిత. పీవీ(జూన్ 28, 1921–డిసెంబర్ 23,2004)గా ప్రసిద్ధుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన సేవలు భారత్‌కు కొత్త రూపాన్ని ఇచ్చాయి. ఆంధ్రదేశంలో భూసంస్కరణలకు ఆద్యుడు ఆయనే. జీవితాంతం ఆయన కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. (1991–1996) వరకు పీవీ ప్రధానిగా వ్యవహరించిన కాలం ఆధునిక భారత చరిత్రకు గడ్డుకాలం. ఒక పక్క రాజకీయ అనిశ్చితి, మరొక పక్క అయోధ్య ఉద్యమం పతాకస్థాయికి చేరడం వంటి పరిణామాలు ఆ కాలంలోనే జరిగాయి.

కాంగ్రెస్ పార్టీలో పీవీ స్థానం ప్రత్యేకమైనదే. ఆ స్థానాన్ని ఛేదించడానికి చాలా కుయుక్తులే జరిగాయి. ఆయన నెహ్రూ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదిస్తూ ఉండేవారు. అదే బాధ్యతను ఇందిర పర్యటనలలోను నిర్వర్తించారు. విధానాలు, నిర్ణయాలకు సంబంధించిన తీర్మానాలను రాసే బాధ్యత ఇందిర, తరువాత రాజీవ్‌గాంధీ పీవీకి అప్పగించేవారు.

1991 నాటి లోక్‌సభ ఎన్నికలలో పీవీ నరసింహారావు పోటీ చేయలేదు. తన రాజకీయ జీవితం ముగిసిపోయిందని ఆయన గట్టిగా విశ్వసించారని సన్నిహితులు చెబుతారు. హైదరాబాద్‌కు మకాం మార్చివేద్దామని అనుకుంటున్న సమయంలో రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యారు. ప్రధాని పదవికి పీవీకీ, ప్రణబ్‌కుమార్ ముఖర్జీకీ జరిగిన పోటీలో పీవీ విజయం సాధించారు. ప్రధాని పదవికి చేపట్టడానికి ముందు ఆయన జీవితం మరొక మలుపు తీసుకోవలసి ఉంది. ఆయన ఒక మఠానికి అధిపతిగా వెళ్లవలసి ఉంది. కానీ చరిత్ర ఆయనను ప్రధాని గద్దె వైపు నడిపించింది. ప్రధానిగా ఆయన పదవిని చేపట్టిన కాలం చాలా కఠినమైనది. ఆయన మొదట ఆర్థిక సంస్కరణలు ఆరంభించారు. అందుకు రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ మన్మోహన్ సింగ్‌ను ఆర్థికమంత్రిగా నియమించుకున్నారు. విదేశాంగ విధానంలో కూడా తనదైన ముద్రను ఆయన వేశారు.

లుక్ ఈస్ట్ విధానం ఆయనదే. అంటరాని దేశంగా భావిస్తున్న ఇజ్రాయెల్‌తో ఆయన సంబంధాలు ఆరంభించారు. ఆ విధానంలోని వాస్తవికతను బట్టే తరువాత బీజేపీ ప్రభుత్వం కూడా యాక్ట్ ఈస్ట్‌గా ఇంకొక అడుగు ముందుకు వేసింది. అయితే దీనిని నెహ్రూ విధానాలకు అపచారంగా కాంగ్రెస్‌లో పీవీ వ్యతిరేకులు ప్రచారం చేశారు. ఆయన నెహ్రూ గాంధీ కుటుంబానికి చెందనప్పటికీ ఐదేళ్లు పూర్తికాలం దేశ ప్రధానిగా పనిచేసిన తొలి కాంగ్రెస్ ప్రధాని. ఇలాంటి విశేషణం పీవీకి దక్కడం ఆ పార్టీ అధిష్ఠానదేవతలకి బొత్తిగా నచ్చలేదు. ఇంకా చెప్పాలంటే పీవీ మేధాశక్తిని గుర్తించడం కొత్త దేవతలకు ఇష్టమే లేదు. తమ కుటుంబీకులే కనుక అధికారంలో ఉంటే బాబ్రీ కట్టడం కూలేది కాదని రాహుల్ వాగాడంబరం కూడా ప్రదర్శించాడు. నెహ్రూ, ఇందిర కాలానికి మించి రాజీవ్, సోనియా, రాహుల్ గాంధీల కాలంలో కాంగ్రెస్‌లో వ్యక్తి పూజ జుగుప్సాకర స్థాయికి చేరుకుంది. వీటి పతాకస్థాయి పీవీ మరణం తరువాత ఆయన భౌతిక దేహం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం వ్యవహరించిన తీరు. దేశమే కాదు, ప్రపంచం మొత్తం ఆయన ఆర్థిక సంస్కరణలను ప్రశంసించినా, 1996 నాటి కాంగ్రెస్ ఓటమికి పీవీని బాధ్యులను చేశారు. పీవీ ఎంపిక చేసి తీసుకువచ్చిన మన్మోహన్ ప్రధాని అయిన ఎనిమిది మాసాలకే (2004) పీవీ కన్నుమూశారు. పీవీ మరణానంతరం ఆయన పట్ల కాంగ్రెస్ చూపించిన అనైతిక ధోరణి అత్యంత హీనమైనది. మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు పుస్తకం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్'లో ఈ వివరాలు ఉన్నాయి (ఆ యాక్సిడెంటల్ పీఎం మన్మోహన్ మాత్రమే). ఢిల్లీలోని ఎయిమ్స్‌లోనే పీవీ చనిపోయారు. ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగడం సోనియా, ఇతర కాంగ్రెస్ ప్రముఖులకు ఇష్టం లేదు. అవి హైదరాబాద్‌లో కానివ్వాలని వారి అభీష్టం. ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు తెలిపే బాధ్యతను బారు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా ఆయన భౌతికకాయానికి సరైన మర్యాద దక్కలేదు. దహనం కూడా పరిపూర్ణంగా జరగలేదు. ఆ దృశ్యాన్ని టీవీలలో చూసిన ఆయన అభిమానులు దహనం పూర్తిగా జరిగేటట్టు చేశారు. అదొక విషాద ఘట్టం. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చరిత్రతో పాటు, పీవీ ఆత్మ కూడా కాంగ్రెస్ వైపు పరిహాసంగా నవ్వుతాయి.




# మరో ముగ్గురికి...

కనీవినీ ఎరుగుని రీతిలో 2024 సంవత్సరానికి గాను ఐదుగురుని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నకు ఎంపిక చేసింది. మొదట రెండు (కర్పూరి ఠాకూర్, లాల్ కృష్ణ అద్వాణీ), కొద్ది విరామం తరువాత చౌధరి చరణ్‌సింగ్, పీవీ నరసింహారావు, ఎంఎస్ స్వామినాథన్‌లకు ఈ సమున్నత పురస్కారం ప్రకటించారు. ఆచితూచి తీసుకున్న ఈ నిర్ణయంతోనే దేశ రాజకీయాలలో సమీకరణలు మారిపోయాయి. చరిత్రలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకోవడమే మన తరం బాధ్యత అని ప్రధాని నిరంతరం చెబుతూ ఉంటారు. ఈ పురస్కారాలకు వ్యక్తుల ఎంపికలో చాలామంది రాజకీయమే చూసినా వాస్తవానికి దేశానికి కొందరు అందించిన విశిష్ట సేవలను విస్మరించకుండా గుర్తించడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం ఈ అవార్డులు ఇచ్చిందని గమనించాలి.

## ఆహార భద్రతకు అంకురార్పణ

వ్యవసాయశాస్త్రం క్షేత్రస్థాయిలో దుష్పరిణామాలకు కారణమవుతుంటే, సంస్కరించడానికి వెనుకాడని వాస్తవిక దృష్టి ఉన్న శాస్త్రవేత్తగా స్వామినాథన్ దేశ ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. కోట్లాదిమంది ఆకలి తీర్చేందుకు మార్గాన్ని కనుగొన్న ఆ శాస్త్రవేత్తకు భారత ప్రభుత్వం ఇటీవలే భారతరత్నను ప్రకటించడం ఎంతైనా సమంజసం. దేశంలో 'హరిత విప్లవానికి' బీజాలు వేసిన కరువు, యుద్ధపరిస్థితుల్లో యువకుడుగా ఉన్న స్వామినాథన్ వాటి పరిష్కారం గురించి ఆలోచించారు. ఆ కృషి కారణంగానే పేద ప్రజలకు ఉచితంగా ఆహారధాన్యాలు ఇచ్చేంతగా

పండించగలుగుతున్నాం. విదేశాల నుంచి ఆహార ధాన్యాలతో ఓడ వస్తేనే పొయ్యి మీదకు కుండ ఎక్కే పరిస్థితి నుంచి మిగుల ఉత్పత్తికి చేరుకునేటట్టు చేసిన ఘనత స్వామినాథన్‌దే.  మనం పాకిస్తాన్‌తో నాడు యుద్ధాన్నీ గెలిచాం, కొద్ది సంవత్సరాలలో ఆహార భద్రతనూ సాధించాం. భారత ఆర్థిక చరిత్రలో ఇదొక ప్రత్యేక ఘట్టం. ఈ ఘట్టానికి కేంద్రబిందువుగా కనిపించే శాస్త్రవేత్త మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్ (ఆగస్ట్ 7, 1925–సెప్టెంబర్ 28, 2023). రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఆయన రూపొందించిన సిఫారసులు కూడా చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

డా॥ ఎం.ఎస్. స్వామినాథన్‌కు భారత ప్రభుత్వం భారత రత్న ప్రకటించిందని  పేర్కొంటూ, ప్రధానమంత్రి మోదీ ఎక్స్‌పై పోస్ట్ చేశారు. "డా॥ స్వామినాథన్ వ్యవసాయం, రైతాంగ సంక్షేమానికి చేసిన చిరస్మరణీయ సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్నను ప్రకటించడం అత్యంత హర్షదాయకం. అత్యంత క్లిష్టమైన, సవాళ్లతో కూడిన సమయంలో వ్యవసాయంలో స్వావలంబన సాధించేందుకు భారత్‌కు తోడ్పడమే కాక, భారతీయ వ్యవసాయాన్ని ఆధునికం చేసే దిశగా ఆయన చేసిన విశిష్ట సేవలు, పోషించిన పాత్ర కీలకమైనవి. ఆవిష్కర్తగా, మార్గదర్శిగా, పలువురు విద్యార్థులు అభ్యాసం, పరిశోధన చేసేందుకు ప్రోత్సహిస్తూ ఆయన అందించిన అమూల్యమైన సేవలను కూడా గుర్తిస్తున్నాం.

డా॥ స్వామినాథన్ దార్శనికతతో కూడిన నాయకత్వం భారతీయ వ్యవసాయ రంగాన్ని పరివర్తనకు లోను చేయడమే కాదు దేశ ఆహార భద్రత, సుభిక్షతను నిర్ధారించింది. నాకు అత్యంత సన్నిహితంగా తెలిసిన వ్యక్తి ఆయన. నేను ఎప్పుడూ ఆయన సూచనలకు, అంతర్దృష్టులకు విలువ నిచ్చాను," అంటూ ప్రధాని మోదీ తన పోస్ట్‌లో కొనియాడారు.

నాటి భారత ప్రధానులు, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరా గాంధీ కాలంలోనే హరిత విప్లవ బీజాలు పడి మొలకలు వచ్చాయి. దానికి సూత్రధారులు నోబెల్ గ్రహీత నార్మన్ బోర్లాగ్, ఎంఎస్ స్వామినాథన్. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 1968లో హరిత విప్లవం ప్రారంభమైంది. అత్యధిక పంట దిగుబడిని ఇచ్చే గోధుమ విత్తనాలతో ప్రారంభ మైన ఈ విప్లవం దేశంలో ప్రతి ఒక్కరి ఆకలినీ తీర్చే ప్రయత్నం చేసింది. అందుకే స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పిలుస్తారు.

అధిక దిగుబడినివ్వగల విత్తన రకాలు, తగిన సాగునీటి సౌకర్యాలు, ఎరువులు ఇచ్చే అవకాశం హరితవిప్లవం కల్పించడంతో పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలోని సేద్యం నాటకీయంగా మెరుగుపడింది. ఇది రైతులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఒకవైపు వరి, మరొకవైపు గోధుమల అధిక దిగుబడి రకాల రూపకల్పనపై స్వామినాథన్ సహా పలువురు పరిశోధకులు, శాస్త్రవేత్తలు పనిచేశారు. అయితే, భారతదేశంలో హరిత విప్లవానికి ఆధారభూతమైన ఎక్కువ నీరు, ఎరువులకు ప్రతిస్పందించే నూతన జన్యు రకం లేదా నారు రకాన్ని పరిచయం చేయాలన్న ప్రాథమిక వ్యూహాత్మక దార్శనికత మాత్రం స్వామినాథన్‌దేనని ఒక పత్రిక పేర్కొనడాన్ని ఎవ్వరూ కొట్టి పారేయలేరు. హరిత విప్లవం ప్రారంభమైన ఒక దశాబ్ద కాలంలోనే భారత్ ఆహార కొరత దేశం నుంచి ఆహారధాన్యాల మిగులు దేశంగా అవతరించింది.


ఇంత పురోగతి సాధించినా, వ్యవసాయ సంక్షోభం రైతాంగాన్ని వీడక, రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తోంది. వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణాలలో – భూ సంస్కరణల అజెండా పూర్తి చేయకపోవడం, నీటి నాణ్యత, పరిమాణం, సాంకేతిక శ్రమ, అలసట, వ్యవస్థాగత రుణాలు తగినంతగా, సమయానికి అందుబాటులో లేకపోవడం, మార్కెటింగ్ అవకాశాలకు హామీ లేకపోవడం కారణం.

వీటితో పాటుగా వాతావరణ పరిస్థితులు కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని  జాతీయ రైతాంగ కమిటీ (ఎన్‌ఎఫ్‌సి) తెలిపింది. దీనికి పరిష్కారంగా రైతులకు భూమి, జలం, జీవ వనరులు, రుణం, బీమా, సాంకేతిక, విజ్ఞాన నిర్వహణ, మార్కెట్లు వంటి ప్రాథమిక వనరుల అందుబాటుపై రైతులకు నియంత్రణ ఉండాలని సూచించారు. వ్యవసాయాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చాలని ఎన్‌సిఎఫ్ సూచించింది. ఔషధ మొక్కలు, చమురు దిగుబడినిచ్చే మొక్కలు, లాభదాయకమైన సూక్ష్మజీవులు సహా కలపయేతర అటవీ ఉత్పత్తులకు వంటి జీవవైవిధ్యంలో ప్రాముఖ్యం కలిగి ఉన్న సంప్రదాయ హక్కులను పరిరక్షించాలంటూ ఆయన అధ్యక్షతన పని చేసిన కమిటీ నొక్కి చెప్పింది.

భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా మన్ననలు అందుకున్న స్వామినాథన్ 1987లో మొట్టమొదటి వరల్డ్ ఫుడ్ ప్రైజ్ సహా పలు అవార్డులను, రివార్డులను అందుకున్నారు.

## ఆకలితో పడుకోకూడదన్నవాడు

సాధారణ కుటుంబం నుంచి స్వతంత్ర భారతంలో అత్యున్నత పదవికి ఎదిగిన చౌధరి చరణ్‌సింగ్ దేశ వెన్నెముక అయిన గ్రామీణ సమాజాలకు అందించిన సేవలు చిరస్మరణీయం. దేశ ఐదవ ప్రధానమంత్రిగా రైతుల సమస్యల పట్ల ఆయన నిబద్ధత, వారి సంక్షేమం, భూసంస్కరణల



పీవీ నర్సింహారావు



స్వామినాథన్



చరణ్‌సింగ్

కోసం ఆయన చేసిన పోరాటం చరణ్‌సింగ్ (డిసెంబర్ 28, 1902–మే 29, 1987) రాజకీయ జీవితంలో కీలకమైనవి. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిస్తూ ఇటీవలే దేశ అత్యున్నత పురస్కారమైన 'భారత రత్న'ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను స్మరించుకోవడం ఉచితం.

'దేశ మాజీ ప్రధానమంత్రి చౌధరి చరణ్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించడం మన ప్రభుత్వానికి దక్కిన గౌరవం. దేశానికి ఆయన చేసిన సాటిలేని సేవలకు ఈ గౌరవం అంకితం' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌పై అవార్డును గురించి ప్రకటించారు. తన మొత్తం జీవితాన్ని రైతాంగ హక్కులు, సంక్షేమం కోసం సింగ్ అంకితం చేశారని మోదీ కొనియాడారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్య మంత్రిగా, కేంద్ర హోంమంత్రిగా, ఒక సాధారణ ఎమ్మెల్యేగా కూడా ఆయన దేశ నిర్మాణానికి ఉత్తేజాన్ని ఇచ్చారన్నారు. ఆయన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి నిలబడ్డవారని, ఆ సమయంలో ఆయన ప్రజాస్వామ్యం పట్ల చూపిన నిబద్ధత స్ఫూర్తిదాయక మన్నారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవసాయ రంగంలోని సమస్యలను, గ్రామీణ సమాజాలను దుస్థితి నుంచి బయటకు తెచ్చేందుకు భూసంస్కరణలలో ఆయన కీలక పాత్ర పోషించారు. రైతాంగం, గ్రామీణ జనాభా హక్కుల కోసం ఆయన కృషి, పోరాటం ఆయనకు భారతీయ రైతుల పక్షపాతి అనే పేరు తెచ్చి పెట్టాయి.

తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తోనే ప్రారంభించినప్పటికీ, 1967లో యూపీలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీకి ఆయన రాజీనామా చేయడం నాడు సంచలనం.


**దేశ మాజీ ప్రధానమంత్రి చౌధరి చరణ్ సింగ్‌ను భారత రత్నతో సత్కరించడం మన ప్రభుత్వానికి దక్కిన గౌరవం. దేశానికి ఆయన చేసిన సాటిలేని సేవలకు ఈ గౌరవం అంకితం అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌పై అవార్డును గురించి ప్రకటించారు. తన మొత్తం జీవితాన్ని రైతాంగ హక్కులు, సంక్షేమం కోసం సింగ్ అంకితం చేశారని మోదీ కొనియాడారు.**

జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించే ముందు ఆయన ఆ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఈ క్రమంలోనే ఆయన భారతీయ క్రాంతి దళ్ (బీకేడీ) అనే పార్టీని ఏర్పాటు చేశారు. అయితే, 1974లో తన పార్టీని సంయుక్త (యునైటెడ్) సోషలిస్ట్ పార్టీలో విలీనం చేసి భారతీయ లోక్‌దళ్ (బీఎల్‌డీ)కి జన్మనిచ్చారు. ఆ సమయంలో ఇందిరాగాంధీ బలమైన ప్రధానమంత్రిగా ఉన్నారు. ఆ తదుపరి సంవత్సరంలో ఆమె ఎమర్జెన్సీని ప్రకటించినప్పుడు, ఇతర ప్రముఖ ప్రతిపక్ష నాయకులతోపాటు చరణ్‌సింగ్‌ను ఖైదు చేసింది. ఎమర్జెన్సీని ఎత్తివేసిన అనంతరం మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో బీఎల్‌డీ కీలక పాత్ర పోషించింది. కాంగ్రెస్ (ఒ), బీఎల్‌డీ, జనసంఘ్, సోషలిస్టు పార్టీలతో మార్చి 1977లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో మార్చి 24, 1977 నుంచి 1978 జులై 1వరకు కేంద్ర హోంమంత్రిగా వ్యవహరించారు. పార్టీలో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో సింగ్‌ను డిప్యూటీ ప్రధాని, ఆర్థికమంత్రిగా జనవరి 24, 1979న దేశాయ్ నియమించారు. ఆ ఏడాది జులై వరకు పదవిలో ఆయన కొనసాగారు.

ప్రభుత్వంలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కడా చల్లపడే సంకేతాలు కనిపించకపోవడంతో దేశాయ్ ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. జనతాపార్టీ రెండుగా విడిపోయి, జనతా పార్టీ (సెక్యులర్) కొత్తగా ఏర్పడింది. ఇదే జనతా ప్రయోగ క్షీణతకు ఆది. కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానంటూ ముందుకు వచ్చిన సింగ్, జులై 28, 1979న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, తన ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లను, తమ ప్రాధాన్యతలను గురించి దేశానుద్దేశించి ప్రసంగించారు. తాను ముందుగా ప్రజా సేవకుడిగా ప్రజలతో మాట్లాడుతున్నానని, దారిద్ర్యాన్ని నిర్మూలించి, ప్రతి పౌరుడికి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన అన్నారు.

ప్రజలు తమ ఉనికి కోసం చేసే పోరాటాలను మించి మన విలువలను, స్వప్నాలను వెక్కిరించేది మరేదీ ఉండదనే విషయాన్ని దేశ రాజకీయ నాయకత్వం గుర్తు పెట్టుకోవాలని ఆయన నాడే హెచ్చరించారు. ఏ పసివాడూ కూడా ఆకలితో నిద్రపోయే పరిస్థితి రాకుండా చూడడమే రాజకీయ నాయకులకు దేశభక్తితో కూడిన లక్ష్యమంటూ ఆయన అన్న మాటలు నేటికీ సత్యాలే. దానితో పాటుగా ఆయన దేశంలోని నిరుద్యోగిత పెరగడాన్ని గురించి మాట్లాడుతూ, మంచి ఉపాధిని పొందేందుకు అన్ని అర్హతలూ ఉన్న యువత పనీపాటా లేకుండా కూచోవలసి రావడం శోచనీయమని అన్నారు.

ఆయన పార్లమెంటులో తమ మెజారిటీని రుజువు చేసుకోలేకపోయారు. ఆరవ లోక్‌సభ 1981 మార్చిలో పూర్తవ్వవలసి ఉన్నప్పటికీ, నాటి అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి ఆగస్టు 22, 1979న సభను రద్దు చేశారు. దీనితో సింగ్ జనవరి 14,1980 వరకు తాత్కాలిక ప్రధానిగా పని చేశారు. మొత్తం 170 రోజులపాటు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన, ఆయన పార్టీ కూడా మంచి స్థానాలనే సంపాదించి, పార్లమెంటులో రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించినా, కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ గెలవడంతో ఆయన ప్రభుత్వంలో చేరలేదు. ప్రధానిగా ఉన్న ఇందిర 1984లో హత్యకు గురైన అనంతరం జరిగిన ఎన్నికలలో కూడా ఆయన కాంగ్రెస్ ప్రత్యర్థిని ఓడించి తన స్థానాన్ని నిలుపుకున్నప్పటికీ, ఆయన పార్టీ ఘోరపరాజయం పాలైంది. ఏ విధంగా చూసినా భారతదేశంలో రైతాంగ ఉద్యమాలు బలపడడంలో, వాటికి రాజకీయ ప్రాధాన్యం చేకూర్చడంలో చరణ్‌సింగ్ పాత్ర కీలకమైనది. ★



# SURYA FOUNDATION

B-3/330, Paschim Vihar, New Delhi - 110063, Tel. : 011-25251588, 25253681
Email : interview@suryafoundation.org Website : www.suryafoundation.org

Surya Foundation is a well-known organization working for the development and training of the youth. Its main objective is to train bright, passionate and determined youth willing to shoulder responsibilities and work for the society.

On getting selected in the interview, initial training for six months will be given at Surya Foundation Campus. After that they will be On Job Training (OJT) for one year.

Candidates brought up in Sangh Sanskars, physically fit, interested in social work will be called for interview in the following categories :-

| Post | Experience | Age Between | 6 months Initial Training + 1 year OJT | After Training CTC |
|---|---|---|---|---|
| CA | IPCC / MTER | 18-25 | 3 - 4 L Per Annum | As per Performance |
| | Fresher | 22-30 | 5 - 6 L Per Annum | - do - |
| | Experienced (upto 5 years) | 25-35 | 6 - 8 L Per Annum | - do - |
| | Experienced (above 5 years) | 25-35 | 9 - 12 L Per Annum | -do - |
| Engineers, Fresher & Experienced | B.Tech (IIT) | 22-30 | 7.5 - 9 L Per Annum | - do - |
| | B.Tech (NIT) | 22-30 | 4.5 - 6 L Per Annum | - do - |
| | B.Tech (Other Institutes) | 22-30 | 3 - 3.6 L Per Annum | - do - |
| | M.Tech (IIT) | 22-30 | 8.5 - 10 L Per Annum | - do - |
| | M.Tech (NIT) | 22-30 | 5.5 - 7 L Per Annum | - do - |
| | M.Tech (Other Institutes) | 22-30 | 3.6 - 4 L Per Annum | - do - |
| MBA | MBA (IIT + IIM) | 22-30 | 15 L + Per Annum | - do - |
| | MBA (IIM) | 22-30 | 12 - 15 L Per Annum | - do - |
| | MBA (Other Institutes) | 22-30 | 3 - 3.6 L Per Annum | - do - |
| Post Graduate & Graduate | MCA, B.Ed., M.Ed., MSW, M.Sc., M.Com., M.A. *(Freshers / Experience) Ph.D.* * | 18-25 | 2.4 - 3 L Per Annum | - do - |
| | Mass Communication (Media) - PG | 18-28 | 2.4 - 3 L Per Annum | - do - |
| | B.Com. with three years experience in accounts, purchase, store | 18-28 | 3 L Per Annum | - do - |
| | B.Sc. BCA, BBA, BA, B.Com (Pursuing / Passed) | 18-25 | 1.4 - 1.8 L Per Annum | - do - |
| | Diploma | | 1.8 L Per Annum | - do - |
| Law | LLM | 22-28 | 3 - 3.6 L Per Annum | - do - |
| | LLB | 22-28 | 2.4 - 3 L Per Annum | - do - |
| Other Posts | Yoga Teacher, Naturopathy Doctor, Karate Teacher, Music Teacher, Stenographer (Hindi & English), Script Writer (Hindi & English), Data Operator & Clerk | Salary will be given according to qualification. | | - do - |
| GMT | Graduate Management Trainee | Details given below @ | | |

@ **Qualifications**. Boys who have passed class 10th / 11th / 12th in 2024 may apply. Should have secured minimum 60% aggregate marks with 75% marks in Maths in the previous class. **Age**. Below 18 years. Selected candidates will be imparted 6 months initial training at Surya Foundation Training Campus Jhinjholi prior to the On Job Training (OJT) or Practical Campus Training (PCT). Facilities for doing graduation and MBA or MCA will be provided during OJT / PCT. Free accommodation, food and stipend of Rs. 5,000/- p.m. will be provided during the period of 6 months initial training. During the OJT / PCT, besides free accommodation and facilities for education, stipend of Rs. 8,000/- p.m. in class 11th, Rs. 10,000/- in class 12th, Rs. 12,000/- in 1st year graduation, Rs. 15,000/- in 2nd year graduation, Rs. 18,000/- in 3rd year graduation, Rs. 22,000/- during MBA / MCA 1st year and 27,000/- in MBA / MCA 2nd year will be given. Salary Rs. 40,000/- p.m. (CTC) will be given on completion of MCA / MCA.

- *More deserving candidates may get higher salary as specified above.*
- ** Salary for Ph.D. Candidates will be decide during the interview.*

In your detailed application please mention if you have attended any camp such as NCC / NSS / Sangh Shiksha Varg / Prathamik Shiksha Varg / Sheet Shivir / PDC etc. Specify the details if the candidate has association with Seva Bharti / Vidya Bharti / Vanvasi Kalyan Ashram / Sangh. If there is anyone familiar in the Surya family, then mention their name and department. Enclose the photocopy of the mark sheet along with the application. Please send your CV / application along with detailed resume to the following address or by email.

B-3/330, Paschim Vihar, New Delhi - 110063 | Email : interview@suryafoundation.org

Last Date of Application - 30 April 2024

# అయోధ్య బాట పట్టిన ప్రముఖులు



## రాముడి సన్నిధిలో యూపీ శాసనసభ

అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రతిష్ఠించిన అనంతరం ఉత్తరప్రదేశ్ ఉభయ సభలకు చెందిన సభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, స్పీకర్ సతీష్ మహానా అధికారిక ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 11న ఆలయానికి వెళ్లి శ్రీరాముని దర్శించి, పూజలు నిర్వహించారు. కొందరు సమాజ్‌వాదీ పార్టీ నాయకులు మినహా అందరూ అయోధ్య వెళ్లేందుకు మొగ్గు చూపారు. దీనిపై స్పందిస్తూ, కేశవ్ ప్రసాద్ మౌర్య 'ఎవరైనా అయోధ్య వెళ్లడం లేదంటే, అది 'సమాప్తవాదీ పార్టీ' సభ్యులు మాత్రమేనంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో శ్రీరాముని ఆశీస్సులు పొందే అవకాశం తమకు లభించిందని, సమాజ్‌వాదీ పార్టీ తుడిచి పెట్టుకుపోతుందని ఆయన అన్నారు. అయోధ్య రామమందిర దర్శనం కోసం బయలుదేరిన ఎమ్మెల్యేలందరూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ బస్సు ఎక్కడం విశేషం. బాలరాముని దర్శనం చేసుకొని, పూజలు చేసే అవకాశం రావడం పట్ల స్పీకర్ సహా పలు పార్టీలకు చెందిన సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## అక్కడ మాటలకందని ప్రశాంతత

**- కేజ్రీవాల్, భగవంత్ సింగ్ మాన్**

తనకు సరైన ఆహ్వానం అందలేదన్న సాకుతో జనవరి 22 నాటి ప్రాణప్రతిష్ఠకు హాజరయ్యేందుకు సుముఖత చూపని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమ పార్టీకే చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఫిబ్రవరి 12న రామలల్లా దర్శనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరాముని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రామ్‌లల్లాకు ప్రార్థన చేసే సందర్భంలో తాను వర్ణనాతీతమైన ప్రశాంతతకు లోనయ్యానని కేజ్రీవాల్ చెప్పడం విశేషం. ప్రజలు ఎంతో ప్రేమతో భక్తితో ఇక్కడకు వచ్చి ప్రార్థనలు జరపడాన్ని చూడడం హృద్యంగా అనిపించిందని అన్నారు. రామ్‌లల్లాను దర్శించుకోవాలన్నది తన సుదీర్ఘకాల కోరిక అంటూ పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ అన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం తాను ప్రార్థించానంటూ ఆయన చెప్పారు.



## నాగరికతను పరిరక్షించుకునే ఉద్యమం

**- ఆధ్యాత్మికవేత్త జగ్గీ వాసుదేవ్**

ఆధ్యాత్మికవేత్త, ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా ఫిబ్రవరి 12న అయోధ్యలోని రామమందిరాన్ని సందర్శించి, బాల రాముని ఎదుట కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఇది ఐదువందల ఏళ్ల పోరాట ఫలితమని, ఇది భారతీయ నాగరికత ఉద్యమమని ఆయన అన్నారు. ఈ ఉద్యమం ఒక వర్గం మరో వర్గాన్ని అవమానించేందుకు ఉద్దేశించింది కాదని, ఇది భారత నాగరికతను పరిరక్షించుకునే ఉద్యమమని ఆయన అన్నారు. అయోధ్యలో శ్రీరాముని దర్శించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.



# వృద్ధ నాయకత్వం దిశగా అగ్రదేశం

**అమెరికా రాజకీయ వ్యవస్థను రెండు పార్టీలు– డెమోక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ శాసిస్తుండగా ఈ ఏడాది నవంబర్ 5న పోలింగ్‌లో ఆ దేశ ప్రజలు తమ 60వ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. రిపబ్లికన్ పార్టీని గ్రాండ్ ఓల్డ్ పార్టీ (జీఓపీ)గా పరిగణిస్తారు. డెమోక్రాట్స్‌తో పోలిస్తే రిపబ్లికన్ పార్టీ కన్జర్వేటివ్ విధానాలను అనుసరిస్తుంది. డెమోక్రటిక్ పార్టీ పౌరహక్కులు, సామాజిక భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుంది. రిపబ్లికన్ పార్టీ పన్నుల తగ్గింపు, ప్రభుత్వ పరిమాణాన్ని కుదించడం, తుపాకీ హక్కులు, వలసలు, గర్భవిచ్ఛిత్తి అంశాలపై కఠిన వైఖరి అనుసరిస్తుంది.**

ప్రస్తుతం డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేస్తానని జో బైడెన్ ప్రకటించారు. పార్టీలో అంతర్గతంగా కొంత పోటీ ఉన్నప్పటికీ, జో బైడెన్ పార్టీ తరపున అభ్యర్థిగా నామినేట్ అవడం ఖాయం. ఇక రిపబ్లికన్ పార్టీ విషయానికి వస్తే డోనాల్డ్ ట్రంప్ మొదటి రెండు రాష్ట్రాల్లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో విజయం సాధించారు (హ్యాంప్‌షైర్ ప్రైమరీలో డోనాల్డ్ ట్రంప్ ఓట్ల వాటా 54.3% కాగా, నిక్కీ హెలీ వాటా 43.2%) ఇప్పటికే పార్టీలో 49% మద్దతు సాధించడంతో పార్టీ తరపున నామినీ అయ్యే అవకాశాలు ట్రంప్‌కే అధికం. ప్రస్తుతం నిక్కీ హెలీ మాత్రమే ఆయనకు పోటీగా ఉన్నారు. ఆమెకు పార్టీలో 12% మద్దతుంది. మిగిలిన వారంతా పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి అధ్యక్ష రేసులో ఏదో అద్భుతం జరిగితే తప్ప డోనాల్డ్ ట్రంప్ (78), జో బైడెన్ (81)లు రంగంలో ఉండటం దాదాపు ఖాయమనే చెప్పాలి. వీరిద్దరే కాకుండా రాబర్ట్ ఎఫ్. కెన్నడీ జూనియర్ ఇండిపెండెంట్‌గా పోటీచేస్తున్నారు. ఈయన మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీకి సమీప బంధువు.

డోనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వం ఖరారైతే, అధ్యక్ష పదవికి వరుసగా కాకుండా రెండోసారి పోటీచేసే రెండో అధ్యక్షుడిగా నమోదవుతారు. ఆ విధంగా ఎన్నికైన తొలి అధ్యక్షుడు గ్రోవర్ క్లీవ్‌లాండ్ (1885–89, 1893–97) 22వ, 24వ దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రెండు వరుస ఎన్నికల్లో ఒకే ప్రత్యర్థులు పోటీ పడటం 1956 తర్వాత ఇది రెండోసారి. ఈ ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షుడు 2025 జనవరి, 20వ తేదీన ప్రమాణస్వీకారం చేస్తారు. నవంబర్ 5వ తేదీనే యు.ఎస్.లోని చాలా రాష్ట్రాల్లో సెనెట్‌కు, యు.ఎస్. హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ కూడా ఎన్నికలు జరుగుతాయి. వీటితోపాటు గుబర్నటోరియల్ ఎన్నికలు కూడా మొత్తం 11 రాష్ట్రాలు రెండు టెరిటరీల్లో జరుగనున్నాయి. 2020లో న్యూహ్యాంప్‌షైర్, వెర్మోంట్‌ల్లో తప్ప ఈ రాష్ట్రాలు, టెరిటరీల్లో గుబర్నటోరియల్ ఎన్నికలు జరిగాయి. న్యూహ్యాంప్‌షైర్, వెర్మోంట్ రాష్ట్రాల్లో గవర్నర్ల పదవీకాలం రెండేళ్లు మాత్రమే. ఇక్కడ గవర్నర్ ఎన్నికలు 2022లో జరిగాయి. మిగిలిన రాష్ట్రాల్లో గవర్నర్ల పదవీకాలం నాలుగు సంవత్సరాలు.

**వయసుడిగిన బైడెన్**

తాను అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తానని, కమలాహారిస్ ఉపాధ్యక్షురాలిగా బరిలోకి దిగుతుందని జోబైడెన్ 2023 ఏప్రిల్ 25న


ప్రకటించారు. కాగా 2021లో జో బైడెన్ పాపులారిటీ కనిష్ఠ స్థాయికి పడిపోయిన తరుణంలో కారోలిన్ మలోనీ, టిమ్ రాయన్, జాయ్ కన్నింగ్‌హామ్ ప్రముఖ డెమొక్రటిక్ నాయకులు ఆయన మళ్లీ ఎన్నికల్లో పోటీచేయకుండా ఉంటే బాగుంటుందని సూచించారు. ముఖ్యంగా వయసు ఆయన పాపులారిటీ పడిపోవడానికి ప్రధాన కారణం. శారీరక, మానసిక ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్న బైడెన్ పాలనను ఏ విధంగా నిర్వహిస్తారనేది ప్రశ్న. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ఆయన వయస్సు 78 ఏళ్లు. ఈ ఏడాదితో పదవీకాలం ముగిసే నాటికి ఆయన 82 ఏళ్ల వయసుకు చేరుకుంటారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికైతే 86 ఏళ్ల వరకు పదవిలో కొనసాగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో 2023 ఏప్రిల్ నెలలో ఎన్‌బీసీ నిర్వహించిన పోల్ సర్వేలో 70శాతం అమెరికన్లు, 51 శాతం డెమొక్రాట్లు ఆయన తిరిగి పోటీ చేయకుండా ఉంటేనే మంచిదని స్పష్టం చేయడం గమనార్హం. ప్రస్తుతం జోబైడెన్ అప్రూవల్ రేటు 41శాతం కాగా 55శాతం మంది ఆయన అభ్యర్థిత్వాన్ని అంగీకరించడం లేదు. డెమొక్రటిక్ పార్టీ ప్రోగ్రెసివ్ ఫ్యాక్షన్ నుంచి జోబైడెన్ వ్యతిరేకత ఎదుర్కొనే అవకాశముంది. అయితే 2022 మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ మంచి పనితీరు ప్రదర్శించిన నేపథ్యంలో జోబైడెన్ అభ్యర్థిత్వ ఆమోదానికి ఢోకా ఉండబోదని ఆయన అనుయాయుల విశ్వాసం.

**దూసుకుపోతున్న ట్రంప్**

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పార్టీలో ఆమోదం పొందే ప్రక్రియలో డోనాల్డ్ ట్రంప్ దూసుకు పోతున్నారు. ఇప్పటివరకు వరుసగా కాకుండా రెండోసారి ఎన్నికల్లో పోటీపడిన మాజీ అధ్యక్షుల్లో ట్రంప్ ఐదోవారు. ఒకవేళ విజయం సాధిస్తే అటువంటి అధ్యక్షుల్లో రెండోవారుగా గుర్తింపు పొందుతారు. తాను అధ్యక్ష పదవికి పోటీపడు తున్నట్టు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్‌కు ఆయన 2022, నవంబర్ 15న ఒక స్టేట్‌మెంట్ అందజేశారు. అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ట్రంప్ సహచర ఉపాధ్యక్షుడిగా పోటీచేస్తారు. బైడెన్ చుట్టూ ఉన్నవారు పనికిమాలినవాళ్లంటూ ట్రంప్




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



విమర్శించడం కొంచెం ఎబ్బెట్టుగా అనిపించినా ఆలోచిస్తే నిజమనిపించేలా ఉన్నాయి. ఉదాహరణకు వచ్చే ఎన్నికల్లో బైడెన్ ఎన్నికైతే, ఉపాధ్యక్షులుగా కమలాహారిస్ ఉంటారు. అంటే బైడెన్ తర్వాత ఆమె దేశాధ్యక్షురాలుకావచ్చు. కానీ కమలాహారిస్ ఒక రాకెట్ సైంటిస్ట్. అందువల్ల ఆమెకు వ్యక్తిగత కాంక్షలు తప్ప, ఒక సిద్ధాంతం లేదా విశ్వాసానికి కట్టుబడి ఉండే అవసరం లేదు. ఇక నిర్లక్ష్యానికి మరోపేరైన ట్రంప్‌కి యు.ఎస్.మీడియా పూర్తి వ్యతిరేకం. బైడెన్ విస్తృతంగా పర్యటించడానికి ఆయన వయసు సహకరిం చదు. అదే ట్రంప్ ఇందుకు పూర్తి భిన్నం. దేశవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ, ప్రచారం కొనసాగి స్తున్నారు. ఆయన తన నోటిదురుసును అదుపులో పెట్టుకోకపోతే, ఈ బలహీనతను తాను 'పనికిమాలినవాళ్లు'గా పేర్కొన్న బైడెన్ టీమ్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి దెబ్బతీయవచ్చు. ఇదిలావుండగా బైడెన్ ప్రభుత్వం, డెమొక్రాట్లు అధికారంలో ఉన్న చాలా రాష్ట్రాల్లో ట్రంప్‌కి వ్యతిరేకంగా అనేక కేసులు పెట్టారు. రెండు రాష్ట్రాలైతే ట్రంప్‌ను అధ్యక్షపదవి పోటీ నుంచి పక్కకు తప్పించాలని ప్రయత్నిస్తున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవిగా ఆరోపిస్తున్న ట్రంప్ తానొక రాజకీయ బాధితుడినని భావిం చడం సహజమే.

**ప్రధాన సమస్యలు**

ఈసారి ఎన్నికల్లో గర్భవిచ్ఛిత్తి, ఆరోగ్య పరిరక్షణ, విద్య, ఆర్థిక పరిస్థితి, విదేశాంగవిధానం, ఎల్.జి.బి.టి హక్కులు, ప్రజాస్వామ్యం అంశాలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. గర్భవిచ్ఛిత్తి (అబార్షన్)కి చట్టబద్ధత కల్పించే విషయంలో ప్రస్తుతం దేశంలో తీవ్రచర్చలు నడుస్తున్నాయి. డెమొక్రాట్లు గర్భవిచ్ఛిత్తి హక్కుకు మద్దతిస్తుండగా, రిపబ్లికన్లు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. 2023 ఏప్రిల్ నాటికి రిపబ్లికన్ల పాలన ఉన్న చాలా రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు గర్భవిచ్ఛిత్తిని చట్టవిరుద్ధం చేస్తూ చట్టాలను అమల్లోకి తెచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రచారంలో ఉన్న మరో ప్రధానాంశం వలసలు, సరిహద్దు భద్రత. 2023లో మెక్సికో నుంచి దేశంలోకి వలసలు విపరీతంగా పెరిగాయి. రిపబ్లికన్లు అధికారంలో ఉన్న టెక్సాస్, ఫ్లోరిడా వంటి రాష్ట్రాలు ఈ విధంగా వలస వచ్చిన వారిని డెమొక్రట్లు అధికారంలో ఉన్న న్యూయార్క్, చికాగో వంటి రాష్ట్రాలకు తరలించాయి. తాను అధికారంలోకి వస్తే, వలసదార్లను తిరిగి స్వదేశానికి పంపుతానని, మెక్సికో సరిహద్దుకు సైన్యాన్ని పంపి భద్రతను కట్టుదిట్టం చేస్తానని, ఐ.సి.ఇ. డిటెన్షన్లను మరింత తీవ్రం చేస్తానని హామీ ఇస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలకు సరిహద్దు భద్రతను అప్పగించే రీతిలో చట్టాలు తెస్తానని కూడా ఆయన చెబుతున్నారు. అయితే బైడెన్ ప్రభుత్వం మాత్రం యుక్రెయిన్, వెనిజులా, నికారాగువా, క్యూబా వంటి దేశాల నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్నవారికి తాత్కాలిక రక్షణ కల్పించే విధానాన్ని అనుసరిస్తోంది.

**ప్రజాస్వామ్యం**

జో బైడెన్ ఈ ఎన్నికలను ప్రజాస్వామ్య పరిరక్షణకోసం జరిగే పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా వర్తమాన భౌగోళిక రాజకీయా లకు అనుగుణంగా తాను రూపొందించి అమలు చేస్తున్న ప్రజాస్వామ్య విధానం సముచితమైందని పేర్కొంటూ, ఈ ఎన్నికలు 'ప్రజాస్వామ్యం, నిరంకుశ విధానాలకు మధ్య జరుగుతున్నవిగా వివరిస్తున్నారు. అయితే డోనాల్డ్ ట్రంప్ ఈ ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వ్యాఖ్యలు మీడియా విమర్శలకు గురవుతున్నాయి. అవసరమైతే రాజ్యాంగాన్ని రద్దుచేస్తానని, న్యాయశాఖను తన రాజకీయ శత్రువులపై ప్రయోగిస్తానంటూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలను పలువురు విమర్శిస్తున్నారు.

అంతేకాదు ఈ ఎన్నికల్లో అవినీతి జరిగే అవకాశ ముందంటూ ఆయన చేస్తున్న ఆధారరహిత ఆరోపణలు కూడా ప్రతికూలతను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రజాస్వామ్యం' 2024 ఎన్నికల్లో ఒక ప్రధాన చర్చనీయాంశంగా రూపొందింది.

**ఆర్థిక పరిస్థితి**

దేశ ఆర్థిక పరిస్థితిని ఓటర్లు తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్నారు. కోవిడ్–19 వల్ల కలిగిన ప్రతికూల పరిస్థితుల ప్రభావం 2024లో కూడా కొనసాగే అవకాశాలున్నాయి. దేశంలో సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో పాటు కరోనా మహమ్మారి కారణంగా 2021నుంచి దేశంలో ద్రవ్యోల్బణం తీవ్ర స్థాయిలో పెరిగింది. దీనికి తోడు 2022 నుంచి కొనసాగు తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ నేపథ్యంలో 2021 నుంచి దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంలో జో బైడెన్ విఫలమయ్యారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అమెరికన్ రెస్క్యూ ప్లాన్ కింద శిశు సంరక్షణ కోసం తీసుకున్న తాత్కాలిక చర్యలు 2024 వరకే పరిమితం.

**విద్య**

ఇక విద్య విషయానికి వస్తే విద్యార్థుల రుణాల తిరిగి చెల్లింపులో జో బైడెన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రస్తుత విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు పడిన భారం 32 బిలియన్ డాలర్లు! సుప్రీంకోర్టు వీటికి అడ్డుకట్ట వేసినప్పటికీ ఏదోవిధంగా అమలు చేయాలన్న సంకల్పంతో బైడెన్ ప్రభుత్వం ముందుకు పోతున్నది. దేశంలోని విద్యావ్యవస్థలో కిండర్ గార్డెన్ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు రాడికల్స్ ఆక్రమించడంతో సామాజిక సమస్యలు పెరుగు తున్నాయి. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో 'క్రిటికల్ రేస్ థియరీ' (సంక్లిష్ట జాతుల సిద్ధాంతం) బోధనను రిపబ్లికన్లు అధికారంలో ఉన్న చాలా రాష్ట్రాలు రద్దుచేశాయి. పాఠశాల స్థాయిలో ఈ అంశాన్ని బోధించడం సమంజసం కాదన్నది వీరి వాదన. అయితే విమర్శకులు మాత్రం దీన్ని తొలగించడ మంటే అమెరికన్ చరిత్రను 'వైట్‌వాష్' చేయడం మాత్రమే నని అంటున్నారు.

**విదేశాంగవిధానం**

విదేశాంగ విధానానికి వస్తే బైడెన్ అధికారంలోకి వచ్చాక 2021లో ఆఫ్ఘనిస్తాన్ నుంచి అర్థాంతరంగా యు.ఎస్. సేనల ఉపసంహరణ జరిగింది. రష్యా–యుక్రెయిన్ యుద్ధంలో, యుక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో సైనిక, మానవతా సహాయాన్ని యు.ఎస్. అందించింది. డెమోక్రాట్లు, రిపబ్లికన్లలో చాలామంది దీన్ని సమర్థిం చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, రష్యా దురాక్రమణను నిరోధించేందుకు ఇది చాలా అవసరమని రెండు పార్టీల నాయకులు అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేస్తున్న రాన్ డె సాంటిస్, డోనాల్డ్ ట్రంప్ వంటి వారు ఉక్రెయిన్‌కు సహాయం, రష్యాను అణచివేయాలనుకునే విధానాలు, అమెరికాకు ఎంతమాత్రం ప్రయోజనకారి కాదని ప్రచారం చేస్తున్నారు. అమెరికన్ ఇండియన్ రామస్వామి యుక్రెయిన్‌కు సైనిక సహాయం నిలుపుదలకే మద్దతు పలకడం గమనార్హం. ఈయన అధ్యక్షపదవి రేసులో కొనసాగి చివరకు డోనాల్డ్ ట్రంప్‌కి మద్దతుగా వైదొలిగారు.


యుక్రెయిన్ విజయం సాధించదని తెలిసి కూడా 100 బిలియన్ డాలర్ల కంటే అధికంగా ట్యాక్స్ పేయర్స్ చెల్లించిన మొత్తాన్ని ఆ దేశానికి సహాయంగా అందించారు. ఇందుకు హంటర్ బైడెన్ ప్రధాన కారణమన్న అంశం ముందుకు వస్తోంది. ఇక ఇజ్రాయిల్–హమాస్ యుద్ధంలో బైడెన్ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఏకపక్షంగా మద్దతు పలికింది. ఇజ్రాయిల్‌కు ఏకంగా 10.6 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం కోసం బైడెన్ కాంగ్రెస్ అనుమతి కోరారు. 74% యూదు ఓటర్లు జోబైడెన్ నిర్ణయాన్ని హర్షించారు. అయితే బైడెన్ ఇజ్రాయిల్‌కు మద్దతివ్వడం వల్ల దేశంలోని ముస్లిం ఓటర్లు డెమోక్రటిక్ పార్టీకి వ్యతిరేకం కావడం కీలక పరిణామం. ఇజ్రాయిల్, హమాస్ యుద్ధం విషయంలో ఎలైట్ ఒపీనియన్‌లో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వీరిలో మెజారిటీ వర్గం ఇజ్రాయిల్‌కు మద్దతు పలకగడం గమనార్హం. అయితే చాలామంది అమెరికన్లు మాత్రం ఇజ్రాయిల్–హమాస్ యుద్ధంలో అమెరికా తటస్థ వైఖరి అనుసరించాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. 18–34 మధ్య వయస్కులైన ఓటర్లలో 66 శాతం మంది హమాస్‌పై యుద్ధంలో ఇజ్రాయిల్ వైఖరిని విమర్శించగా, 20శాతం మంది సమర్థించారు. మెజారిటీ ప్రజలు మాత్రం పాలస్తీనాకు మద్దతు పలకడం విశేషం.

**ఎల్‌జీబీటీ హక్కులు**

ఎల్‌జీబీటీ ప్రజలు ముఖ్యంగా ట్రాన్స్‌జండర్ హక్కులను పరిమితం చేస్తూ వివిధ రాష్ట్రాల్లోని కన్జర్వేటివ్ పార్టీల సభ్యులు ఇటీవలి కాలంలో బిల్లులను ప్రవేశపెట్టడం పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో బైడెన్ ఇటీవల 'రెస్పెక్ట్ ఫర్ మ్యారేజ్ యాక్ట్' పేరుతో చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ఇది స్వలింగ వివాహాలు, వివిధ జాతుల మధ్య వివాహాల పరిరక్షణకు దోహదం చేస్తుంది. ఇదే సమయంలో ఆయన 1964 నాటి సివిల్ రైట్స్ యాక్ట్‌ను మరింత విస్తరించి 'ఈక్వాలిటీ యాక్ట్' పేరుతో చట్టాన్ని ఆమోదించాలని బైడెన్ యు.ఎస్. కాంగ్రెస్‌ను అభ్యర్థించారు. వివిధ రంగాల్లో లింగవివక్ష నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. 2023 ఫిబ్రవరి నెలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో డోనాల్డ్ ట్రంప్, తాను ఎన్నికైతే కేవలం ద్విలింగ గుర్తింపు చట్టాన్ని తీసుకు వస్తానని ప్రకటించారు. ట్రాన్స్‌జండర్ భావనను రాడికల్ లెఫ్ట్ ముందుకు తెచ్చిందని, ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జండర్‌లే లక్ష్యంగా దాదాపు 12 చట్టాలను అమల్లోకి తెస్తానని కూడా ఆయన స్పష్టం చేశారు.

**బలహీనతలు**

జో బైడెన్‌కు వయసు ప్రధాన బలహీనత అయితే, తనపర భేదం లేకుండా అందరినీ ఒకే గాటనగట్టి విమర్శించడం ట్రంప్ ప్రధాన బలహీనత. ఇదే ట్రంప్‌ను అందరికీ దూరం చేస్తోంది. పోటీలో ఉన్న ప్రధాన ప్రత్యర్థులిద్దరూ వయోవృద్ధులు కావడం అమెరికా బలహీనత. యువనాయకత్వానికి దేశ పగ్గాలు చేపట్టే అవకాశాలు రాకపోవడం రాజకీయ వ్యవస్థలోని బలహీనత. ద్రవ్యోల్బణం తీవ్రస్థాయిలో పెరగడం, ప్రభుత్వ ఖర్చులకు అడ్డూ అదుపూ లేకపోవడం, పాలనాపరమైన బలహీనత. ఇన్ని బలహీనతలతో అమెరికా ప్రపంచానికి పెద్దన్న పాత్రను ఎట్లా పోషిస్తుందో వేచి చూడాలి. ★



ఎవరూ ఊహించలేదు అలా జరుగుతుందని. ఇప్పటి సైన్స్‌ను బట్టి భవిష్యత్తు చెప్పేవాళ్లు, పత్రకారులు, యూట్యూబ్‌లో ప్రళయం గురించి ముందే చెప్పేవాళ్లూ, రక్షణ మంత్రిత్వ శాఖలోని విశ్లేషకులూ కంప్యూటర్ స్పెషలిస్టులూ కల్పనా రచయితలూ ఎవరూ ఊహించలేదు. ఒక గంటలో అంతా అయిపోయింది.

అడవి. ఢిల్లీకి 238 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్. ఇక్కడికి నిన్ననే వచ్చారు రాజ్, ప్రియా. అడవి అంతర్భాగంలో ఉన్న ఒక గెస్ట్ హౌస్ లో నివాసం. ఇలా ఒక హాలిడే ట్రిప్ కింద వచ్చారు,

అర్ధరాత్రి రెండు గంటలకి ప్రియాకి మెలకువ వచ్చింది. పక్కనే రాజ్ గాఢనిద్రలో ఉన్నాడు. దూరంగా ఉరుము లాంటి చప్పుడు. అర్ధరాత్రి ఒక్కసారి నక్కలు అరచినట్లు, పక్షులు రెక్కలను రెపరెపలాడిస్తూ చెట్ల ఆకుల నుంచి పైకి ఎగిరినట్లు విపరీతమైన ధ్వనులు.

లేచి బయటకు వచ్చింది ప్రియా. అంతా చీకటిగా ఉంది. చేతిలో సెల్ఫోన్ ఒక్కసారి మెరిసి ఆగింది.

హెచ్చరిక హెచ్చరిక. మరో 30 నిమిషాల్లో ఢిల్లీ తదితర పరిసర ప్రాంతాలపై బాంబుల దాడి ప్రారంభమవుతుంది. ప్రజలందరూ భూగర్భంలోని బంకర్లలో వేగంగా తలదాచుకోవాలి. అత్యవసరమైన ఆహారం మందులు తప్ప మిగిలిన ఏ సామానులు తీసుకుని వెళ్లవద్దు. హెచ్చరిక... మూడు నాలుగుసార్లు ఫ్లాష్ అవుతోంది. ఆ హెచ్చరిక వచ్చిన టైం చూసింది 9 గంటల 45 నిమిషాలు. ఇప్పుడు



రెండు గంటల 35 నిమిషాలు అయింది. అంటే... అంటే ప్రియకు గుండె ఆగినంత పని అయింది.

లేచి బయటకు వచ్చింది ప్రియా. ఢిల్లీపై అణుబాంబులు పడటం అంతా విధ్వంసం జరిగిపోయిందా? మళ్లీ మళ్లీ ఉరుములు దూరం నుంచి వస్తున్నాయి. చెట్ల ఆకుల మధ్య నుంచి ఆకాశం కేసి చూస్తే ఆకాశంలో నల్లటి మబ్బులు తెల్లని వెన్నెల మబ్బులను కూడా కమ్మేస్తున్నాయి. గబగబా లోపలికి పరిగెత్తింది. 'రాజ్! రాజ్! లే నిద్రలే!'

లాప్టాప్ ఆన్ చేసి న్యూస్ చానల్స్ చూడసాగింది. తెరమీద చుక్కలు చుక్కల స్టాటిక్ తప్ప మరి ఏమీ రావటం లేదు.

మొబైల్ డేటా సరిగ్గా రావటం లేదు.

రాజ్ కళ్లు తెరిచి చూస్తున్నాడు. 'ప్రియా ఏం జరిగింది?'

హఠాత్తుగా ల్యాప్టాప్‌లో న్యూస్ ఛానల్‌లో కొన్ని లక్షల మంది చనిపోయారని భావిస్తున్నారు. ఇది వినాశనం. ప్రళయం. ఇది దేశంలో ఇతర ప్రాంతాల్లో వారికి తెలియాలని నేను మెసేజ్ పంపిస్తున్నాను. మీరు ఎక్కడ ఉన్నా కొద్ది రోజులు పాటు అండర్ గ్రౌండ్ బంకర్లలో గాని ఇళ్లలోనే తల దాచుకోండి. కనీసం మూడురోజులు బయటికి రావద్దు. ఆహారం నీరు రేడియేషన్తో కలుషితం అవుతాయి. చెరువులు నదులు కూడా రేడియేషన్ ప్రభావం వల్ల కాలుష్యంతో నిండి పోతాయి." ఇదే సందేశం మాటిమాటికి రాసాగింది. అవే ఫోటోలు మళ్లీ మళ్లీ వస్తున్నాయి.

"ఓ మై గాడ్" అని తల పట్టుకుని ప్రియ, "హూ ఐ కాంట్ బిలీవ్ దిస్" అని రాజ్ ఇద్దరూ రెండు నిమిషాలపాటు అచేతనంగా అయిపోయారు. ఆ భయంకరమైన వార్త వాళ్లకి తిరుగులేని షాక్ కలుగ జేసింది.

"బయటకు పోయి ఫారెస్ట్ గార్డులని, ఇతర

గేట్ దగ్గర లైట్లు ఆరిపోయి ఉన్నాయి. ఇక్కడ ఆకాశంలో నల్లటి మబ్బులు కనిపిస్తున్నాయి.

అవి వలయాలు వలయాలుగా తిరుగు తున్నాయి.

రాజ్ భయంగా అన్నాడు. "ఈ సాయంత్రం మనం చూసినప్పుడు ఆకాశంలో మబ్బులు లేవు. ఇవి బహుశా దాడి జరిగిన తర్వాత ఆకాశంలో అలముకున్న రేడియేషన్ మేఘాలు. నిజంగానే అణుదాడి జరిగితే ఒక వారం రోజులు పాటు భయంకరమైన రేడియోధార్మికశక్తి ఆకాశంలో మబ్బులుగా ఏర్పడి నల్లటి యాసిడ్ వర్షంలా కురవచ్చు. నిజంగానే ఢిల్లీ ఇతర నగరాలు నాశనం అయిపోయి ఉంటే బతికున్న వాళ్లు కూడా ఈ రేడియోధార్మికశక్తితో మరణించవచ్చు. ఆహార పదార్థాలు, తాగే నీళ్లు నదులు చెరువులు అన్ని రేడియేషన్తో కలుషితమైపోయే ఛాన్స్ ఉంది. ఏం చేద్దాం."

# శిథిల నగరం

డాక్టర్ చిత్తర్వు మధు

సందేశం రాసాగింది.

"నా పేరు యశ్‌పాల్. ఇప్పుడు ఢిల్లీలోని బంకర్ నుంచి మాట్లాడుతున్నాను. ఒక భయంకరమైన ఉత్పాతం జరిగింది. ఢిల్లీ మొదలైన పెద్ద నగరాల అన్నిటి మీద బాంబు దాడి జరిగింది. నగరాలన్నీ నాశనం అయిపోయాయి. ఇది ఎవరు చేశారో తెలియటం లేదు' అతను అలా చెప్తూ ఉండగా తెర మీద ఒక ఫోటో రాసాగింది. ఢిల్లీ నగరపు ఆకాశం మీద కుక్క గొడుగు రూపంలో ఒక పెద్ద నల్లటి పొగ మేఘం అల్లుకుని ఉంది. రోడ్లమీద జనం కకావికలుగా పరిగెత్తుతూ కనిపించారు. అన్ని భవనాల నుంచి మంటలు కనబడుతున్నాయి. "ఒక అరగంట ముందు వచ్చిన హెచ్చరిక ఆధారంగా కొంతమంది మాత్రమే బంకర్లలో ప్రాణాలు కాపాడుకున్నాం. ప్రధానమంత్రి రక్షణ మంత్రిత్వ శాఖ ఏమయ్యారో తెలియదు. ఆర్మీ జనరల్ మిలిటరీ ఇప్పుడిప్పుడే బయటికి వచ్చి ప్రజలకి పునరావాస చర్యలు చేపడుతున్నారు. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి. రేడియేషన్ వల్ల అపాయం. ప్రజలు బయటికి రాకూడదు అని ప్రకటనలు చేస్తున్నారు.

సెక్యూరిటీ ఆఫీసర్లని అడుగుదాం పద!" అన్నది ప్రియ.

"వెళ్లే ముందు మనకి కావలసిన దుస్తులు, ఆహారం నీళ్లు ప్యాక్ చేసుకుని బయటపడటం మంచిది. ఎందుకంటే బయట పరిస్థితులు మనకు తెలియవు."

మిణుకు మిణుకుమని దీపాలు ఆరుతూ వెలుగుతూ, ఒక్కసారిగా కాటేజీలో కరెంటు పోయింది. చిమ్మ చీకటి. బయట కీచురాళ్ల శబ్దం, అక్కడక్కడ తోడేళ్ల అరుపులు. దూరంగా పులుల గాండ్రింపులు తప్ప ఏ శబ్దాలు వినిపించడం లేదు.

ఫ్లాష్ లైట్‌తో గబగబా కొన్ని దుస్తులు నీళ్ల సీసాలు బ్రెడ్ ప్యాకెట్లు చెరొక బ్యాగ్‌లో పెట్టుకొని బయటకు వచ్చారు. వాళ్ల కాటేజీ రిసెప్షన్ ఆఫీసు ఒక కిలోమీటర్ దూరం ఉంది. నడవసాగారు. అక్కడక్కడ విసిరేసినట్లు ఉన్న కాటేజీలు నిర్మానుష్యంగా ఉన్నాయి. లైట్లు లేవు. ఆఫీస్ దగ్గర 24 గంటలు డ్యూటీలో ఉండవలసిన వ్యక్తి లేదు.

"మనం గాఢ నిద్రలో ఉన్నాం. వీళ్లందరికి ముందే ఈ వార్త తెలిసి పారిపోయినట్లుంది!"

"అణుబాంబు దాడి గురించి నీ విజ్ఞానం బాగానే ఉంది. ఇప్పటి వరకు మనం అదృష్టవంతులమే అనుకోవాలి. ఏదైనా వాహనం దొరికినా నెమ్మదిగా సురక్షితమైన ప్రాంతానికి వెళ్దాం. లేకపోతే నడుద్దాం. నిజానికి రేడియేషన్ సూట్లు గాని భూమి అడుగున గల బంకర్లు గానీ మనని రక్షిస్తాయి. కానీ అవి ఇక్కడ లేవు." అన్నది ప్రియా.

ఢిల్లీకి పోయే హైవే నిర్మానుష్యంగా ఉంది. ఒక్క

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతికి ఎంపికైనది

వాహనం కూడా లేదు. ఒక్క దీపం కూడా లేదు. ఇద్దరూ నడవడం మొదలుపెట్టారు.

రాజ్‌కీ ప్రియాకీ పరిచయం రెండేళ్ల నుంచి ఉంది. రాజ్ ఢిల్లీలో నోయిడాలో ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్. కృత్రిమ మేధస్సుకి సంబంధించిన రీసెర్చ్ చేస్తూ ఉన్నాడు. ఒక వీకెండ్ ఏదో పబ్బులో పరిచయమైంది ప్రియ. ఒకరికొకరు ఆకర్షితులైనా ఇద్దరికీ ఒకరి గురించి ఒకరి వివరాలు ఇంకా సరిగ్గా తెలియదు.

ఎప్పుడు ఆమెని వివరాలు అడిగినా ఇంకొంచెం సమయం కావాలి అనేది. ఆమె నంబర్ లేని ఒక కార్లో రావడం, వెళ్లేటప్పుడు ఫోన్ చేస్తే మరొక కార్ పికప్ చేసుకోవడం జరిగేది. రాజ్‌కి అది ఆశ్చర్యంగా, అనుమానంగా ఉన్నా, ఆమె తెలివి తేటలు ఒక రకమైన ఆకర్షణ ప్రత్యేకమైన వ్యక్తిత్వం అతన్ని చాలా ఆకర్షించాయి. ఆమె ఒక గొప్ప ధనవంతుడి కుమార్తె గాని లేక పెద్ద ఆఫీసర్ గానీ కావచ్చు అనుకునేవాడు.

ఇద్దరూ సినిమాలకు వెళ్లేవారు. కనీసం 15 రోజులకు ఒకసారి రెండు మూడు గంటలైనా గడిపేవారు. ఈసారి వారాంతంలో మాత్రం టైగర్ పార్క్‌కి వెళ్దాం అని ప్రియ ప్రపోజ్ చేసింది.

చీకట్లో ఇద్దరూ రోడ్డు మీద నడుస్తూనే ఉన్నారు.

“ఈ ప్రళయం ఈ విలయం వచ్చినప్పుడైనా నీ గురించి చెప్పవా!” అన్నాడు రాజ్.

నడిచేదల్లా ఆగి నవ్వి అన్నది ప్రియా .

“ఎప్పటి నుంచో గోప్యంగా ఉండాల్సిన అవసరం ఉందేమో. ఇది ప్రపంచ మంతా వినాశనం అయిపోతున్న క్షణం. బహుశా నేను చేయవలసింది చాలా ఉందేమో…

భుజాన వేసుకున్న బ్యాగ్‌లో బట్టలు, ఫోను, కొన్ని నోట్లు, వాటికి అడుగున డాడీ ఇచ్చిన ఒక పరికరం అప్రయత్నంగానే తడిమి చూసింది. “ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికీ నువ్వు ఎవరో తెలియకూడదు. నీ బాయ్ ఫ్రెండ్‌కి కూడా నేను ఇచ్చిన పరికరం గురించి చెప్పకు. అవసరం వచ్చినప్పుడు ఆ పరికరం నీకు హెల్ప్ చేస్తుంది. అది ఒక పెన్ డ్రైవ్ లాంటిది.

“పాస్వర్డ్ ఉందా డాడీ ఏమన్నా?”

ఆయన చెప్పాడు “నీ తలలోనే ఉంచుకో!

“సురక్షణ 2041”

“అమ్మ… అమ్మ పేరు… “ ఆశ్చర్యపోయింది.

“అవును ప్రియా! ఆపత్ కాలంలోఅదే నీకు రక్ష.”

* * *

కొన్ని గంటల ముందు… ఢిల్లీలో…

ప్రధానమంత్రి విక్రమ్ రావు తన సెక్రటేరియట్‌లో ఇద్దరు అంతరంగికులతో కూర్చుని ఉన్నాడు. ఇంటెలిజెన్స్ రిపోర్టులు అన్నీ వచ్చి ఉన్నాయి. జనరల్ సమర్ సింగ్ ఈ రాత్రికి విప్లవం తెచ్చేందుకు చేసేందుకు కచ్చితంగా పథకం రచించాడు. త్రివిధ బలాలు అతని చేతుల్లోనే ఉన్నాయి. ఏం చేయాలి?

“ఇది నాకు ఎప్పటి నుంచో అనుమానంగానే ఉంది” అన్నాడు విక్రమ్ రావు. ఆయన ఒక అభ్యుదయ ప్రధానమంత్రి. ప్రజాసేవ సంస్కరణలు పేద జనానికి ఉపయోగపడే విధంగా అమలు పరిచే పథకాలతో ప్రభుత్వంలోకి వచ్చినవాడు. త్రివిధ బలాల అధ్యక్షుడు జనరల్ సమర్ సింగ్ అతని ఒకప్పటి క్లాస్‌మేట్ అయినా ఇద్దరికీ అంతులేని రాజకీయ విభేదాలు ఉండేవి.

“విక్రమ్! ఈ సంక్షేమ పథకాలకు ఎక్కువగా బడ్జెట్ ఖర్చు పెట్టడం పనికిమాలిన పని. వ్యాపారవేత్తలకి, పెద్ద పరిశ్రమలకి టాక్సులు తగ్గించి ప్రోత్సాహకాలు ఇస్తే మన ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది. ఆ రకంగా పేదవాళ్లకు కూడా ఎక్కువ ఉద్యోగాలు వస్తాయి. ఇంకా మనం ప్రపంచంలో తిరుగులేని శక్తిగా అవతరించవచ్చు. మిలిటరీకి కాకుండా ఇలాంటి పథకాలకు ఎక్కువ ఖర్చు చేయడం వల్ల దేశం దెబ్బ తింటుంది.” అని వాదించేవాడు సమర్ సింగ్.

“సమర్ ! మనని ఎన్నుకున్నది పేద ప్రజలు. వాళ్లు ముఖ్యం మనకి. మనది ఇప్పటికే చాలా అభివృద్ధి చెందిన రక్షణ వ్యవస్థ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిస్సైల్స్, అణుబాంబులతో సహా అన్నీ ఉన్నాయి మనకి. ఇంకా ఆయుధాలకు ఖర్చు పెట్టడం నాకు ఇష్టం లేదు. ఈ దేశంలో ఇంకా 150 కోట్ల జనాభా ఉన్నది. పేద ప్రజలు ఎక్కువ శాతం మంది ఉన్నారు. వ్యవసాయం వల్ల ఏమీ లాభం రావటం లేదు. ఉద్యోగాలు లేని వాళ్లకు, వయసు మీరిన వాళ్లకు, ఆదాయం లేని వాళ్లనీ ఆదుకునే పథకాలు రచించడంలో తప్పేముంది? దీనివల్ల చాలా మందికి ఉపయోగం.” అని విక్రమ్ రావు వాదించేవాడు.

అయితే గత ఆరు నెలలుగా జనరల్ సమర్ సింగ్ ప్రభుత్వాన్ని మార్చటానికి పథకాలు రచిస్తున్నాడని, దీనికి చైనా లాంటి విదేశాలూ, బడా వ్యాపారవేత్తలు ప్రోత్సహిస్తూ, సాయం చేస్తున్నాని కూడా ఇంటెలిజెన్స్ రిపోర్టులు విక్రమ్ రావుకు వస్తూనే ఉన్నాయి. మిలిటరీలో ఎయిర్ ఫోర్స్‌లో ఇతర కీలక రక్షణ వ్యవస్థలలో అతనికి చాలా మంది అనుకూలంగా ఉన్నారని సమాచారం కూడా విక్రమ్ రావుకి అందింది.

ఈరోజు సాయంత్రం 6:00కి తనకి అత్యంత విధేయులైన ఆఫీసర్లు ఒకరిద్దరూ, తన పార్టీ సభ్యులూ, కొంతమంది మంత్రులూ ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. ఆర్మీ కదలికలు ఎక్కువైనాయి. కొన్ని వందల ట్యాంకర్లు ఆగ్రా -ఢిల్లీ మార్గంలో వస్తున్నాయి. ఆకాశంలో ఎయిర్ ఫోర్స్ జెట్ విమానాలు కదలికలు ఎక్కువైనట్లు గమనించాము.

రక్షణమంత్రి మాత్రం కనబడలేదు. అతను కూడా సమర్ సింగ్ వైపు ఉండి ఉండాలి.

సమయం 8 అవుతుంది. నాలుగు రోజుల క్రితమే విక్రమ్ రావు ఒక నిర్ణయానికి వచ్చాడు.

అతని అంతరంగికులు ఇద్దరు ఆఫీసర్లు ఆ గదిలోనే ఉన్నారు.

“మనం అనుకున్నది నిజమే. సైనిక తిరుగుబాటు జరుగబోతోంది. సైన్యంలో ఎవరూ మనకు అనుకూలంగా లేరు. మిత్ర దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా ఏమీ స్పందించలేదు. వాళ్ల రక్షణమంత్రి సలహాల ప్రకారం మన జనరల్ సమరసింగ్‌ని సస్పెండ్ చేయమని చెప్పారు. ఎలా కుదురుతుంది? అతనికి ఇంకా రెండు సంవత్సరాలు సర్వీస్ ఉంది.సస్పెండ్ చేస్తే ఇంకా తిరుగుబాటు చేయడానికి తగిన ఆధారాలు సృష్టించినట్లు అవుతుంది. ఇలా ఆలోచించాడు విక్రమ్‌రావు. దీన్ని ఎదుర్కోవడానికి ఒకటే మార్గం. ప్రధానమంత్రి ఆఫీస్ కిందనే ఒక రహస్య ద్వారం ఒక న్యూక్లియర్ దాడికి రక్షణగా ఉండే బంకర్‌లోకి మెట్ల మీదుగా కిందకి దిగారు.

“సార్ ఆర్ యు సూర్?” అని అడిగాడు ఒక ఒక అంతరంగికుడు.

“తప్పదు. ఇలాంటి పరిస్థితి కోసమనే నేను కృత్రిమ మేధస్సుతో ఒక కృత్రిమ దాడిని నిర్వహిద్దాం అనుకున్నాను.సమర్ సింగ్‌ను భయపెట్టి వెనక్కి పంపించవచ్చు. ఆ తరువాత మిలిటరీ కోర్టులో అతన్ని ముద్దాయిగా నిలబెట్టొచ్చు”. అండర్ గ్రౌండ్ బంకర్‌లో కంట్రోల్ రూమ్‌లో న్యూక్లియర్ ఎటాక్ అని ఉన్న పెద్ద పానల్ దగ్గర ఎర్రగా మెరుస్తున్నాయి అరచేతి రూపంలో తెరలూ బోర్డులు. దానిమీద తన చేతిని వేసి ఆథరైజేషన్ ఇచ్చాడు ప్రధానమంత్రి రావు. తర్వాత దాంట్లో ఒక స్లాట్లో ఒక వృత్తాకారంలో ఉన్న

**మనం అనుకున్నది నిజమే. సైనిక తిరుగుబాటు జరుగబోతోంది. సైన్యంలో ఎవరూ మనకు అనుకూలంగా లేరు. మిత్ర దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా ఏమీ స్పందించలేదు. వాళ్ల రక్షణమంత్రి సలహాల ప్రకారం మన జనరల్ సమరసింగ్‌ని సస్పెండ్ చేయమని చెప్పారు. ఎలా కుదురుతుంది? అతనికి ఇంకా రెండు సంవత్సరాలు సర్వీస్ ఉంది.సస్పెండ్ చేస్తే ఇంకా తిరుగుబాటు చేయడానికి తగిన ఆధారాలు సృష్టించినట్లు అవుతుంది. ఇలా ఆలోచించాడు విక్రమ్‌రావు.**

ఒక డిస్క్‌ని పెట్టాడు. స్క్రీన్ పాస్వర్డ్ అడిగింది. "సురక్షణ 2041" అనే పాస్వర్డ్ టైప్ చేశాడు.

ఆ తరువాత ఇక పదండి అని వేగంగా వారు పైకి వచ్చి ప్రధానమంత్రి కార్యాలయాన్ని మూసివేసి బయట ఎదురు చూస్తున్న ఒక వాహనంలో ఒక రహస్య మిలిటరీ ఎయిర్ పోర్ట్‌కి వెళ్లిపోయారు. ప్రధానమంత్రి ఎయిర్ ఫోర్స్ వన్ ఆకాశవీధిలో భారతదేశపు దక్షిణం వైపు ఎగిరి వెళ్లిపోయింది.

అక్కడ దేశపు టెక్నాలజికల్ రాజధాని హైదరాబాదులో తనకోసం అక్కడి ముఖ్యమంత్రి అతని పరివారం ఎదురు చూస్తారు. ఈ ఉత్పాతం అయిపోయేదాకా అక్కడే ఉండొచ్చు ఇదే ప్రధాన మంత్రి పథకం.

* * *

8 గంటల 30 నిమిషాలకి ఢిల్లీ ఆగ్రా హైవేలో కనీసం 50 మిలిటరీ ట్యాంకర్లు, వాటిపైన విమానాలు ఆ చుట్టుపక్కల మిషన్ గన్స్ ధరించిన సైనికులు మార్చింగ్ చేస్తూ వస్తున్నారు ఆ లైన్‌కి వెనకాల ఉన్న పెద్ద మిలిటరీ జీప్‌లో జనరల్ సమర్ సింగ్ అతని అసిస్టెంట్ థాపా కూర్చుని ఉన్నారు. "విక్రమ్ ఏమి చేయలేడు.అక్కడికి వెళ్లడం సైన్యాన్ని తనవెంట ఉన్నట్లు, ఆయుధాలు చూపించడం 'నువ్వు మర్యాదగా,శాంతియుతంగా రాజీనామా చేయాల'ని కోరడం ,అతను ఒప్పుకుంటే సరే...లేకపోతే అవినీతి అరోపణలపై బంధించి జైలులో ఉంచి విచారించడం... ఆ తర్వాత మిలటరీ ప్రభుత్వాన్ని డిక్లేర్ చేయడం; జరుగుతుంది. అదీ పథకం. తర్వాత వచ్చే శాంతి భద్రతల సమస్యలు తానే పరిష్కరించు కుంటాడు. విక్రమ్ రావు కేవలం రాజకీయ నాయకుడు.అతనికి యుద్ధం చేసే నేర్పు లేదు. ప్రపంచ దేశాలు ఎక్కడినుంచీ అతనికి సపోర్ట్ లేదు. అనుకున్న ప్రకారం మనం ప్రభుత్వాన్ని ఆక్రమించుకుంటే నేను సుమారు పదిన్నరకు టీవీలలో ప్రకటన చేస్తాను. సైనిక ప్రభుత్వం ఏర్పాటు చేస్తాను. దేశంలో ఒక కొత్త అధ్యాయం మొదలవుతుంది" అన్నాడు సమర్ సింగ్.

"అంతా సక్రమంగా జరుగుతుందని ఆశిద్దాం" అన్నాడు మరొక జనరల్ . అదే సమయంలో నక్కలు ఊళపెట్టినట్లు, గుడ్లగూబ కూసినట్లు సైరన్లు మోగసాగాయి. అందరి సెల్ ఫోన్లలో సందేశాలు రాసాగాయి. "హెచ్చరిక! హెచ్చరిక! హెచ్చరిక! మెసేజ్ ! ఒక అరగంట తర్వాత అణుబాంబులతో నగరం మీద దాడి జరగబోతోంది! ప్రజలందరూ దగ్గర్లో ఉన్న భూమి అడుగున ఉన్న న్యూక్లియర్ బంకంలలో తల దాచుకోవాలి. ఎమర్జెన్సీ! ఎమర్జెన్సీ!

కొన్ని సంవత్సరాల క్రితం ప్రజలందరి మొబైల్ ఫోన్లకి ఎమర్జెన్సీ సందేశాలు ఉండే ఒక ప్రక్రియ చేపట్టారు. దీనివల్ల ఏదైనా ఉపద్రవం జరిగినప్పుడు అందరికీ హెచ్చరిక చేసే సదుపాయం ఉంది. ఇలా

**"సమర్ ! మనని ఎన్నుకున్నది పేద ప్రజలు. వాళ్లు ముఖ్యం మనకి. మనది ఇప్పటికే చాలా అభివృద్ధి చెందిన రక్షణ వ్యవస్థ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిస్సైల్స్, అణుబాంబులతో సహా అన్నీ ఉన్నాయి మనకి. ఇంకా ఆయుధాలకు ఖర్చు పెట్టడం నాకు ఇష్టం లేదు. ఈ దేశంలో ఇంకా 150 కోట్ల జనాభా ఉన్నది. పేద ప్రజలు ఎక్కువ శాతం మంది ఉన్నారు. వ్యవసాయం వల్ల ఏమీ లాభం రావటం లేదు. ఉద్యోగాలు లేని వాళ్లకు, వయసు మీరిన వాళ్లకు, ఆదాయం లేని వాళ్లనీ ఆదుకునే పథకాలు రచించడంలో తప్పేముంది?**



అణుబాంబు దాడికి అరగంట కంటే సమయం లేనప్పుడు ఇలాంటి అత్యవసర సందేశాలు ఆటోమేటిక్‌గా పంపుతారు.

మెల్లగా కదులుతున్న ట్యాంకర్లన్నీ హఠాత్తుగా ఆగిపోయాయి. సమర్ సింగ్ అతని పక్కనున్న జనరల్ థాపా కూడా "ఏం జరుగుతోంది?" అని అరిచారు. కొంతమంది సైనికులు పరిగెత్తుకొని అతని జీపు పక్కనకొచ్చారు అర్జెంటుగా ఢిల్లీ ఆగ్రా హైవేలో ఉన్న 901 బంకర్‌కు మీరు వెళ్లాలి. అంతకంటే మార్గం లేదు. అణుబాంబు దాడులు చాలా అపాయం."

ఎక్కడ ట్యాంకులు అక్కడ ఆగిపోయినాయి. జనరల్ సమర్ సింగ్, మేజర్ జనరల్ థాపా... మోటార్ సైకిళ్లపై వేగంగా వచ్చిన సైనిక రక్షకభటులతో ప్రత్యేకంగా ఆర్మీ అధికారులకు ఏర్పరిచిన న్యూక్లియర్ బంకర్ వైపు వెళ్లిపోయారు.

అరగంట తర్వాత పెద్ద చప్పుడుతో ఢిల్లీ నగరం మీద అణుబాంబులు పడ్డాయి. ఆకాశంలో ఒక నల్లటి మేఘాలు కనబడ్డాయి.

నగరం అంతా చీకటి అయింది. ఆ శబ్దానికి ఢిల్లీ పరిసర ప్రాంతంలో పది కిలోమీటర్ల వరకు ప్రకంపనలు రేగాయి. ఇళ్లు కూలిపోయాయి. పెద్ద పెద్ద బహుళ అంతస్తుల భవనాలు పడిపోయాయి. ఆ మంటల్లో అనేక మంది చనిపోయారు. గాయపడిన వారి అరుపులు, హాహాకారాలు అర్తనాదాలు ఎంతో దూరం వినబడ్డాయి. ఎక్కడికి అక్కడ న్యూక్లియర్ ఫైర్ అలారాలు మోగుతూనే ఉన్నాయి.

ఉత్పాతాలు, విలయాలు అగ్ని ప్రమాదాలు జరిగిపోయాయి. ఇది ఎలా జరిగిందో ఎవరికీ తెలియదు. ఇంటర్నెట్ వ్యవస్థ టెలివిజన్ వ్యవస్థ అంతర్జాతీయంగా సమాచారం ఇచ్చి పుచ్చుకునే వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయి.అది కనీవినీ ఎరుగని ప్రళయం. చాలా తక్కువ మంది సజీవంగా బయటపడ్డారు.

రేడియేషన్ ప్రభావం వల్ల చర్మంపై బొబ్బలు కారణంగా ఆ తర్వాత కూడా వందల మంది చనిపోయారు. నదులు చెరువులు నీళ్లు కలుషితం అయిపోయినాయి. పంటలన్నీ మాడి నల్లటి రంగులోకి మారిపోయాయి. ఈ అణుబాంబులతో దాడి ముందే తెలిసిన బంకర్లలో దాక్కున్న వాళ్లు మాత్రం రక్షణ పొందారు. సమర్ సింగ్ అతని పరివారం అంతా బంకర్‌లలో దాగి ప్రాణాలు రక్షించుకున్నారు. హైదరాబాద్ వెళ్లిన ప్రధాన మంత్రి ఏమయ్యాడో తెలియదు.

దక్షిణాదిలోని అన్ని నగరాలు కూడా దెబ్బతిన్నాయి. డజన్లకొద్దీ విస్ఫోటనాల తరువాత, 15 రోజులు 20 రోజులకి దోపిడీ దొంగలు, ఆయుధాలు, రేడియేషన్ రక్షణ సూట్‌లు ధరించిన కొంతమంది సైనిక మూకలు ఆహారం కోసం, డబ్బులు కోసం దోపిడీలు దాడులు మొదలు పెట్టాయి. దేశంలో ఒక్కొక్క ప్రాంతం వివిధ రౌడీ మూకల కింద చేరిపోయింది. ఎవరు బలవంతుడు అయితే వారిని వార్ లార్డ్స్ అంటారు. ఒకొక్కచోట ఒక వార్ లార్డ్ పరిపాలించాడు. అరాచకం మొదలైంది. అంతర్జాతీయంగా ఎక్కడేమి జరుగుతుందో తెలియడంలేదు. కానీ ప్రపంచంలో చాలా వరకు దేశాలు నాశనమై కృత్రిమ మేధ నడిపే వ్యవస్థ తప్ప మిగతావన్నీ నశించిపోయాయని అనుకున్నారు. అది ఒక వినాశన కాలం. విధ్వంసానంతర ప్రపంచం.

సైన్యాన్ని భయపెట్టడానికి తిరుగుబాటు అణచడానికి, ఒక "ఫాల్స్ అలారం"(తప్పు హెచ్చరిక) సృష్టించడానికి, విక్రమ్ రావు చేసిన పని వల్ల కావచ్చు లేదా ఆ సిగ్నల్ వల్ల ఇతర దేశాల్లో చైనా, పాకిస్తాన్ వాటిలోని కృత్రిమ మేధ పొరపాటుగా రియాక్ట్ అయ్యి వాటిని చూసి చైనా పాకిస్తాన్లు ఏదో దాడి చేస్తున్నాయని భయంతో మరికొన్ని దేశాలు అమెరికా, బ్రిటన్, రష్యా, చైనా ఆస్ట్రేలియా, లాంటి దేశాల నుంచి అణుబాంబులతో కృత్రిమ మేధ ఆటోమేటిక్‌గా చేసిన మిస్సైల్ గొలును కట్టుదాడుల వల్ల ప్రపంచమంతా నాశనం అయ్యి ఉండవచ్చు. ఎవరూ చెప్పలేకపోయారు.

కానీ ఒక దీర్ఘ కాలపు "న్యూక్లియర్ వింటర్" మొదలయింది. వాతావరణం శీతలమై పోవటం.

వానలు విఫలమై, అణుధార్మికత వల్ల తరచూ ఆమ్లవర్షాలు (అంటే ఏసిడ్ రెయిన్) కురవడం, పంటలు నాశనం అయిపోవడం, నెలల తరబడి కారు మబ్బులు కప్పుకొని ఉండటం అదే అణు ధార్మికత వల్ల దీర్ఘకాలంగా శీతలకాలం ఏర్పడటం.

న్యూక్లియర్ వింటర్. ఒక అరాచకం, భయం కరమైన మూకల దాడులు, ఆహారం నీరు కోసం కూడా పోరాటాలు సాధారణం అయిపోయాయి. ఇలా ఆరు నెలలు జరిగింది. అయితే ఈ విషయాలు ఏవీ ప్రియా, రాజ్‌లకి తెలియదు. అడవిలో ప్రియా, రాజ్, గెస్ట్ హౌస్‌లోనే చాలా రోజుల బాటు తలదాచు కున్నారు. పగటిపూట రోడ్లమీద నడుస్తూ దగ్గర గ్రామాలలోని షాపులలో, ఇళ్లలో ఆహారం నీరు కోసం వెదుకుతూ దొరికినవి తెచ్చుకుని ప్రాణాలు రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రియా మాత్రం తన గతాన్ని రహస్యంగానే దాచుకుంది. తన బ్యాగ్‌లోని వృత్తాకార పరికరం రాజ్‌కి కనపడకుండా జాగ్రత్త పడుతోంది.

ఢిల్లీకి రుషికేశ్ కి మధ్య మార్గంలో హైవేకి 40 కిలోమీటర్ల దూరంలో ఉందా గ్రామం. అది వారు దిగిన అడవిలోని గెస్ట్‌హౌస్‌కి దగ్గరగా ఉంది. న్యూక్లియర్ దాడి జరిగిన ఈ ఆరు ఏడు నెలల్లోనూ ప్రియా రాజ్ రెండు రోజులకు ఒకసారి ఆ గ్రామానికి వెళ్లటం, దొరికిన ఆహారం, నీళ్లు తెచ్చుకోవడం ఒకరోజు మరో గ్రామంలో పూర్తిగా నిర్మానుష్యమైన ఇళ్ల మధ్య ఒకే ఒక్క గ్రామీణ హాస్పిటల్ కనిపించింది. అక్కడ గాయాలతో, ఒంటినిండా బొబ్బలతో జ్వరంతో మూలుగుతున్న ఒక మధ్య వయస్కుడు కనిపించాడు. అతడు ఒక డాక్టర్. అణుదాడులు జరిగిన తర్వాత కూడా గాయాలతోనూ, రేడియేషన్ సిక్నెస్‌తో వచ్చిన వారికి సేవలు చేసి ఇక్కడే ఉండి పోయానని చెప్పాడు. క్రమంగా అతనికీ రేడియేషన్ జ్వరం వచ్చింది. గ్రామస్తులలో కొందమంది సురక్షితంగా ఉన్న దక్షిణాపథం వైపు, మరికొందరు ఎక్కడ ఆసరా దొరికితే అక్కడికి, వెళ్ల గలిగిన సామాన్లతో వెళ్లిపోయారు. అప్పుడప్పుడు ఢిల్లీ నుంచి సమర్ సింగ్ సైనికులు దాడి చేస్తున్నారు. వారే కాకుండా ఇతర బందిపోటు దొంగలు ముఠాలు దోపిడీ చేసుకునేవారు, గూండాలు పట్టణాలనీ నగరాలనీ దోచుకుని, ఆహారపదార్థాలను, నీటి సీసాలు, ఇతర మందుల్ని దొరికినవి దొరికినట్టే తీసుకొని పోతున్నారు.

అతని పరిస్థితి చూస్తే జాలి వేసింది. ఆ క్లినిక్ లో దొరికిన బ్యాండేజ్ గుడ్డలతో మందులతో అతనికి కట్లు కట్టి, నీరు, ఏంటీ బయోటిక్స్ మందులు ఇచ్చి సేవ చేశారు. గుప్తా అనే ఆయన కొనఊపిరితో ఉన్నాడు. కొంచెం కళ్లు తెరిచి చూసి ప్రియా వంకే చూడడసాగాడు.

హీనమైన స్వరంతో చెప్పాడు. "జనరల్ సమర్ సింగ్ సైనికులు నీ ఫోటోని అందరికీ చూపిస్తూ ఈమె ఎక్కడైనా కనిపించిందా అని అడుగుతున్నారు. ఢిల్లీలో రేడియేషన్ ప్రభావం తట్టుకోవడానికి భూగర్భంలో ఒక పెద్ద బంకర్లు నిండిన నగరాన్ని సమరసింగ్ నిర్మించాడు. అతనికి అక్కడి నుంచి పరిపాలన సాధ్యమవుతోంది. ఇతర దేశాల వారూ అతనికి సహాయం చేస్తున్నారు. అయితే అతనికి ఢిల్లీ చుట్టుపక్కల తప్ప దేశం మొత్తంమీద అధికారం లేదు. దేశంలో అరాచకం పేరుకుపోయింది. ఒక రాష్ట్రం, నగరం అని లేకుండా వివిధ ప్రాంతాల్లో గూండాలు మాఫియాలు పరిపాలిస్తున్నారు. నీ గురించే జనరల్ సమర్ సింగ్ ఎందుకు వెదుకుతున్నాడో అర్థం కావటం లేదు." అలా చెప్తుండగానే అతని ప్రాణం పోయింది.

**కాసేపు మౌనంగా నిలబడ్డారు రాజ్, ప్రియా. దగ్గరగా దొరికిన బెడ్ షీట్లతో అతని భౌతికకాయాన్ని చుట్టి ఊరి బయట శ్మశానానికి తరలించారు. అంత నిర్మానుష్యంగా ఉంది. శవాలను పూడ్చిపెట్టడానికి కూడా మనుషులు, ఏర్పాట్లు లేవు. ఇద్దరూ కలసి గొయ్యి తవ్వి తీసి ఖననం చేయడానికి ఎంతో సమయం పట్టింది.**

కాసేపు మౌనంగా నిలబడ్డారు రాజ్, ప్రియా. దగ్గరగా దొరికిన బెడ్ షీట్లతో అతని భౌతికకాయాన్ని చుట్టి ఊరి బయట శ్మశానానికి తరలించారు. అంత నిర్మానుష్యంగా ఉంది. శవాలను పూడ్చిపెట్టడానికి కూడా మనుషులు, ఏర్పాట్లు లేవు. ఇద్దరూ కలసి గొయ్యి తవ్వి తీసి ఖననం చేయడానికి ఎంతో సమయం పట్టింది.

రాజ్ అన్నాడు. "ప్రియా! ఇప్పటికైనా చెప్పు! నువ్వు ఎవరివి? నీకోసం సమర్ సింగ్ మనుషులు ఎందుకు వెతుకుతున్నారు?"

"చెప్తాను అంతా. మన గెస్ట్‌హౌస్ కి చేరదాం.

పాడుపడిన షాపుల పక్కనే, దోపిడీ జరిగిన సూపర్ మార్కెట్ ఒకటి ఉంది. ఇంకా దాంట్లో కొన్ని పదార్థాలు మిగిలే వున్నాయి. కొన్ని బ్రెడ్ ప్యాకెట్‌లు, నీటి సీసాలు, కొంత బియ్యం తీసుకుని ఫారెస్ట్ గెస్ట్ హౌస్ వైపు దారి తీశారు.

దూరంగా మోటార్ సైకిల్ శబ్దాలు వినబడ సాగాయి. రోడ్డు పక్క ఉన్న ఒక పాడుపడిన ఇంట్లో దాక్కొని కిటికీలోంచి బయటకు చూశారు. ఆలివ్ గ్రీన్ యూనిఫాంలో రేడియేషన్ సూట్లు ధరించి మిషన్ గన్లతో ముగ్గురు సైనికులు మోటార్ సైకిళ్ల గ్రామం మధ్య ఆపి చుట్టూ చూడసాగారు.

వారిలో ఒకడు మెగాఫోన్‌తో ప్రకటన చేయసాగాడు.

"మీ గ్రామస్తులకి ఒక హెచ్చరిక. ఇది ఎమర్జెన్సీ. ఎవరి బాగోగులు వారే చూసుకోవాలి. త్వరలో పరిస్థితులు బాగుపడి ప్రభుత్వం మీకు సహాయం చేయడానికి వస్తుంది. అయితే ప్రియారావు అనే యువతి గురించి తెలిస్తే, ఫోన్ ద్వారా కానీ, వ్యక్తి గతంగా గాని మాకు సమాచారం ఇవ్వాలి. అందుకు మంచి బహుమతి ఉంటుంది." అన్నది ఆ ప్రకటన సారం.

వాళ్లు ఒక అరగంట వరకు గ్రామమంతా కలయ తిరుగుతూనే ఉన్నారు. మొరిగే రెండు కుక్కలూ, దిక్కుతోచకుండా తిరుగుతున్న చిక్కిపోయిన ఆవులూ తప్ప గ్రామం అంతా నిశ్శబ్దంగా ఉంది.

"ఎవరూ లేరు. పోదాం. పదండి. గ్రామంలో అందరూ చనిపోయి నట్లున్నారు."

మోటార్ సైకిల్ శబ్దం క్రమంగా దూరమైంది. రాజ్ ప్రియా మధ్య నిశ్శబ్దం. 10 నిమిషాలు.

"ఇప్పుడైనా చెప్పు ప్రియా! ఎవరు నువ్వు?"

"ఓకే! రాజ్.! ప్రస్తుతం ఈ ప్రపంచంలో నువ్వు తప్ప నాకు ఎవరూ లేరు. నిజం చెప్తాను. నేను ప్రధానమంత్రి విక్రమ్ రావు కుమార్తెని. నేను వీకెండ్ హాలిడేకి నీతో బయలుదేరి వచ్చేముందు ఆయన నాకు ఎంతో జాగ్రత్తలు చెప్పారు. నాకెప్పుడూ నా స్నేహితులతో తిరిగే స్వతంత్రం ఇచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం చాలా భయంతో ఉన్నట్టు కనిపించారు. 'జాగ్రత్త అమ్మా. నీ బాయ్ ఫ్రెండ్‌కి కూడా నువ్వు ఎవరో తెలియజేయొద్దు' అని చెప్పారు. అదే సమయంలో ఆయన నాకు ఒక ఎలక్ట్రానిక్ పరికరం అనుకుంటాను ఇచ్చారు దాని పాస్వర్డ్ నాకు తెలుసు కానీ దాన్ని ఎలా ఉపయోగించాలో తెలియదు. జరిగిన ఈ అణుదాడి, దానికి సంబంధం ఏదో ఉండి ఉంటుంది. నన్ను రక్షించడం కోసమే ఆయన ఇది నాకు ఇచ్చి ఉంటారు. దాని ఉపయోగమేమిటో అర్థం కాలేదు.

నువ్వు సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడివి కాబట్టి నీకు ఏమైనా తెలుస్తుందేమో. ముందు మనం అడవిలోని గెస్ట్‌హౌస్‌కి వెళ్లి ప్రయత్నిద్దాం."

రాజ్ ఆశ్చర్యానికి అంతులేదు. అతను తల పట్టుకుని ఓ అని చప్పుడు చేశాడు.

"ప్రియా నువ్వు నన్ను కూడా కూడా నమ్మలేదా! ఇప్పటికీ ఆరు నెలలు వృథా అయిపోయింది. ఏది పరికరం చూద్దాం!"

"సాయంత్రం అయిపోయింది. మనం అడవికి చేరిపోయేసరికి చీకటి పడిపోతుంది. అక్కడ చూద్దాం దీని సంగతి." అన్నది ప్రియా.

**మిగతా వచ్చేవారం..**



**భారత టెన్నిస్ ఆటగాడు రోహన్ బొపన్న చరిత్ర సృష్టించాడు. ప్రతిభకు అంకితభావాన్ని, శారీరక పటుత్వాన్ని జోడిస్తే సాధించలేనిది ఏమీలేదని చాటి చెప్పాడు. 43 సంవత్సరాల 335 రోజుల వయసులో గ్రాండ్ స్లామ్ డబుల్స్ టైటిల్ నెగ్గిన ఒకే ఒక్కడిగా నిలిచాడు.కాలిమడమ, మోకాలి నొప్పులతో మూడేళ్ల క్రితమే టెన్నిస్ జీవితానికి స్వస్తి పలకాలని భావించిన అతను యోగాను తనజీవితంలో ఓ భాగంగా చేసుకోడం ద్వారా అనూహ్యమైన ఫలితాలు సాధించగలిగాడు.**

# యోగాతో రోహన్‌కు టెన్నిస్ 'మహాయోగం'!

మంచి వయసులోనే ఏదైనా సాధించ గలమనే భావనకు కాలం చెల్లింది. మనసుండాలే కానీ వయసు మీరినా అసాధారణ లక్ష్యాలు సాధించగలమని పలువురు క్రీడా దిగ్గజాలు చాటి చెబుతూనే ఉన్నాయి. దానికి రాయల్ గేమ్ టెన్నిస్‌లో భారత డబుల్స్ స్టార్ రోహన్ బొపన్న వారిలో ఒకరు. ఇతర ఆటగాళ్లంతా విశ్రాంతి జీవితాన్ని ఆస్వాదిస్తుంటే..రోహన్ మాత్రం ఆట పట్ల పిచ్చి ప్రేమ, ఇంకా..ఇంకా ఏదో సాధించాలన్న తపనతో కొనసాగుతూ మరెవ్వరికీ సాధ్యంకాని రికార్డులు తన పేరుతో లిఖించుకొన్నాడు.

పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్- మహేశ్ భూపతి గ్రాండ్ స్లామ్ టైటిల్స్ నెగ్గగా... ఆ తర్వాత గ్రాండ్ స్లామ్ టైటిల్ విజేతగా నిలిచిన మొనగాడిగా రోహన్ రికార్డుల్లో చేరాడు. ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ వేదికగా ముగిసిన 2024 గ్రాండ్ స్లామ్ సీజన్ తొలి టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో మాథ్యూ ఇబిడెన్‌తో జంటగా విజేతగా నిలిచాడు. ఈ జంట 7-6, 7-5తో ఇటాలియన్ జోడీ సిమోన్ బొలెల్లీ- యాండ్రియా వావాసోర్రీ జోడీని అధిగమించింది. తన టెన్నిస్ జీవితంలో ఇప్పటి వరకూ మిక్సిడ్ డబుల్స్ టైటిల్స్ సాధించిన రోహన్‌కు ఇదే డబుల్స్ టైటిల్. ఈ విజయంతో రోహన్ జోడీకి 2,497,827 ఆస్ట్రేలియన్ డాలర్ల ప్రైజ్ మనీ దక్కింది. రోహన్ వాటాగా కోటి 92 లక్షల రూపాయలకు పైగా అందనుంది.

**టెన్నిస్ చరిత్రలో ఒకే ఒక్కడు.....**

గత 21 సంవత్సరాలుగా భారత టెన్నిస్ కు అసమాన సేవలు అందిస్తూ వచ్చిన రోహన్ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన గ్రాండ్ స్లామ్ (అమెరికన్, ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్) టెన్నిస్ చరిత్రలో అనితర సాధ్యమైన రికార్డులు నెలకొల్పాడు.

**లేటు వయసులో ప్రపంచ 'నంబర్ వన్'!**

టెన్నిస్ క్రీడాకారులు సాధారణంగా మంచి వయసులో ఉన్నప్పుడే ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ కు చేరుకోగలుగుతారు. అయితే అందుకు భిన్నంగా రోహన్ లేటు వయసులో టాప్ ర్యాంక్ కైవసం చేసుకోగలిగాడు. ప్రస్తుత సీజన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్స్‌కు చేరడం ద్వారా నంబర్ వన్ ర్యాంక్ కైవసం చేసుకొన్నాడు. పట్టువీడకుండా పాల్గొంటూ వస్తున్న రోహన్ తన 17వ ప్రయత్నంలో కానీ సెమీఫైనల్స్ చేరుకోలేక పోయాడు. 2023-అమెరికన్ ఓపెన్ డబుల్స్ ఫైనల్స్ చేరడం ద్వారా... అత్యంత పెద్దవయసులో ఓ గ్రాండ్ స్లామ్ టోర్నీ ఫైనల్స్ చేరిన తొలి ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పిన కొద్ది మాసాల వ్యవధిలోనే ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సైతం సాధించి చరిత్ర సృష్టించగలిగాడు.

**రాజీవ్ రామ్ ను మించిన రోహన్...**

అమెరికాలోని భారత సంతతి డబుల్స్ ప్లేయర్ రాజీవ్ రామ్ 2022 సీజన్లో తన 38వ ఏట ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడైన ఆటగాడిగా నెలకొల్పిన రికార్డును 43 సంవత్సరాల వయసులో అధిగమించడం ద్వారా రోహన్ బొపన్న సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

అంతేకాదు... డబుల్స్‌లో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ సాధించిన నాలుగో భారత ప్లేయర్ ఘనతను సాధించాడు. 1999లో లియాండర్ పేస్, మహేశ్ భూపతి జోడీ, 2015లో సానియా మీర్జాల తరువాత టాప్ ర్యాంక్ సాధించిన భారత టెన్నిస్ ప్లేయర్‌గా రోహన్ నిలిచాడు.

**డేవిస్ కప్ లోనూ రోహన్ రికార్డు....**

ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ డేవిస్ కప్‌లోనూ రోహన్ చరిత్ర సృష్టించాడు. 22 ఏళ్ల వయసులో భారత డేవిస్ కప్ జట్టులో సభ్యుడిగా తొలి మ్యాచ్ నుంచి 2023 సీజన్ వరకూ మొత్తం 32మ్యాచ్‌లు ఆడాడు. డేవిస్ కప్ కెరియర్‌లో 32 సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు ఆడి 12 సింగిల్స్, 10 డబుల్స్ విజయాలు సాధించాడు.

కెనడా ఆటగాడు డేనియల్ నెస్టర్ 42 సంవత్సరాల వయసులో సిన్ సినాటీమాస్టర్స్ టైటిల్ నెగ్గిన అత్యధిక వయసు కలిగిన ఆటగాడిగా నెలకొల్పిన రికార్డును. 43 సంవత్సరాల వయసులో ఇండియన్ వెల్స్ ఏటీపీ టూర్ మాస్టర్స్ టైటిల్ నెగ్గడం ద్వారా రోహన్ బొపన్న తెరమరుగు చేశాడు.

శారీరక పటుత్వంతో పాటు ఏకాగ్రత, స్థిరచిత్తాన్ని పెంపొందించుకోగలిగాడు. గత మూడు సంవత్సరాలుగా తాను నిలకడగా రాణిస్తూ రావడానికి, అంచనాలకు మించి విజయాలు, రికార్డులు, ఘనతలు సాధించడానికి కేవలం యోగానే కారణమని, యోగా శక్తి, మహిమ అంతా ఇంతా కాదని రోహన్ సగర్వాంగా ప్రకటించాడు. రంగం ఏదైనా లక్ష్యాలు సాధించాలన్నా, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నా మనసుండాలే కానీ వయసు ఏమాత్రం అవరోధం కాదనటానికి తాజా నిదర్శనమే పద్మశ్రీ రోహన్ బొపన్న. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# బాలికల సాధికారత కోసం రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్

సమాజసేవ, సమాజహితం కోసం 1989 సంవత్సరంలో ఏర్పడ్డ లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థ 'సేవాభారతి'. ఏర్పడ్డ(ఆవిర్భవ) నాటినుండి సంస్థ 1750 పై చిలుకు సేవా కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, పరిసర ప్రాంతాలలో గల బస్తీలలో నిర్వహించే అనేకానేక సేవా కార్యక్రమాల ద్వారా అక్కడి కుటుంబాల ఆర్థిక, స్థితిగతులు, ప్రత్యేకించి బాలికల విద్య,ఆరోగ్యం, జీవనశైలి, వివాహ, ఉద్యోగ విషయాలలో అవగాహనారాహిత్యం, నిర్లక్ష్యం, నిరాదరణలు వెలుగులోకి వచ్చాయి.ఈ పరిస్థితులు సంస్థ సభ్యులను ఆలోచింపజేశాయి.




ఆలోచనలతో సరిపెట్టుకోకుండా పరిష్కారం దిశగా జరిగిన గట్టి ప్రయత్న ఫలితంగా రూపుదిద్దుకున్న కార్యక్రమమే 'కిశోరి వికాస కేంద్రా'ల స్థాపన. ఇందులో భాగంగా 10 నుండి 16 సంవత్సరాల బాలికల సమగ్ర వికాసం కొరకు– చదువు, ఆరోగ్యం, ఆత్మరక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్వావలంబన పై అవగాహన, శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. 2004లో కొద్దిమందితో మొదలైన ఈ కేంద్రాలు నేడు 350 కేంద్రాలకు పైగా వృద్ధి చెంది, ఇందులో పదివేల మందికి పైగా శిక్షణ పొందుతున్నారు.

సంపూర్ణమైన మార్పు దిశగా నడిచే ఏ కార్యక్రమమైనా, ఒక వ్యక్తి, కుటుంబ, లేదా సంస్థ ద్వారా మాత్రమే సాధ్యం కాదు గనుక, బాలికల సంపూర్ణ ,సమగ్ర వికాసం కోసం జరిగే ఈ మహత్తర కార్యక్రమంలో సమాజాన్ని సమ్మిళితం చేయాలని సంస్థ సంకల్పించింది. ఈ ప్రయత్నంలో భాగంగా సామాజిక సేవ, ఫిట్నెస్‌ను కలిపి ఒక వినూత్న కార్యక్రమనికి 2017లో శ్రీకారం చుట్టారు అదే RUN FOR A GIRL CHILD 'పాపకోసం పరుగు'. 2017లో మొదలై ఎంతో ప్రజాదరణ పొంది, ప్రతి సంవత్సరం ఈ పరుగు నిర్విరామంగా, నిరాటంకంగా 8 సంవత్సరాలుగా కొనసాగుతోంది. సమాజం కూడా బాలికల ఉన్నతిని ఆకాంక్షిస్తోంది అనడానికి ఈ సంవత్సరం జరిగిన పరుగు కార్యక్రమంలో 10,394మంది పాల్గొనడమే నిదర్శనం. ఈ కార్యక్రమంలో 5 సంవత్సరాల వయసు నుండి 60 సంవత్సరాల పైబడిన వారివరకు పాల్గొనటం ఒక విశేషం.

**కార్యక్రమ వివరణ:** ఈ సంవత్సరం 11/02/24 న RUN FOR A GIRL CHILD నిర్వహించారు. ప్రతి ఏడాది పరుగు 21,10, 5 కిలోమీటర్లనే 3 విభాగాలుగా నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులు ముందుగా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి వారి పేర్లు నమోదు చేసుకుంటారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ టీ షర్ట్,బిబ్ (గుర్తింపు సంఖ్య)ను 2 రోజులపాటు (శుక్ర, శనివారాలు) కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లో ఇవ్వటం జరిగింది. వితరణ కార్యక్రమం తరువాత రన్‌లో పాల్గొనే వారందరూ ఆదివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియంకి చేరుకొని కార్యక్రమంలో పాల్గొన్నారు. 21 కి మీ విభాగం వారు 6 గంటలకు, 10 కి మీ విభాగంవారు 6.30 గం.లకు, 5 కి మీ విభాగం వారు 7 గం.ల గం.లకు వార్మ్ అప్,జాతీయగీతం ముగిసిన తరువాత పరుగు మొదలు పెట్టారు. తెల్లవారు ఝామునే అనేకమంది విద్యార్థులు ప్రేరణ ఇస్తుండగా కొన్ని వేలమందితో పచ్చని చెట్ల మధ్యలో పరుగు పెట్టడం ఒక అద్భుతమైన అనుభూతి కలిగించిందని ఇందులో పాల్గొన్నవారందరు అన్నారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళసై సౌందరరాజన్ ప్రత్యేక అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలు కుటుంబానికి భారంకాదు ఒక వరం, వారు పుట్టడం గర్వకారణమని అందరూ గుర్తుంచుకో వాలని అన్నారు. బాలికల సంరక్షణ ఒక సామాజిక అవసరంగా, వారి సాధికారత



భరత మాత సేవగా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కలిగించటం, కిశోరీ వికాస్ లాంటి కార్యక్రమాలద్వారా బస్తీలలో ఆడపిల్లలు సాధికారత సాధించే దిశగా సేవాభారతి సంస్థ చేస్తున్న అనేక కార్యక్రమాలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ సేవాభారతి ట్రస్టీ భానుమతి, ఫ్రీడమ్ ఆయిల్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, గ్లోబల్ డేటా మేనేజింగ్ డైరెక్టర్ – భారత్ ఆపరేషన్స్ హెడ్ రాహుల్ భాటియా, సేవాభారతి తెలంగాణా అధ్యక్షులు దుర్గారెడ్డి సహా అనేక IT సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంఘే శక్తి: కలౌయుగే అనే సూత్రానికి సమానంగా 'సంఘ శక్తి కలయికే' అన్నట్టుగా ఈ కార్యక్రమంలో అనేకమంది విద్యార్థులు, ఉద్యోగస్తులు, మహిళలు, కిశోరీలు వ్యక్తిగతంగానూ, అనేక సంస్థల తరుపున సుమారుగా 500మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి సహకారం అందించటం ఒక ప్రత్యేకమైన విశేషం.

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో పరుగు నిర్వహించడానికి సానుకూల పరిస్థితులు లేవు. ఆ సమయంలో community run అన్న వినూత్న ఆలోచనలకు రూపకల్పన చేసి పరుగు సాధ్యం చేశారు సంస్థ సభ్యులు. Gated communityలలో ప్రత్యేకంగా పరుగు నిర్వహించి సమాజానికి మరింత దగ్గరగా పరుగు కార్యక్రమాన్ని తెచ్చారు. కొవిడ్/కరోనా సమయంలో ప్రయోగాత్మకంగా మొదలైన ఈ పరుగు, 100కు పైగా community లను ఈ కార్యక్రమానికి దగ్గర చేసింది.

ప్రతి కమ్యూనిటీలో 200మందికి పైగా పరుగులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కమ్యూనిటీ, వారి దగ్గరలో ఉండే బస్తీలో కిశోరీ వికాస్ బాధ్యతను తీసుకొనేలా అవగాహన తీసుకు రావడం ఈ కమ్యూనిటీ రన్ ప్రధాన ఉద్దేశం.

ఈ రన్ ఫర్ ఆ గర్ల్ చైల్డ్ అనే కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో కిశోరి వికాస కేంద్రాలను 500 వందల బస్తీలకు విస్తరించి, తద్వారా లక్షమంది బాలికలకు శిక్షణ ఇవ్వాలన్న అకుంఠిత దీక్షతో సేవాభారతి సంస్థ పనిచేస్తోంది.

# అభయాంజనేయ స్వామి ఏకశిలా విగ్రహ ప్రతిష్ఠ

**నల్లగొండ:** తెలంగాణలోనే కనీవినీ ఎరుగని రీతిలో గర్భగుడిలో18అడుగుల అతిపెద్ద అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని నల్గొండ పట్టణం పాతబస్తీ హనుమాన్‌నగర్ దేవాలయంలో ఫిబ్రవరి 11న ప్రతిష్ఠాపన చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, ఆ రోజు చాలా శుభదినమని, 48 సంవత్సరాల హిందువుల పోరాటాల ఫలితంగా కేసులు, జైలు శిక్ష భరించి, చేసిన త్యాగాల ఫలితంగా మనం 18 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసుకున్నామని అన్నారు. అయోధ్యలో



బాలరాముని ప్రాణప్రతిష్ఠ జరిగిన నెలరోజుల వ్యవధి లోనే నల్లగొండలో 18 అడుగుల అభయాంజనేయ స్వామి ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసుకోవడం చాలా సంతోష మంటూ, ఈ దేవాలయ నిర్మాణానికి అన్ని రకాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియ జేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరిచందన, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విగ్రహ దాతగా ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను, దేవాలయానికి అవసరమైతే ఇంకా నా సహకారాలు అందిస్తా'నని అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన చేసుకున్నందుకు భక్తులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ శాశ్వత అధ్యక్షులు వేనేపల్లి



లక్ష్మణరావు, అధ్యక్షులు బైరగొని రాజయ్య, ఉపాధ్యక్షులు విరెల్లి చంద్రశేఖర్, ఇటికాల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి బండారు ప్రసాద్, గౌరవ సలహా దారులు కంది సూర్యనారాయణ, గార్లపాటి వెంకటయ్య, నన్నూరి రామిరెడ్డి, కోశాధికారి చింత హరిప్రసాద్, కార్యదర్శులు గుండెబోయిన వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సతీష్, సురిగిల్ల యాదగిరి,



ఊటకూరి శ్రీనివాస్, కస్పరాజు వెంకన్న, గుండె బోయిన శేఖర్, గుండెబోయిన మల్లయ్య, కౌన్సిలర్ అభిమన్య శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు, నల్గొండ ప్రజలు పాల్గొన్నారు.

# నారీశక్తి సమ్మేళనాలు





**భాగ్యనగర్:** నారాయణగుడలోని కేశవమెమోరియల్ కళాశాలలో ఫిబ్రవరి 11న జరిగిన మహిళా శక్తి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎండీ సరోజా వివేక్, గౌరవ అతిథిగా కుమారి నయన జైస్వాల్, వక్తగా రాష్ట్ర సేవికా సమితి అఖిల భారతీయ కార్యకారిణిసభ్యులు భాగ్యశ్రీసాఠె తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 731మంది మహిళలు పాల్గొన్నారు.





**కరీనగర్:** కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లిలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మహిళాశక్తి సమ్మేళనం ఫిబ్రవరి 11న జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త మాధవీలత మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నారంటూ, ప్రధానంగా ప్రాచీన కాలంలో పురుషులతో సమానస్థాయి కలిగిఉన్న మహిళలను మధ్యయుగంలో అధమస్థాయికి అణచివేశారన్నారు. ఇందులో 700మంది మహిళలు పాల్గొన్నారు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## కోనేటి రాయలస్వామి ఆలయం కీలపట్ల



ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, పలమనేరు మండలం కీలపట్ల గ్రామంలోని కొలువైన వేంకటేశ్వర స్వామి దేవాలయమిది. వేంకటేశ్వరుడు తన పవిత్ర పాదాలను కీలపట్లలో ఉంచి, ఆపై తిరుమలకు చేరుకున్నారని స్థానికుల విశ్వాసం. ఏటా వైకుంఠ ఏకాదశి, రథ సప్తమి రోజున స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆ రోజుల్లో భక్తులు భారీగా తరలివస్తారు.

## కథ | 'అబద్ధం' చెప్పకూడదు!

అనగనగా ఒక ఊరిలో రంగారావు అనే ఒక ఆసామి ఉండేవాడు.

ఆయనకు ఒకసారి బాగా జబ్బు చేసింది. తన కుమారుడైన రాముని పిలిచి, "జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పనని నాకు ప్రమాణం చెయ్యి" అని అడిగాడు.

అందుకు సరేనని చెప్పిన రాము తన తండ్రి చేతిలో చెయ్యి వేసి ప్రమాణం చేశాడు.

ఒకరోజు రాము అడవి మార్గాన పట్టణానికి వెళుతూండగా దొపిడీ దొంగలు అతడిని చుట్టు ముట్టారు.

వారిలో ఒకడు "నీ దగ్గరేం ఉన్నాయి?" అని అడిగాడు.

"నా దగ్గర యాభై రూపాయలున్నాయి" అని చెప్పాడు రాము.

దొంగలు అతని జేబులన్నీ వెతికారు. కానీ ఏమీ దొరకలేదు. వాళ్లు మారు మాట్లాడకుండా వెళ్లిపోబోతుంటే, వెనక్కి పిలిచి, "నా దగ్గర నిజంగానే యాభై రూపాయలు ఉన్నాయి. ఆ నోటుని నేను



## పద్యము

ఆచార్యున కెదిరింపకు
బ్రోచిన దొర నిందసేయఁ బోకుము కార్యా
లోచనము లొంటిఁజేయకు
మాచారము విడువఁబోకుమయ్య కుమారా!

భావం : ఓ కుమారా! ఉపాధ్యాయుని ఎదురింపవలదు. నిన్నుగాపాడిన వారి తిట్టవద్దు. ఏదయినా ఆలోచనను చేయుటలో ఒంటరిగా జేయవద్దు. మంచి నడవడి వదిలిపెట్టవద్దు.

## శ్లోకము

సుపుత్రః కుల దీపకః

'ప్రదోషే దీపకశ్చంద్రః ప్రభాతే దీపకో రవిః
త్రైలోక్యే దీపకో ధర్మః సుపుత్రః కుల దీపకః'

భావం: రాత్రిళ్లు చంద్రుడు,పగటి వేళ సూర్యుడు దీపాలై వెలుగును పంచుతారు. ధర్మం ముల్లోకాలకు జ్యోతియై నిలుస్తుంది. అలాగే ఏడేడు తరాల ఉద్ధారకుడు సుపుత్రుడే.


## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| కబడ్డీ | పదకొండు |
| క్రికెట్ | ఇద్దరు/నలుగురు |
| చదరంగం | ఏడుగురు |
| బ్యాడ్మింటన్ | తొమ్మిది |
| ఖో-ఖో | ఇద్దరు |

జవాబులు : కబడ్డీ–ఏడుగురు, క్రికెట్–పదకొండు, చదరంగం–ఇద్దరు, బ్యాడ్మింటన్–ఇద్దరు/నలుగురు, ఖో–ఖో–తొమ్మిది.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు



### సర్దార్ వేదరత్నం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. ఫిబ్రవరి 25, 1897న తమిళనాడులోని వేదారణ్యంలో జన్మించారు. 1930లో సి. రాజగోపాలాచారితో కలిసి వేదారణ్యంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయనకు 'సర్దార్' అనే బిరుదును ఇచ్చారు. ప్రజల్ని చైతన్యపరిచేందుకు వేదరత్నం ఎన్నో వీరోచిత రచనలు కూడా చేశారు. ఆగస్టు 24, 1961 తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. ఇనుప వస్తువును సైతం తిని అరిగించుకోగల జంతువు ఏది?
2. గంగానదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
3. వైట్ కోల్ అని దేనిని పిలుస్తారు?

సమాధానాలు : 1. మొసలి 2. పద్మావతి 3. వజ్రం

## మెదడుకు మేత



పచ్చని దుప్పటి కప్పుకొని,
తియ్యటి పండ్లను
తింటుంది.. ఏమిటది?

జవాబు : చిలుక



నా చొక్కా జేబులో రహస్యంగా దాచాను. అది మీకు కనపడలేదు. ఇదిగో తీసుకోండి" అంటూ యాభై రూపాయల నోటు వారి చేతికి ఇవ్వబోయాడు రాము.

ఆ దొంగలముఠా నాయకుడు, రాము నిజాయితీకి సంతోషపడి, అతడిని మెచ్చుకున్నాడు. అంతేకాదు వంద రూపాయలు బహుమానం కూడా ఇచ్చి వెళ్లిపోయాడు.

తన తండ్రి నిజం చెప్పమని ఎందుకు చెప్పాడో రాముకి అర్థం అయ్యింది.

నిజం చెప్పినవారికి ఎల్లవేళలా విజయమే లభిస్తుందని రాము బలంగా నమ్మాడు. ★

## మంచిమాట




సహనం కోల్పోయిన
వ్యక్తికి..
సమాజంలో గౌరవం
లభించదు!



# వారఫలాలు

19-25 ఫిబ్రవరి, 2024



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలలో కొంత జాప్యం. రాబడికి మించి ఖర్చులు ఉంటాయి. ఆరోగ్యసమస్యలు కొంత చికాకు పరుస్తాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సాదా సీదాగా సాగుతాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగు తుంది. రాజకీయనేతలకు కొంత నిరాశ తప్పదు. కళాకారులు, రచయితలకు ఒత్తిడులు. 22,23 తేదీల్లో కీలక నిర్ణయాలు. కార్యజయం. వస్తులాభాలు. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

పనుల్లో ముందడుగు వేస్తారు. ఆదాయం మరింత పెరిగే అవకాశం. కొత్త విద్యావకాశాలు పొందుతారు. కొన్ని వివాదాల నుంచి బయట పడతారు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు అభివృద్ధిదాయకంగా ఉంటాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. వైద్యుల యత్నాలు సఫలం. క్రీడా కారులు, సాంకేతికనిపుణులకు ఆశలు ఫలిస్తాయి. 24,25తేదీల్లో మానసిక ఆందోళన. ఆరోగ్య సమస్యలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి. మీ కృషి ఫలించే సమయం. జీవిత భాగ స్వామితో తగాదాలు తీరతాయి. కాంట్రాక్టర్లకు అనుకూలం. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. కళాకారులకు ఊహించని అవకాశాలు. వైద్యులు, వ్యవసాయ దారులకు కాస్త ఊరట కలుగుతుంది. 19,20 తేదీల్లో ప్రయాణాలు రద్దు. అత్యంత ఆప్తులతో వివాదాలు. శివపంచాక్షరి పఠించండి..

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

అదనపు ఆదాయం సమకూరుతుంది. సన్ని హితులతో వివాదాలు తీరతాయి. మీ అంచనలు నిజమవుతాయి. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపా రాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగులకు చిక్కులు తొలగుతాయి. రాజకీయవేత్తలకు ఊహించని పిలుపు రావచ్చు. సాంకేతిక నిపుణులు, రచయితలకు ఆహ్వానాలు. 23,24 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. సహనం అవసరం. అనారోగ్యం. దత్తాత్రేయస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొన్ని వ్యవహారాలు సకాలంలో పూర్తి. విలువైన వస్తువులు కొంటారు. స్థిరాస్తి వివాదాలు తీరతాయి. వ్యాపారాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు సమస్యలు దూరం కాగలవు. పారిశ్రామికవేత్తలకు విదేశీ ఆహ్వానాలు అందుతాయి.క్రీడాకారులు, వైద్యుల కృషి కొంత ఫలించే సమయం. 22,23 తేదీల్లో దూరప్రయాణాలు. ఒప్పందాలు కొన్ని వాయిదా వేస్తారు. ధనవ్యయం. గణేశ్స్తోత్రాలు పఠిం చండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆదాయం పెరిగి అవసరాలు తీరతాయి. మీ వ్యూహాల అమలులో కుటుంబసభ్యుల సహకారం అందు తుంది. నిరుద్యోగులకు అంచనాలు నిజమవు తాయి.వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. క్రీడాకారులు, వ్యవసాయదారులు మరింత ఉత్సాహంతో ముంద డుగు వేస్తారు. 20,21 తేదీల్లో వృథా ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఓర్పుతో కొన్ని సమస్యల నుండి గట్టెక్కుతారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారాలలో నూతనోత్సాహం. ఉద్యోగులకు క్లిష్టమైన బాధ్యతల నుండి విముక్తి. రాజకీయ వేత్తలకు విదేశీపర్యటనలు ఉంటాయి. రచయితలు, సాంకేతిక నిపుణులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. 19,20 తేదీల్లో మీ నిర్ణయాలు మార్చుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొన్ని కార్యక్రమాలలో వేగం తగ్గినా సమయానికి పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. నిరుద్యోగులకు కొత్త ఆశలు. వ్యాపారాలలో ఒత్తిడులు అధిగమిస్తారు. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. పారిశ్రామికవేత్తలకు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. వైద్యులు, కళాకారులకు ఊహించని అవకాశాలు రావచ్చు. 20,21 తేదీల్లో కొంత ఆందోళన తప్పదు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కార్యక్రమాలలో ఆటంకాలు తొలగుతాయి. విద్యార్థులకు కొత్త విద్యావకాశాలు. రాబడి పెరుగుతుంది. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారాలలో అడుగు ముందుకు వేస్తారు. ఉద్యోగులకు ఊహించని పోస్టులు రావచ్చు. క్రీడాకారులు, సాంకేతిక నిపుణుల దీర్ఘకాలిక కల నెరవేరుతుంది. 22,23 తేదీల్లో ఖర్చులు తగ్గించుకోవాలి. ఆరోగ్యం కొంత ఇబ్బంది కలిగిస్తుంది. ఆంజనేయ దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. మీ సేవలకు తగిన గుర్తింపు లభిస్తుంది. పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. వ్యాపారాలు అభివృద్ధి పథంలో సాగుతాయి. రాజకీయవర్గాలకు మరింత ఉత్సాహం. 20,21 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. ఆప్తుల నుండి సమస్యలు. గణపతిని పూజించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

సంఘంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. ఆదాయం సంతృప్తినిస్తుంది. ఆలయాలు సందర్శి స్తారు. విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. శు భకార్యాల రీత్యా ఖర్చులు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారుల యత్నాలు సఫలం. 19,20 తేదీల్లో శ్రమ తప్ప ఫలితం ఉండదు. వివాదాలకు దూరంగా ఉండండి. లక్ష్మీదేవి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కొత్త కార్యక్రమాలు చేపడతారు.నిర్ణయాలలో మాత్రం కొంత నిదానం అవసరం ఆరోగ్యసమస్యల నుంచి బయటపడతారు. ఆదాయం మరింత పెరుగుతుంది. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో లాభాలు తథ్యం. ఉద్యోగులకు విధులు మరింత తేలికపడతాయి. వైద్యులు, సాంకేతిక నిపుణులకు కొత్త ఆశలు. 22,23 తేదీల్లో కొత్త సమస్యలు ఎదురవుతాయి. అనుకోని ఖర్చులు ఎదురవుతాయి. దుర్గాస్తోత్రం పఠించండి.

# పదరసం-452

## ఆధారాలు

**అడ్డం**

1) వగపు, చేసిన పనికి చింతించుట (4)
4) బుద్ధి, గొప్పతనం (3)
6) ---తలిస్తే దైవమొకటి తలచిందని సామెత (4)
7) తగలాటం, అడ్డంగి లాంటి బాధ్యత (3)
9) అభ్యాసం (3)
10) పాత్ర (2)
11) ప్రతి తెలుగు వారికి ఉండేది (4)
13) చాలా పాత (4)
14) దేవేంద్రుని సారథి (3)
16) బట్టలు (4)
18) నోటి మాటగా వేసే ఓటు (4)
19) ఇంటి పైకప్పుకు వాడే ఆకు (3)
21) విషం (3)
22) నగదు (2)
23) ప్రశ్నలు, సమస్యలు (3)
24) సగం సగం, తెలిసీ తెలియని (4)

**నిలువు**

1) భద్రం (3)
2) పైకొచ్చిన వేడి (2)
3) గోముఖ వ్యాఘ్రం లాంటిది తెలుగులో (6)
5) విడ తీత సరిగా లేదు (4)
8) ముత్తైదువలను పిలిచే శుభకార్యం (పైకి) (3)
9) కప్పం చెల్లించే పరాధీనపు రాజు (5)
11) వంటల్లో ఇది వేస్తే మంచి వాసన, రుచి, ఆరోగ్యం (3)
12) చేతి గుడ్డ (3)
15) ప్రముఖ వరసిద్ధి వినాయకుని క్షేత్రం (4)
17) వానతోపడే మంచు ముక్కలు (4)
18) అన్నీ / అంతా కలిసి ఒకేసారి (4)
19) ఇంటి తలుపులకు వేసేది (2)
20) ఒక ప్రాంతపు భాషారీతి (2)
22) బంగారం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | 3 | | 4 | | 5 |
| | | | 6 | | | | | | |
| 7 | | 8 | | | | | 9 | | |
| | | | | 10 | | | | | |
| 11 | | | 12 | | 13 | | | | |
| | | | 14 | | | | | | 15 |
| 16 | | 17 | | | | 18 | | | |
| | | | | 19 | | | | | |
| 20 | | 21 | | | | | | 22 | |
| 23 | | | | | 24 | | | | |

**పదరసం - 451 సమాధానాలు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వా[1] | ల్మీ | కి[2] | | బూ[3] | | ఆ[4] | రా | ధ | న[5] |
| తా | | చ | | ట[6] | చ్చ | ము | | | ర్ద |
| పి[7] | త | లా | ట | కం | | దం[8] | రం | క[9] | మ |
| | | ట | | | జో[10] | | | సు | |
| ర[11] | స[12] | కం | దా | యం[13] | | ప[14] | | మూ[15] | కు |
| | హ | | | డి | | డ[16] | గ | మీ | |
| | వా[17] | టా | | వ[18] | అ[19] | తి | | | మ[20] |
| తు[21] | సం | | వే[22] | | రి | | కం[23] | రా | ణి |
| రా | | త[24] | ట | ప | టా | యిం | చు | | పూ |
| యి[25] | డా | ల | | | కు | | | థా[26] | ర్ |

సి ని మా

అరుణ

'సూర్య వర్సెస్ సూర్య' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యాడు సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన ఆ సినిమా ఆశించిన స్థాయిలో కాసుల వర్షం కురిపించలేదు. దాంతో ఇప్పుడు రవితేజ నాయకుడిగా 'ఈగిల్' మూవీని రూపొందించాడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదల కావాల్సింది. అయితే... అదే సీజన్ లో మరికొన్ని పెద్ద సినిమాలు ఉండటంతో ఫిల్మ్ ఛాంబర్ పెద్దల వినతి మేరకు వాయిదా పడి ఫిబ్రవరి 9వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గత సంవత్సరం సంక్రాంతికి వచ్చిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ కీలక పాత్ర పోషించారు. అది ఘన విజయం సాధించింది. ఆ తర్వాత ఆయన సోలో హీరోగా చేసిన 'రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు' చిత్రాలు పరాజయం పాలయ్యాయి. దాంతో రవితేజ అభిమానులంతా 'ఈగిల్' మీదనే ఆశలు పెట్టుకున్నారు.




# అక్రమ ఆయుధ రవాణ అరికట్టే

'ఈగిల్' విషయానికి వస్తే... సుపారీ తీసుకుని పనులు చేసే ఓ అంతర్జాతీయ క్రిమినల్ కథ ఇది. విదేశాలలో ఉండే ఈగిల్ (రవితేజ) జీవితంలోకి అనుకోకుండా భారతీయ మహిళ రచన (కావ్యా థాపర్) ప్రవేశిస్తుంది. ఇక్కడి శ్రేష్ఠమైన పత్తితో తయారు చేసే చేనేత చీరలకు అంతర్జాతీయ వేదికపై ప్రచారం తీసుకురావాలని తాపత్రయ పడుతూ ఉంటుంది. అక్రమ ఆయుధాల రవాణాకు సహకరించే ఈగిల్ చేసిన ఓ కాంట్రాక్ట్ కారణంగా అవి అసాంఘిక శక్తుల చేతిలోకి చేరి, రచన లాంటి కొంతమంది అమాయకులు బలిఅవుతారు. దాంతో తన తప్పు తెలుసుకుని రచన జీవిత లక్ష్యాన్ని కొనసాగించడానికి కంకణం కట్టుకుంటాడు ఈగిల్. అలా భారతదేశానికి వచ్చి తలకోన దగ్గర అరుదుగా పండే పత్తి పంటను, దానిని పండించే రెండు గిరిజన తండాలకు దన్నుగా నిలుస్తాడు. ఓ కాటన్ ఫ్యాక్టరీని నడుపుతూ నేత దుస్తులను తయారు చేయిస్తాడు. అలా ప్రశాంత జీవితాన్ని గడుపుతున్న ఈగిల్ జీవితంలోకి అనుకోకుండా వచ్చిన కొందరు వ్యక్తుల కారణంగా ఎలాంటి పరిణామాలు సంభవించాయి, వాటిని అతను ఎలా ఎదుర్కొన్నాడు అనేదే 'ఈగిల్' కథ.

ఈ కథను కార్తీక్ ఘట్టమనేని అసాధారణ రీతిలో తెరకెక్కించే ప్రయత్నం చేశాడు. ఇలా నేరుగా కాకుండా ఫ్లాష్ బ్యాక్‌లో మూవీని నడిపాడు. ఢిల్లీకి చెందిన ఓ యువ జర్నలిస్ట్ నళినీరావు (అనుపమ పరమేశ్వరన్) తలకోనలో సాగువుతున్న పత్తి గురించి, అక్కడి ఫ్యాక్టరీ, దాని యజమాని యేడాది క్రితం అదృశ్యమైన విషయం గురించి దిన పత్రికలో చిన్న వార్త రాస్తుంది. ఆమెను, వార్త ప్రచురించిన మీడియా హౌస్‌ను సీబీఐ అధికారులు చుట్టుముడతారు. దాంతో తలకోన అటవీ ప్రాంతంలో అదృశ్యమైన వ్యక్తి మామూలు వాడు కాదనే విషయం నళినికి బోధపడుతుంది. ఆమె అతని గురించి తెలుసుకోవడం మొదలు పెడుతుంది. ఆ సమాచార సేకరణలో ఈగిల్ ఉరఫ్ సహదేవ్ వర్మకు సంబంధించిన వివరాలు ఒక్కొక్కటిగా ప్రేక్షకుల ముందు ఆవిష్కృతమౌతాయి. దాంతో సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఈగిల్‌కు సంబంధించిన బిల్డప్ షాట్స్ మరీ ఎక్కువ అయిపోయాయి. ఇది కాస్తంత అతి అనిపిస్తుంది. అలా ఫ్యామిలీ ఆడియెన్స్ కంటే... రవితేజ ఫ్యాన్స్‌కు నచ్చే చిత్రంగా 'ఈగిల్' మిగిలిపోయింది. సహజంగా రవితేజ నుండి ప్రేక్షకులు కాస్తంత వినోదాన్ని కోరుకుంటారు. కానీ ఇందులో అందుకు ఆస్కారమే లేదు.కాకపోతే ఆ లోటును రెండు మూడు ఇతర పాత్రల ద్వారా తీర్చే ప్రయత్నం చేశారు.

భారత్‌తో పాటు ప్రపంచ దేశాలలోని అస్థిరతకు, అశాంతికి ప్రధాన కారణం ఆయుధాల అక్రమ రవాణ. వాటిని ఏదో రకంగా సంపాదించి టెర్రరిస్టులు, నక్సలైట్లు దేశ వ్యతిరేక కార్యకాలపాలకు పాల్పడుతూ, యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇదో ప్రధాన సమస్యగా పైకి కనిపించకపోయినా.. చాపకింద నీరులా ఎన్నో ఉపద్రవాలకు కారణం అవుతోంది. మొదటిలో వాటికి సహకరించిన ఓ వ్యక్తి తప్పు తెలుసుకుని దానిని సరిదిద్దే కథే ఇది. ఆ రకంగా చూసినప్పుడు ఇందులో చక్కటి సందేశమూ దాగి ఉంది. కానీ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని దీనిని సంక్లిష్టంగా మార్చేసి, ప్రేక్షకుల హృదయాలలోకి సాఫీగా చేరకుండా చేశారు.

నటీనటుల విషయానికి వస్తే... సహదేవ్ వర్మగా రవితేజ సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. అతనికీ హీరోయిన్‌కు మధ్య ఉన్న ప్రేమ సన్నివేశాలు సైతం చాలా చిన్నవి కావడంతో పాటలకు, డాన్సులకు పెద్దంత ప్రాధాన్యం లేకుండా పోయింది. సీనియర్ హీరోలు కమల్‌హాసన్ 'విక్రమ్', రజనీకాంత్ 'జైలర్'తో పాటు 'కేజీఎఫ్' తాలుకూ ప్రభావం కూడా ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ మీద పడింది. రవితేజ ఈ పాత్రను బాగా అర్థం చేసుకుని నటించాడు. అతని సహాయకుడిగా నటించిన నవదీప్‌దీ చక్కని పాత్రే. కావ్యాథాపర్ కనిపించేది కొద్ది సేపే అయినా ప్రాధాన్యమున్న, అర్థవంతమైన పాత్రను చేసింది. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా అనుపమా పరమేశ్వరన్ చక్కగా నటించింది. ఇతర ప్రధాన పాత్రలను వినయ్ రాయ్, నితిన్ మెహతా, మధుబాల, ప్రణీత పట్నాయక్, అవసరాల శ్రీనివాస్, అజయ్ ఘోష్, శ్రీనివాసరెడ్డి, మిర్చి కిరణ్, శివన్నారాయణ, సూర్య తదితరులు పోషించారు. మణిబాబు కరణం సంభాషణలు బాగున్నాయి. కథ, కథనం, దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, సినిమాటోగ్రఫీలోనూ తనదైన పాత్రను కార్తీక్ ఘట్టమనేని పోషించాడు. పాటలు గొప్పగా ఏమీ లేవు. అయితే నూతన సంగీతం దర్శకుడు దావ్ జండ్ ఇచ్చిన నేపథ్య సంగీతం బాగుంది. యాక్షన్ చిత్రాలను ఇష్టపడే వారికి, రవితేజ అభిమానులకు మాత్రం 'ఈగిల్' నచ్చే ఆస్కారం ఉంది. జయాపజయాలతో నిమిత్తం లేకుండా టెక్నీషియన్స్‌కు ఈ సినిమా మంచి గుర్తింపును తెచ్చిపెడుతుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


## కర్ణాటకలో

# అయోధ్య రాముని పోలిన పురాతన విగ్రహం

ధర్మమే ఆలంబనగా మనుగడ సాగించిన దేశమిది. ఎంతమంది దాడులు, ఆక్రమణలను చేసినా తన అస్తిత్వాన్ని నిలుపుకుని, ఆధునిక భారత్ నేడు తన ధార్మిక  పునర్వైభవం దిశగా అడుగులు వేస్తున్నది.

ఈ క్రమంలోనే ఇటీవలి ఆయోధ్య రామమందిరలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను చూడవచ్చు. ఈ ప్రతిష్ఠ జరిగిన పక్షం నుంచే దేశంలో నలుమూలల నుంచి మన ధర్మానికి సంబంధించిన అనేక చిహ్నాలు బయటపడుతున్నాయి. కాశీ, మధురలను పక్కకు పెడితే, దక్షిణాదిన ఇంకా నిక్కచ్చిగా చెప్పాలంటే కర్ణాటక, రాయచూరులో, దేవసుగురు గ్రామంలో అచ్చం అయోధ్యలో ప్రతిష్ఠించిన విగ్రహం వంటి ప్రాచీన విష్ణుమూర్తి విగ్రహం, శివలింగం కృష్ణానది సమీపంలో నిర్మాణం కోసం జరుపుతున్న తవ్వకాల్లో ఫిబ్రవరి 7వ తేదీన బయిటపడ్డాయి. ఈ విగ్రహాలు, శివలింగం కూడా 10వ శతాబ్దానికి చెందినవాటిగా భావిస్తున్నారు. ఈ విగ్రహాలు చెక్కేందుకు వాడిన శిలను బట్టి అవి 'కళ్యాణ చాళుక్యుల' కాలం నాటివయ్యుంటాయని ఆర్కియాలజిస్టులు చెబుతున్నారు.

ఈ తవ్వకాలలో బయటపడిన విష్ణుమూర్తి విగ్రహాన్ని చూసిన వెంటనే స్థానికులు అవాక్కయ్యారుట. ఎందుకంటే, చూసిన వారు ఎవరికైనా ఆ విగ్రహం దాదాపు అచ్చుగుద్దినట్టు అయోధ్యలోని బాలరాముడిలా అనిపిస్తుంది. ఆకుపచ్చ రంగు కలిసిన శిలతో చేసిన విగ్రహం వెనుక, అయోధ్య రాముని విగ్రహం వెనుక చెక్కినట్టుగానే దశావతారాలు చెక్కి ఉండటంతో తక్షణమే ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ విగ్రహాలను ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు  అప్పగించారు. ఈ ప్రాచీన విగ్రహాలు బయటపడటాన్ని కేవలం ఒక ఆవిష్కరణగా మాత్రమే చూడలేం, దేశం నలుమూలలకూ విస్తరించి, కొనసాగుతున్న సనాతన సాంస్కృతిక వారసత్వ చిహ్నంగా మాత్రమే దీనిని చూడాలి.







From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 15



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.220/-





వెల : ₹.200/-





వెల : ₹.390/-





వెల : ₹.250/-




వెల : ₹.250/-





వెల : ₹.360/-





వెల : ₹.90/-




వెల : ₹.200/-





వెల : ₹.100/-





వెల : ₹.150/-





వెల : ₹.799/-





వెల : ₹.499/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

ఎన్టీఆర్ స్టేడియంలో ఫిబ్రవరి 9 నుండి 19 వరకు జరుగనున్న పుస్తక మహోత్సవంలో 177,178 స్టాళ్లలో, మరియు 303 లో ఉన్న సాహిత్య నికేతన్, నవయుగ భారతి విక్రయ కేంద్రాలను దర్శించండి.

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687